www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 10-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 283 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి ఉ. 10.20 తదుపరి ద్వాదశి; నక్షత్రం: కృత్తిక మ. 1.45 తదుపరి రోహిణి; వర్జ్యం: తె.4.54-6.25; దుర్ముహూర్తం: ఉ.9.03-9.48, మ.12.44-1.28; అమృతఘడియలు: ఉ.11.29-12.59; రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.53 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆంధ్రజ్యోతి
బిజినెస్
వరంగల్ ● శుక్రవారం 10 జనవరి 2025

క్యూ3లో 12% వృద్ధి నమోదు

టీసీఎస్ లాభం రూ.12,380 కోట్లు


కృతివాసన్

రూ.63,973 కోట్లకు కంపెనీ ఆదాయం ● ఒక్కో షేరుకు మొత్తం రూ.76 డివిడెండ్

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25).. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) దేశీయ ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్ రూ.12,380 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి నమోదు చేసిన రూ.11,058 కోట్ల లాభంతో పోలిస్తే 11.95 శాతం వృద్ధి కనబరిచింది. కాగా, ఈ క్యూ3లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 5.6 శాతం వృద్ధితో రూ.63,973 కోట్లకు చేరుకుంది. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఇదే త్రైమాసికానికి రాబడి రూ.60,583 కోట్లుగా నమోదైంది. ఈ క్యూ3లో కంపెనీ నిర్వహణ లాభాల మార్జిన్ 24.5 శాతానికి పెరిగింది. గత క్యూ3లో ఇది 24.1 శాతంగా ఉంది. బీఎస్ఈలో టీసీఎస్ షేరు ధర గురువారం 1.72 శాతం తగ్గి రూ.4,036.65 వద్ద స్థిరపడింది.

1,020 కోట్ల డాలర్ల కొత్త ఆర్డర్లు: ఉత్తర అమెరికా సహా పాశ్చాత్య మార్కెట్లకు క్రిస్మస్ సెలవుల సీజన్ కావడంతో సాధారణంగానే క్యూ3లో ఐటీ రంగ పనితీరు బలహీనపడుతుంది. కానీ, ఈ డిసెంబరు త్రైమాసికంలో టీసీఎస్ 1,020 కోట్ల డాలర్ల విలువైన కొత్త కాంట్రాక్టులు దక్కించుకుంది. గత ఆర్థిక సంవత్సరపు క్యూ3లో లభించిన 810 కోట్ల డాలర్ల కాంట్రాక్టులతో పోలిస్తే 25.93 శాతం అధికవి ఇవి. అంతేకాదు, గత ఐదేళ్లలో మూడో త్రైమాసికానికి కంపెనీ నమోదు చేసిన అత్యధిక కొత్త ఆర్డర్ల విలువ ఇదే.

ప్రణాళికకు అనుగుణంగా ప్రాంగణ నియామకాలు

ఫ్రెషర్ల ప్రాంగణ నియామకాలు (క్యాంపస్ హైరింగ్) ప్రణాళికకు అనుగుణంగా సాగుతున్నాయని టీసీఎస్ మానవ వనరుల చీఫ్ మిలింద్ లక్కడ్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా 40,000 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకోనున్నట్లు కంపెనీ గతంలోనే ప్రకటించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో మరిన్ని అధిక ప్రాంగణ నియామకాలు చేపట్టేందుకు కంపెనీ సిద్ధమవుతోందని లక్కడ్ అన్నారు. అలాగే, మున్ముందు త్రైమాసికాల్లో ఉద్యోగుల వలసలు తగ్గుముఖం పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

రూ.10 మధ్యంతర, రూ.66 ప్రత్యేక డివిడెండ్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను టీసీఎస్ వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.10 మధ్యంతర డివిడెండ్‌తో పాటు రూ.66 ప్రత్యేక డివిడెండ్‌ను ప్రకటించింది. అంటే, ఒక్కో షేరుకు మొత్తం రూ.76 డివిడెండ్ లభించనుంది. ఇందుకు అర్హులైన వాటాదారులను ఈ నెల 17న రికార్డు చేసి, వచ్చే నెల 3న చెల్లింపులు చేపట్టనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి, రెండో త్రైమాసికాల్లో (క్యూ1, క్యూ2)నూ కంపెనీ ఒక్కో షేరుకు రూ.10 చొప్పున మొత్తం రూ.20 మధ్యంతర డివిడెండ్ చెల్లించింది.

ఉద్యోగుల్లో 5,370 మంది తగ్గుదల: క్యూ1, క్యూ2 ట్రెండ్‌కు భిన్నంగా టీసీఎస్‌లో ఉద్యోగులు మళ్లీ తగ్గారు. క్యూ3లో కంపెనీ ఉద్యోగుల సంఖ్య 5,370 తగ్గి 6,07,354కు పరిమితమైంది. గత త్రైమాసికానికి కంపెనీ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 13 శాతానికి పెరిగింది. క్యూ2 అట్రిషన్ రేటు 12.3 శాతంగా ఉంది.

25,000 మందికి ప్రమోషన్లు: గడిచిన మూడు నెలల్లో 25,000 మందికి పైగా ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చినట్లు టీసీఎస్ తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 1.10 లక్షల మందిని పైస్థాయికి ప్రమోట్ చేయడం జరిగిందని కంపెనీ వెల్లడించింది. ఈ సంఖ్య మొత్తం సిబ్బందిలో దాదాపు 20 శాతానికి సమానం.

అన్ని మార్కెట్ల నుంచి సమృద్ధిగా ఆర్డర్లు

గడిచిన త్రైమాసికంలో అన్ని రంగాలు, మార్కెట్ల నుంచి సమృద్ధిగా ఆర్డర్లు లభించాయని, కంపెనీ దీర్ఘకాలంలో మెరుగైన వృద్ధి కనబరిచేందుకు ఇది దోహదపడనుందని టీసీఎస్ సీఈఓ కే కృతివాసన్ అన్నారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ), కన్స్యూమర్ వ్యాపారాలు మళ్లీ పుంజుకుంటున్నాయని, కొన్ని వ్యాపార విభాగాల్లో ఐటీ వ్యయాలు మళ్లీ పెరుగుతున్నాయన్న ప్రాథమిక సంకేతాలున్నాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ రెండు అంశాలతోపాటు స్థానిక మార్కెట్లో బలమైన పనితీరు కొనసాగడం కంపెనీ భవిష్యత్‌పై ధీమాను పెంచిందన్నారు.

బెంగళూరులో రూ.1,625 కోట్లకు భారీ స్థలం కొనుగోలు: ఐటీ హబ్ బెంగళూరులో భారీ స్థలాన్ని తమ గ్రూప్‌నకు చెందిన కంపెనీ నుంచి రూ.1,625 కోట్లకు కొనుగోలు చేసినట్లు టీసీఎస్ తెలిపింది.

కృత్రిమ మేధతో మరిన్ని ఉద్యోగాలు: కృత్రిమ మేధ (ఏఐ) మరిన్ని ఉద్యోగాలు సృష్టించనుందని టీసీఎస్ సారథి కృతివాసన్ అన్నారు. ఈ ఆధునిక సాంకేతికత కారణంగా ప్రస్తుత ఉద్యోగాల్లో కొన్ని క్రమంగా కనుమరుగైనప్పటికీ, సరికొత్త విధులతో కూడిన కొత్త ఉద్యోగాలు భారీ సంఖ్యలో పుట్టుకురానున్నాయని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో ఎలీ లిల్లీ జీసీసీ

1,000కి పైగా నియామకాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయనున్నట్టు ఫార్మా దిగ్గజం ఎలీ లిల్లీ ప్రకటించింది. డిజిటల్ వ్యూహాన్ని పటిష్ఠం చేసుకుని మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలుగా 1,000కి పైగా నియామకాలు చేపట్టనున్నట్టు తెలిపింది. లిల్లీ క్యాపబిలిటీ సెంటర్ ఇండియాగా (ఎల్‌సీసీఐ) వ్యవహరించే ఈ కేంద్రం ప్రపంచవ్యాప్తంగా తమ అవసరాలకు అనుగుణంగా ఆటోమేషన్, కృత్రిమ మేధ, సాఫ్ట్‌వేర్ ప్రోడక్ట్ ఇంజనీరింగ్, క్లౌడ్ కంప్యూటింగ్‌లో తమ సామర్థ్యాలు విస్తరించేందుకు కృషి చేస్తుందని కంపెనీ వెల్లడించింది. ఈ ఏడాది మధ్య కాలానికి ఈ జీసీసీ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని పేర్కొంది. కాగా నియామకాల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపింది. ప్రస్తుతం కంపెనీ బెంగళూరులో ఒక ఎల్‌సీసీఐ నిర్వహిస్తోంది. ప్రపంచం ఎదుర్కొంటున్న అతి తీవ్రమైన ఆరోగ్య సవాళ్లకు పరిష్కారాలు చూపే ఆధునిక టెక్నాలజీలు, సాధనాలు తయారు చేయగల వివిధ రంగాలకు చెందిన ఇంజనీర్లను ఎల్‌సీసీఐ హైదరాబాద్ సమీకరిస్తుందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డియోగో రౌ చెప్పారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో పెరుగుతున్న హైదరాబాద్ ప్రాబల్యానికి ఈ పెట్టుబడి నిదర్శనమని తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.

ఫిలిప్పీన్స్ జేవీకి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ గుడ్‌బై

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఫిలిప్పీన్స్‌లో మెగావైడ్ కన్‌స్ట్రక్షన్స్ కార్పొరేషన్‌తో కలిసి ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్ (జేవీ) సంస్థ మెగావైడ్ జీఎంఆర్ కన్‌స్ట్రక్షన్ జేవీ నుంచి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ తప్పుకుంది. ఈ జేవీ ఈక్విటీలో తన అనుబంధ కంపెనీ జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇంటర్నేషనల్ బీవీ (జీఏఐబీవీ)కి ఉన్న 50 శాతం వాటాను భాగస్వామ్య సంస్థ మెగావైడ్ కన్‌స్ట్రక్షన్స్ కార్పొరేషన్‌కు 13.65 లక్షల డాలర్లకు (సుమారు రూ.11.71 కోట్లు) విక్రయించినట్టు తెలిపింది. గత నాలుగేళ్లుగా ఈ జేవీకి ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు లేకపోవడంతో జీఎంఆర్ గ్రూప్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

ఎంఎస్ఎంఈల కోసం కొత్త పరపతి హామీ పథకం

న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) రుణ అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం త్వరలో కొత్త పరపతి హామీ పథకం తీసుకురాబోతోంది. ఈ పథకం ద్వారా ఎంఎస్ఎంఈలకు ఎలాంటి హామీ లేకుండా రూ.100 కోట్ల వరకు రుణాలు లభిస్తాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) కార్యదర్శి నాగరాజు చెప్పారు. ఈ పథకం కింద తీసుకునే రుణాలు రూ.100 కోట్లు మించినా, రూ.100 కోట్ల వరకు ఈ పరపతి హామీ పథకం కింద, వాటి రుణ చెల్లింపులకు హామీ లభిస్తుంది. అయితే రుణం తీసుకునేటప్పుడే ఆ ఎంఎస్ఎంఈ కొంత హామీ ఫీజుగా చెల్లించాలి. ఆ తర్వాత ఏటా మిగిలిన రుణ చెల్లింపునకు హామీ ఫీజు చెల్లిస్తుండాలి.

సెమీకండక్టర్ల తయారీకి తెలంగాణ అనుకూలం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): సెమీకండక్టర్ల తయారీకి తెలంగాణ అనుకూలంగా ఉందని 'చిప్ వార్' పుస్తక రచయిత డాక్టర్ క్రిస్ మిల్లర్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంటుందన్నారు. గురువారం టీ-హబ్‌లో ఐటీ శాఖ, వీఎల్ఎస్ఐ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన 'మేకింగ్ ఇండియా ఏ సెమీకండక్టర్ ప్రొడక్ట్ నేషన్' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టెక్నాలజీ రోజు రోజుకీ కొత్త పుంతలు తొక్కుతుందని, ఈ క్రమంలోనే సెమీకండక్టర్లకు ప్రాధాన్యం పెరిగిందని వివరించారు. భవిష్యత్తులో సెమీకండక్టర్ల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న దేశాలే మార్కెట్‌ను శాసిస్తాయన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

10వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	515
వరంగల్	492	గోదావరి	515
చిత్తూరు	523	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	114	విజయవాడ	116
వరంగల్	114	గుంటూరు	115
కరీంనగర్	114	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	95
కర్నూలు	114	నెల్లూరు	100
విశాఖపట్నం	107	అనంతపురం	100
గోదావరి	116		

బీ న్యూలో సంక్రాంతి ఆఫర్లు



హైదరాబాద్: మొబైల్స్ రిటైల్ సంస్థ బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్.. సంక్రాంతి సందర్భంగా పలు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. మొబైల్స్‌తో పాటు గృహోపకరణాలపై కూడా ఆఫర్లు అందుబాటులో ఉంటాయని సంస్థ సీఈఓ వై సాయి నిఖిలేష్ తెలిపారు. ల్యాప్‌టాప్, టీవీలపై రూ.20,000 వరకు క్యాష్‌బ్యాక్ సహా ఎంపిక చేసిన మొబైల్స్‌పై 50 శాతం వరకు, యాక్సెసరీస్‌పై 80 శాతం వరకు డిస్కౌంట్‌ను అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే బజాజ్ ఫైనాన్స్ ద్వారా స్మార్ట్‌ఫోన్, టీవీ, ల్యాప్‌టాప్ కొనుగోలు చేస్తే రూ.5,000 వరకు క్యాష్‌బ్యాక్‌ను ఇవ్వనున్నట్లు నిఖిలేష్ తెలిపారు. ఐఫోన్ కొనుగోలుపై భారీ డిస్కౌంట్‌తో పాటు రూ.5,000 వరకు క్యాష్‌బ్యాక్‌ను పొందవచ్చని తెలిపారు. జీరో డౌన్ పేమెంట్, నో కాస్ట్ ఈఎంఐ విధానంలో స్మార్ట్‌ఫోన్‌ను తమ షోరూమ్స్‌లో కొనుగోలు చేయవచ్చన్నారు. సంక్రాంతి ప్రత్యేక ఆఫర్ కింద ప్రతి కొనుగోలుపై ఒక ఈఎంఐ ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని 150కి పైగా ఉన్న బీ న్యూ షోరూమ్స్‌లో సంక్రాంతి ఆఫర్లు అందుబాటులో ఉంటాయని సంస్థ సీఎండీ వైడీ బాలాజీ చౌదరి తెలిపారు.

ప్రత్యేక యాప్ ద్వారా ఇన్‌స్టామార్ట్ సేవలు

న్యూఢిల్లీ:ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సేవల ప్లాట్‌ఫామ్ స్విగ్గీ.. తన క్విక్ కామర్స్ సేవల విభాగమైన ఇన్‌స్టామార్ట్ కోసం ప్రత్యేక యాప్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపింది. కంపెనీ క్విక్ కామర్స్ సేవల విస్తరణ ప్రయత్నాల్లో స్విగ్గీకి ఇది కీలక మైలురాయి కానుంది. భవిష్యత్‌లో స్విగ్గీ ఫుడ్ డెలివరీ సేవలను ఇన్‌స్టామార్ట్ మించిపోవచ్చని స్విగ్గీ వ్యవస్థాపకులు, సీఈఓ శ్రీహర్ష మాజేటి ధీమా వ్యక్తం చేశారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,200 ▲	72,600 ▲	1,00,000 ▲
విజయవాడ	80,200 ▲	75,500 ▲	92,500 ▲
విశాఖపట్నం	78,350 ▲	71,820 ▲	91,820 ▲
రాజమండ్రి	79,200 ▲	72,600 ▲	92,300 ▲
ప్రొద్దుటూరు	79,300 ▲	73,430 ▲	92,100 ▼
ముంబై	77,618 ▲	71,098 ▲	89,800 ▲

అమ్మకాల హోరుతో మార్కెట్ డౌన్

ముంబై: డిసెంబరు త్రైమాసిక ఆదాయాల వృద్ధిపై నెలకొన్న భయాల కారణంగా మార్కెట్ దిగ్గజాలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, రిలయన్స్ కౌంటర్లలో జరిగిన భారీ అమ్మకాలు మార్కెట్‌ను కుంగదీశాయి. చైనా విడుదల చేసిన ద్రవ్యోల్బణం గణాంకాలు, అమెరికా బాండ్లలో భారీ అమ్మకాలు, ఆసియా మార్కెట్ల నుంచి అందిన బలహీన సంకేతాలు కూడా గురువారం మార్కెట్‌ను ప్రభావితం చేశాయి. దీంతో సెన్సెక్స్ 528.28 పాయింట్లు నష్టపోయి 77,620.21 వద్ద ముగిసింది. నిఫ్టీ 162.45 పాయింట్ల నష్టంతో 23,526.50 వద్ద ముగిసింది. అమెరికాలో 10 సంవత్సరాల బాండ్ల రాబడులు 2024 ఏప్రిల్ తర్వాత గరిష్ఠ స్థాయిలకు చేరాయని, దీనివల్ల అమెరికా ఫెడ్ రిజర్వ్ తక్కువ సార్లు మాత్రమే వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న భయాలు బాండ్లలో అమ్మకాలను ప్రేరేపించాయని జియోజిత్ ఫైనాన్షియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

లెన్స్‌కార్ట్ రూ.8,500 కోట్ల ఐపీఓ: కళ్లద్దాల విభాగంలో కార్యకలాపాలు సాగిస్తున్న స్టార్టప్ కంపెనీ లెన్స్‌కార్ట్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇష్యూ ద్వారా 100 కోట్ల డాలర్లు (రూ.8,500 కోట్లు) సమీకరించాలని భావిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరికి స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ కావాలని, అప్పటికి 700 కోట్ల నుంచి 800 కోట్ల డాలర్ల (రూ.59,500 నుంచి 68,000 కోట్లు) విలువ సాధించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. 20 కోట్ల నుంచి 30 కోట్ల డాలర్ల విలువ గల సెకండరీ షేర్ల అమ్మకాలు పూర్తి చేసినట్టయితే కంపెనీ విలువ 20 శాతం పెరిగి 600 కోట్ల డాలర్లకు చేరుతుందని గత నవంబరులో అంచనా వేశారు. కంపెనీ ఇప్పటికే ఫిడెలిటీ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్, టెమాసెక్ నుంచి 20 కోట్ల డాలర్లు సమీకరించింది. 2010 సంవత్సరంలో స్థాపించిన లెన్స్‌కార్ట్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 2000 స్టోర్లను నిర్వహిస్తోంది.

స్పోర్ట్స్

అమ్మాయిలూ... ఉ. 11 నుంచి స్పోర్ట్స్-18లో

అదరగొట్టండి!


గాబీ లూయిస్
మంధాన

- మంధాన కెప్టెన్సీలో దూకుడుగా భారత్
- ఐర్లాండ్‌తో తొలి వన్డే నేడు

రాజ్‌కోట్: వెస్టిండీస్ సిరీస్‌లో అదరగొట్టిన భారత మహిళల జట్టు.. అదే జోరును కొనసాగించాలనుకొంటోంది. ఐర్లాండ్‌తో తొలి ద్వైపాక్షిక సిరీస్‌లో భాగంగా.. శుక్రవారం జరగనున్న మొదటి వన్డేలో డాషింగ్ బ్యాటర్ స్మృతి మంధాన నేతృత్వంలో భారత్ బరిలోకి దిగనుంది. వరల్డ్‌కప్ నేపథ్యంలో యువ క్రికెటర్లను పరీక్షించడానికి మేనేజ్‌మెంట్‌కు ఇదో సువర్ణావకాశం. విండీస్‌తో టీ20 సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకొన్న భారత్.. వన్డే సిరీస్‌ను 3-0తో దక్కించుకొంది. ఈ రెండు ఫార్మాట్లలోనూ పరుగుల వరద పారించిన మంధాన అదే ఫామ్‌ను కొనసాగించాలనుకొంటోంది. హర్మన్‌ప్రీత్ కౌర్‌కు విశ్రాంతినివ్వడంతో.. మిడిలార్డర్‌లో హర్లీన్ డియోల్, ప్రతీక, జెమీమా కీలకంగా మారారు. విండీస్‌తో వన్డే సిరీస్‌లో డియోల్ సెంచరీ నమోదు చేసింది. ఓపెనర్‌గా ప్రతీక మెరుగ్గా రాణిస్తోంది. అయితే, పేసర్ రేణుకా సింగ్ గైర్హాజరీలో టిటాస్ సాధు, సైమా ఠాకూర్‌పై భారం పడనుంది. దీప్తి శర్మ, ప్రియా మిశ్రా, తనూజ కన్వర్‌తో స్పిన్ విభాగం బలంగానే ఉంది. ఆల్‌రౌండర్లు రాఘవి బిస్త్, సయాలిపై అందరి దృష్టి ఉండే అవకాశం ఉంది. మరోవైపు గాబీ లూయిస్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న ఐర్లాండ్‌కు భారత్‌ను ఎదుర్కోవడం సవాలే. ఈ రెండు జట్లు వన్డేల్లో 12 సార్లు తలపడగా ఐర్లాండ్ ఒక్కసారి కూడా గెలవలేదు. అయితే, ఈసారి గెలిచి సత్తాచాటుతామని గాబీ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తోంది. ఆల్‌రౌండర్ ఓర్లా పెండర్‌గాస్ట్‌కు బిగ్ బాష్‌లో ఆడిన అనుభవం ఉంది.




క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ

ప్రణయ్ పరాజయం

కౌలాలంపూర్: భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి మలేసియా సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. అయితే పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్ పోరాడి ఓడాడు. గురువారం జరిగిన డబుల్స్ రెండో రౌండ్‌లో సాత్విక్/చిరాగ్ జంట 21-15, 21-15తో స్థానిక ద్వయం అజ్రిన్/టాన్‌పై గెలుపొందింది. హోరాహోరీగా సాగిన సింగిల్స్ రౌండ్-16 పోరులో ప్రణయ్ 8-21, 21-15, 21-13తో లి షి ఫెంగ్ (చైనా) చేతిలో ఓటమితో టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాడు. మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో మాళవికా బన్సోడ్ 18-21, 11-21తో ప్రపంచ ఐదో ర్యాంకర్ హాన్ యూ (చైనా) చేతిలో పరాజయం పాలైంది. ఇక మహిళల డబుల్స్‌లో గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ జంట 21-15, 19-21, 19-21తో చైనా ద్వయం జియా యి/జాంగ్ షు చేతిలో పోరాడి ఓడిపోయింది. మిక్స్‌డ్‌లో సతీష్ కరుణాకరన్/ఆద్య 10-21, 17-21తో నాలుగో సీడ్ సూన్/షెవాన్ (మలేసియా) చేతిలో పరాజయం పాలయ్యారు.

బుమ్రా సంగతేంటి?



బుమ్రా

షమికి అవకాశం
చాంపియన్స్ ట్రోఫీ జట్టుపై ఊహాగానాలు

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ప్రాతినిధ్యంపై సస్పెన్స్ కొనసాగుతోంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో విశేషంగా రాణించిన అతడు సిడ్నీ టెస్టులో గాయపడిన విషయం తెలిసిందే. దీంతో ముందు జాగ్రత్తగా ఇంగ్లండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌ల్లో విశ్రాంతినిస్తారని భావిస్తున్నారు. కానీ వచ్చే నెల 19 నుంచి పాక్, దుబాయ్‌లో చాంపియన్స్ ట్రోఫీ జరుగబోతోంది. ఈ మెగా టోర్నీకి బుమ్రా అందుబాటులో ఉంటాడా? లేడా? అనేది ఉత్కంఠగా మారింది. ఈ ఆదివారం లోపు టీమిండియా ప్రాథమిక జట్టును ప్రకటించాల్సి ఉంది. ఈ జట్టులో ఎలాగూ మార్పులు చేసుకునే సౌలభ్యం ఉండడంతో 15 మందితో కూడిన టీమ్‌లో బుమ్రా పేరును చేర్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఇక టోర్నీ ఆరంభం నాటికి అతను పూర్తి ఫిట్‌నెస్ సాధించి బౌలింగ్ చేయగలిగితే.. తుది జట్టులో ఉంటాడు. ప్రస్తుతానికైతే బుమ్రా గాయం తీవ్రతపై బీసీసీఐ ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఒకవేళ అతడి గాయం గ్రేడ్ 3 విభాగంలో ఉంటే మాత్రం కోలుకునేందుకు మూడు నెలల సమయం పడుతుంది. అదే జరిగితే ఇంగ్లండ్‌తో సిరీస్‌లతోపాటు చాంపియన్స్ ట్రోఫీ, ఐపీఎల్‌లో ఆడేది కూడా సందేహంగా మారుతుంది. ఈనేపథ్యంలో భారత బౌలింగ్ విభాగం బలహీనంగా మారుతుంది.

షమి ఖాయమే..

బుమ్రా మాదిరే మరో వెటరన్ పేసర్ మహ్మద్ షమి రీఎంట్రీ గురించి కూడా ఆసక్తికర చర్చ జరుగుతోంది. అతను అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమై ఏడాదికి పైగా అవుతోంది. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో గాయపడ్డాక షమి జాతీయ జట్టుకు ఆడలేకపోయాడు. ప్రస్తుతం దేశవాళీల్లో విశేషంగా రాణిస్తుండడం అతడికి సానుకూలాంశం కానుంది. ఆసీస్ టూర్‌కు వెళ్తాడని భావించినా అతడి మోకాలు వాపునకు గురి కావడంతో సాధ్యం కాలేదు. ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతూ ఫిట్‌నెస్ నిరూపించుకుంటున్నాడు. అటు సెలెక్టర్లు కూడా షమిని జాగ్రత్తగా గమనిస్తున్నారు. జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) నుంచి తుది అనుమతి లభిస్తే షమి టీమిండియాలోకి రావడం సులువవుతుంది. ఒకవేళ బుమ్రా అందుబాటులో లేకపోయినా షమి రాకతో పేస్ విభాగం జట్టుకు అండగా ఉంటుంది.



కివీస్ వైద్యుడిని సంప్రదించిన బుమ్రా

ప్రస్తుతం వెన్నునొప్పితో బాధపడుతున్న బుమ్రా న్యూజిలాండ్‌కు చెందిన ఆర్థోపెడిక్ సర్జన్ రోవన్ స్కౌటెన్‌ను సంప్రదించినట్టు సమాచారం. 2023లో అతనే బుమ్రాకు చికిత్స చేశాడు. అలాగే బీసీసీఐ మెడికల్ టీమ్ తోనూ సర్జన్ టచ్‌లో ఉన్నట్టు, ఏ విషయం సెలెక్టర్లకు త్వరలోనే తెలుపుతారని బోర్డు వర్గాలు పేర్కొంటున్నాయి.

13 నుంచి

ఖో–ఖో వరల్డ్ కప్



- 20 పురుషుల, 19 మహిళల జట్లు
- లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు

న్యూఢిల్లీ: మొట్టమొదటి ఖోఖో ప్రపంచ కప్ ఈనెల 13 నుంచి 19 వరకు ఇక్కడి ఇందిరా గాంధీ స్టేడియంలో జరగనుంది. భారత ఒలింపిక్ సంఘం పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న ఈ మెగా టోర్నమెంట్‌లో..20 పురుషుల, 19 మహిళల జట్లు పాల్గొంటున్నాయి. తొలుత గ్రూపు మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అనంతరం నాకౌట్ దశ పోటీలు జరుగుతాయి. ఒక్కో గ్రూపులో తొలి రెండు స్థానాలలో నిలిచే జట్లు క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

భారత కెప్టెన్లు ప్రతీక్, ప్రియాంక: ఖోఖో ప్రపంచ కప్‌లో తలపడే భారత పురుషులు, మహిళల జట్లను గురువారం ప్రకటించారు. పురుషుల జట్టుకు ప్రతీక్ వైకర్, మహిళల జట్టుకు ప్రియాంక ఇంగ్లే సారథ్యం వహించనున్నారు.

మహిళలు: **గ్రూప్-ఎ:** భారత్, ఇరాన్, మలేసియా, దక్షిణ కొరియా; **గ్రూప్-బి:** ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, కెన్యా, ఉగాండా, నెదర్లాండ్స్; **గ్రూప్-సి:** నేపాల్, భూటాన్, శ్రీలంక, జర్మనీ, బంగ్లాదేశ్; **గ్రూప్-డి:** దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, పోలెండ్, పెరూ, ఇండోనేసియా; **పురుషులు:** **గ్రూప్-ఎ:** భారత్, నేపాల్, పెరూ, భూటాన్, బ్రెజిల్ ;**గ్రూప్-బి:** దక్షిణకొరియా, ఘనా, అర్జెంటీనా, నెదర్లాండ్స్, ఇరాన్ **గ్రూప్-సి:** బంగ్లాదేశ్, శ్రీలంక, దక్షిణకొరియా, అమెరికా, పోలెండ్; **గ్రూప్-డి:** ఇంగ్లండ్, జర్మనీ, మలేసియా, ఆస్ట్రేలియా, కెన్యా.

క్వార్టర్స్‌కు రాజస్థాన్, హరియాణా
విజయ్ హజారే ట్రోఫీ

వడోదర: అభిజిత్ తోమర్ (111) అదిరే శతకంతో.. రాజస్థాన్ విజయ్ హజారే ట్రోఫీ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో రాజస్థాన్ 19 పరుగుల తేడాతో తమిళనాడుపై గెలిచింది. తొలుత రాజస్థాన్ 47.3 ఓవర్లలో 267 పరుగులకు ఆలౌటైంది. వరుణ్ చక్రవర్తి 5 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో తమిళనాడు 47.1 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌటైంది. ట్రోఫీ చరిత్రలో తమిళనాడుపై రాజస్థాన్ గెలవడం ఇదే తొలిసారి.

షమి 3 వికెట్లు పడగొట్టినా.. : మరో ప్రీక్వార్టర్స్ మ్యాచ్‌లో హరియాణా 72 పరుగుల తేడాతో బెంగాల్‌ను చిత్తు చేసింది. తొలుత హరియాణా 298/9 స్కోరు చేసింది. నిశాంత్ (64, 2/36), పార్థ్ (62, 3/33) అర్ధ శతకాలు సాధించారు. షమి 3 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో బెంగాల్ 43.1 ఓవర్లలో 226 పరుగులకు ఆలౌటైంది.

భిన్న పార్శ్వాలలో సిన్నర్, జొకో

ఆస్ట్రేలియన్ ఓపెన్ డ్రా

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ డ్రాలను గురువారం ప్రకటించారు. డిఫెండింగ్ చాంపియన్ జానిక్ సిన్నర్, 10 సార్లు విజేత నొవాక్ జొకోవిచ్ వేర్వేరు పార్శ్వాలనుంచి బరిలోకి దిగుతున్నారు. ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఈనెల 12న ఇక్కడ ప్రారంభం కానుంది. సిన్నర్, జొకో వేర్వేరు పార్శ్వాలనుంచి తలపడుతున్న దరిమిలా..గత ఏడాది మాదిరిగా వీరిద్దరూ ఈసారి సెమీఫైనల్లో పరస్పరం ఢీకొనే అవకాశాలు లేవు. తొలి రౌండ్‌లో నికోలస్ జారీని ఎదుర్కోనున్న సిన్నర్ తదనంతరం టేలర్ ఫ్రిట్జ్, బెన్ షెల్టన్, మెద్వెదెవ్‌తో అమీతుమీ తేల్చుకుంటాడు. ఇక.. జొకోవిచ్ మొదటి రౌండ్‌లో భారత మూలాలున్న అమెరికా ఆటగాడు నిషేష్ బసవా రెడ్డిని ఢీకొంటాడు. తన గ్రూపులోనే ఉన్న ప్రపంచ మూడో ర్యాంకర్ అల్కారజ్‌తో జొకో క్వార్టర్‌ఫైనల్లో తలపడే చాన్సుంది. ఈ మ్యాచ్ విజేత వరల్డ్ నెం.2 జ్వెరెవ్‌ను ఢీకొనే అవకాశముంది. మహిళల విభాగంలో నిరుటి చాంపియన్ అర్యానా సబలెంక మొదటి రౌండ్‌లోనే కఠినమైన ప్రత్యర్థితో తలపడాల్సి వస్తోంది. 2017 యూఎస్ ఓపెన్ చాంపియన్ స్లోన్ స్టీఫెన్స్‌ను ఈ రౌండ్‌లో సబలెంక ఢీకొననుంది. అంచనాలకు అనుగుణంగా టోర్నీ సాగితే సబలెంకకు సెమీఫైనల్లో మూడో సీడ్ కొకొ గాఫ్ ఎదురుపడనుంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ మాజీ చాంపియన్ సోఫియా కెనిన్ మొదటి రౌండ్‌లో గాఫ్‌కు సవాలు విసరనుంది.

చెక్ ఆటగాడితో నగాల్ ఢీ: భారత అత్యుత్తమ సింగిల్స్ ఆటగాడు సుమిత్ నగాల్ చెక్ రిపబ్లిక్‌కు చెందిన వరల్డ్ నెం. 26 టోమస్ మకాక్‌తో తలపడనున్నాడు. నగాల్ ప్రస్తుతం ఏటీపీ ర్యాంకుల్లో 96వ స్థానంలో ఉన్నాడు.



ఎవరీ బసవారెడ్డి?

ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలిరౌండ్‌లో దిగ్గజ ఆటగాడు నొవాక్ జొకోవిచ్‌తో తలపడబోయే ఆటగాడు తెలుగు మూలాలున్న 19 ఏళ్ల అమెరికా టెన్నిస్ ఆటగాడు నిషేష్ బసవారెడ్డి. ర్యాంకింగ్స్‌లో 133వ స్థానంలో ఉన్న ఈ కుర్రాడు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వైల్డ్‌కార్డ్ ద్వారా బరిలోకి దిగుతున్నాడు. నెల్లూరుకు చెందిన నిషేష్ తల్లిదండ్రులు 1999లో అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో తరలి వెళ్లారు. తన ఆరాధ్య ఆటగాడైన జొకోవిచ్‌తో తలపడనుండడం ఎంతో సంతోషంగా, ఉద్వేగంగా ఉందన్నాడు నిషేష్. ప్రతిష్ఠాత్మక స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ మాజీ విద్యార్థి అయిన నిషేష్ గత ఏడాదే ప్రొఫెషనల్‌గా మారాడు. కాగా డబుల్స్‌లో భారత మూలాలున్న మరో ఆటగాడు రాజీవ్‌రామ్ తనకు మార్గదర్శనం చేశాడని నిషేష్ చెప్పాడు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 10-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 283 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

బాలికల వసతి గృహాలకు..

29 మంది మహిళా ఐఏఎస్‌లు

రాత్రిళ్లు బస చేయండి.. నివేదిక ఇవ్వండి

ఈ నెల 25 లోపు పరిశీలన పూర్తి చేయండి

సీఎస్ ఆదేశం.. వారి నివేదిక ఆధారంగా సమీక్ష

10

28 మంది ఎమ్మెల్యేలపై

పెదవి విరుపు

నియోజకవర్గాలపై శీతకన్ను.. ప్రజలు, కార్యకర్తలకు దొరకరు

వీరిలో ఎనిమిది మంది పూర్తిగా దూరం

ఎమ్మెల్యేల పనితీరుపై ముఖ్యమంత్రి సర్వే

రెడ్, ఆరెంజ్, గ్రీన్ జోన్లుగా విభజన

రెడ్ జోన్లో ముగ్గురు,

ఆరెంజ్ జోన్లో ఇద్దరు మంత్రులు!

స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం

పద్ధతి మార్చుకోవాలని

సూచించిన సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయాలనుకుంటున్న అధికార పార్టీకి ఎమ్మెల్యేల పనితీరు పెద్ద అడ్డంకిగా మారిందా? పార్టీ ఎమ్మెల్యేల్లో దాదాపు 40 శాతం మంది నియోజకవర్గాలపై శీతకన్ను వేశారా?... ఈ ప్రశ్నలకు ఔననే బదులిస్తున్నాయి ఆ పార్టీ వర్గాలు. ఇకనైనా ఆ ఎమ్మెల్యేలు తీరు మార్చుకోకుంటే స్థానిక ఎన్నికల్లో ఒకింత ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందన్న ఆందోళనా వ్యక్తం చేస్తున్నాయి. ఈ నెల 1న తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ అందరి రిపోర్టు కార్డులు తన దగ్గర ఉన్నాయని చెప్పిన సంగతి తెలిసిందే. గత ఏడాది ఎలా గడిచినా ఇక మీదట నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలతో మమేకమై వారి సాధకబాధకాలు పట్టించుకోవాలనీ సూచించారు. సీఎం వ్యాఖ్యల నేపథ్యంలో ఏ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉందన్న ఆసక్తి ఇటు ప్రజలు, అటు పార్టీ శ్రేణుల్లోనూ నెలకొంది. ఏడాది పాలన, త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తనతో సహా పార్టీ ఎమ్మెల్యేల పనితీరుపైన సీఎం రేవంత్‌రెడ్డి స్వతంత్ర సంస్థతో ఆయా నియోజకవర్గాల్లో సర్వే చేయించినట్లు గాంధీ భవన్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆ సర్వేలో విస్తుబోయే అంశాలు వెలుగులోకి వచ్చినట్లు చెబుతున్నారు. మొత్తం 65 మంది ఎమ్మెల్యేల్లో 28 మంది వరకు నియోజకవర్గానికి సమయం కేటాయించట్లేదని సర్వేలో తేలినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో 8 మంది తమ నియోజకవర్గ ప్రజలకు పూర్తిగా దూరమైనట్లు చెబుతున్నారు. సర్వే చేసిన సంస్థ.. ఎమ్మెల్యేల పనితీరు ఆధారంగా రెడ్, ఆరెంజ్, గ్రీన్ జోన్లుగా విభజించినట్లు తెలుస్తోంది. నియోజకవర్గ ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తే ఆ ఎమ్మెల్యేలను గ్రీన్ జోన్‌లో ఉంచినట్లు చెబుతున్నారు. 37 మంది గ్రీన్ జోన్‌లో ఉన్నట్లు సమాచారం. ఆశించిన స్థాయిలో ప్రజలు, కార్యకర్తలకు సమయం

మిగతా 10వ పేజీలో...

పంచాయతీ ఉద్యోగులకు

జీతాలు

ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో

ప్రతి నెలా వేతనాలు చెల్లింపు

ఉపాధి బిల్లులూ మంజూరు చేయండి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ముఖ్యమంత్రి శుభవార్త చెప్పారు. పంచాయతీల్లో పనిచేస్తున్న 92,351 మంది ఉద్యోగులకు ఇకపై ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో ముఖ్యమంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీల్లో పనిచేసే ఉద్యోగులకు వేతనాల కింద ప్రతి నెలా రూ.116 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని, ఈ చెల్లింపుల్లో ఆలస్యం లేకుండా స్పష్టమైన విధానాన్ని అనుసరించాలని పంచాయతీరాజ్, ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి గ్రామ స్థాయి ఉద్యోగుల జీతాలను ప్రతి నెలా

మిగతా 10వ పేజీలో...

విమానాశ్రయంతో

మహా వరంగల్

ఓఆర్ఆర్, రేడియల్ రోడ్ల అనుసంధానం

మామునూరుపై సమీక్షలో ముఖ్యమంత్రి

నేడు కలెక్టర్లతో సీఎం సమావేశం

రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కార్డుల పంపిణీపై దిశా నిర్దేశం

ఇందిరమ్మ ఇళ్ల పథకంపైనా సూచనలు!

10



ఏసీబీ విచారణ తర్వాత తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌కు హారతి ఇస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

ప్రశ్నకు ప్రశ్నే జవాబు

ఏసీబీ అధికారుల ప్రశ్నలకు కేటీఆర్ కౌంటర్లు

ఫార్ములా-ఈ కేసులో ఆరున్నర గంటల విచారణ

మాజీ మంత్రికి పలు కోణాల్లో 50కి పైగా ప్రశ్నలు

రేసింగ్ అనుభవం లేని కంపెనీకి కాంట్రాక్టు ఎలా ఇచ్చారు?.. టెండర్లు ఎందుకు పిలవలేదు?

స్పాన్సరర్ తప్పుకొంటే చర్యలు తీసుకోలేదేం?

క్యాబినెట్ అనుమతి లేకుండా నిర్ణయం ఎలా?

కోడ్ ఉండగా.. నిధులు ఎలా ఇస్తారు?: ఏసీబీ

హైదరాబాద్‌కు బ్రాండ్ ఇమేజ్ తెద్దామని కృషి చేస్తే.. ఈ రంధ్రాన్వేషణ ఏమిటి?

నిధులు దుర్వినియోగం జరిగింది ఎక్కడ?

బీఆర్ఎస్‌కు పేరొస్తుందనే సర్కారు రద్దు చేసింది

రేవంత్‌రెడ్డిపై కేసు ఎందుకు పెట్టరు?

కావాలంటే అరెస్టు చేసుకోండి అని వ్యాఖ్య

సంక్రాంతి తర్వాత మళ్లీ కేటీఆర్ విచారణ

11

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రశ్నలకు ఎదురు ప్రశ్నలు.. తెలియదు అన్న సమాధానాలు.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచటం కోసం తాము కృషి చేస్తే ఇప్పుడు రంధ్రాన్వేషణ ఏమిటంటూ నిలదీత.. అడిగిన ప్రశ్నలే మళ్లీ ఎన్నిసార్లు అడుగుతారు? కావాలంటే, అరెస్టు చేసుకోండని సవాల్.. చివరికి.. 'మీరిక వెళ్లొచ్చు' అని అధికారులు చెప్పినప్పుడు.. ముఖంలో ఆశ్చర్యంతో కూడిన ఆనందం.. ఏసీబీ విచారణ సందర్భంగా కేటీఆర్‌లో కనిపించిన భిన్న స్పందనలు ఇవీ.! ఫార్ములా-ఈ కారు రేసు కేసుకు సంబంధించి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు గురువారం ఆరున్నర గంటలకుపైగా విచారించి 50కి పైగా ప్రశ్నలు సంధించారు. ఉదయం పది గంటల

మిగతా 11వ పేజీలో...

రేవంత్.. నీలా లుచ్చా పనులు చేయలే!

రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో నిలిపేందుకు పనిచేశాం

ఈ రేసు కేసులో అడగడానికి ఏసీబీ వద్ద ఏమీలేదు!

నన్ను ప్రశ్నించేందుకు వారే ఇబ్బందిపడ్డారు: కేటీఆర్

సుప్రీంకోర్టులో కేటీఆర్‌కు చుక్కెదురు

పిటిషన్‌పై అత్యవసర విచారణకు నిరాకరణ



ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో

ఫిర్యాదులకు వెబ్‌సైట్

ప్రారంభించిన మంత్రి పొంగులేటి

పథకంలో పారదర్శకతకు పెద్దపీట

దరఖాస్తుల పరిశీలన 95% పూర్తి

11

వారానికి 90 గంటలు

పనిచేయాలి

12

అవసరమైతే ఆదివారాలూ బాధ్యతలు..

ఎంతసేపని భార్యలను చూస్తూ ఉంటారు?

ఎల్అండ్‌టీ చైర్మన్ సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలు

నెట్టింట వైరల్.. తీవ్రంగా విమర్శలు

చంద్రబాబు ముందే మాటకు మాట

ఏపీ సీఎం ఎదుటే తీవ్రంగా వాదులాడుకున్న టీటీడీ ఈవో, చైర్మన్

ఈవో శ్యామలరావుపై ఫిర్యాదు చేసిన బీఆర్ నాయుడు

తనకేమీ చెప్పడంలేదని ఆగ్రహం.. చెప్పనిదేంటంటూ ఈవో ధ్వజం

సీఎం, మంత్రుల ముందే ఇద్దరి రచ్చ.. తొలుత మంత్రి అనగాని జోక్యం

ఆపై విరుచుకుపడ్డ చంద్రబాబు.. ఇదేం పద్ధతి... ఇద్దరూ ఆపండి

సమన్వయంతో పని చేయలేరా? అంటూ ఇద్దరికీ సీఎం హెచ్చరిక



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న చంద్రబాబు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అది... స్వయంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నిర్వహిస్తున్న సమీక్ష. పెను విషాదం చోటు చేసుకున్న సందర్భం! ఇలాంటి సమయంలో అటు టీటీడీ చైర్మన్, ఈవో ఇద్దరూ సంయమనం కోల్పోయారు. విచక్షణ మరిచి... ముఖ్యమంత్రి ముందే మాటా మాటా అనుకున్నారు. 'నువ్వు నాకేం చెప్పడంలేదు' అని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు... 'ఏం చెప్పలేదు. అన్నీ చెబుతూనే ఉన్నాం' అంటూ ఈవో శ్యామలరావు పరస్పరం గొడవకు దిగారు. కొద్దిసేపు సంయమనం వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు... ఆ తర్వాత వారిద్దరిపైనా మండిపడ్డారు. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం... వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట బాధితులను పరామర్శించి, పరిస్థితిని సమీక్షించేందుకు చంద్రబాబు గురువారం తిరుపతి వెళ్లారు. పరామర్శల అనంతరం తిరుపతి కపిలతీర్థం రోడ్డులోని టీటీడీ పరిపాలన భవన్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, కార్యనిర్వహణాధికారి(ఈఓ) శ్యామలరావు, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, హోం మంత్రి అనిత తదితరులు హాజరయ్యారు. టీటీడీలోని కీలక అధికారులు కూడా ఈ భేటీకి వచ్చారు. టీటీడీలో 'ఉన్నతస్థాయి' వ్యక్తుల మధ్య సమన్వయం లేదనే అభిప్రాయాన్ని నిజం చేస్తూ... చైర్మన్, ఈవోలు పరస్పరం తీవ్రస్థాయిలో వాదులాడుకున్నారు. "ఈవో నన్ను అసలు పట్టించుకోవడం లేదు. చైర్మన్ అనే గౌరవం కూడా చూపడం లేదు. ఏ చిన్న విషయాన్నీ నాతో చర్చించడం లేదు. మీరైనా కాస్త చెప్పండి" అని చంద్రబాబుకు బీఆర్ నాయుడు ఫిర్యాదు చేశారు. దీంతో రచ్చ మొదలైంది. ఈవో ఒక్కసారిగా సంయమనం కోల్పోయారు. 'నీకేం చెప్పడంలేదు. అన్నీ చెబుతూనే ఉన్నాం కదా' అంటూ చైర్మన్‌పై తీవ్ర స్వరంతో ఎదురు తిరిగారు. ఆ తర్వాత ఇద్దరూ 'నువ్వు' అంటే 'నువ్వు' అనుకుంటూ ఏకవచనంతోనే వాదులాటకు దిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు

మిగతా 9వ పేజీలో...

9

బాధ్యత లేదా?..

తమాషానా?

అధికారులపై చంద్రబాబు ఆగ్రహం

డీఎస్పీ, టీటీడీ గోశాల డైరెక్టర్ సస్పెన్షన్

ఎస్పీ, జేఈవో, విజిలెన్స్ అధికారి బదిలీ

తొక్కిసలాటపై విచారణకు ఆదేశాలు

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు

ఇంట్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం

తిరుపతిలో ప్రమాదస్థలి పరిశీలన..

బాధితులకు చంద్రబాబు పరామర్శ

ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తున్నాం

క్షమించండి: ఏపీ డిప్యూటీ సీఎం పవన్

టీటీడీలో ఎవరికి వారే!

చైర్మన్, ఈవో, ఏఈవో తలోదారి

వైకుంఠ ఏకాదశిపై సమావేశాల్లో స్పష్టం

స్కిల్స్ యూనివర్సిటీలో

కొత్తగా 3 కోర్సులు

ఎండోస్కోపీ, టీవర్క్స్, మెడికల్ కోడింగ్..

ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

11



స్కాన్ చేయండి.. అభిప్రాయం చెప్పండి

ప్రతి పోలీస్‌స్టేషన్‌లో క్యూఆర్ కోడ్

ఫీడ్ బ్యాక్ ఆధారంగా ర్యాంకులు

స్కాన్ చేసి, ఫిర్యాదుకు వెసులుబాటు



బిల్లును పొంగులేటికి అందజేస్తున్న నవీన్ మిత్తల్

'భూభారతి'కి

గవర్నర్ ఆమోదం!

ఇది ప్రజల భాగస్వామ్యంతో రూపొందించిన చట్టం

త్వరలోనే అమల్లోకి.. ప్రజలకు మెరుగైన సేవలు: పొంగులేటి

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి-2024 చట్టానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో మెరుగైన సేవలను అందించేలా కొత్త చట్టాన్ని అమలు చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వీలైనంత త్వరగా నిబంధనలు

మిగతా 10వ పేజీలో...

10

విద్యా శాఖ కార్యదర్శిగా

యోగితా రాణా

రవాణా శాఖ కమిషనర్‌గా సురేంద్ర మోహన్

శ్రీధర్‌కు గనులు, భూగర్భ వనరుల బాధ్యతలు కూడా

పలువురు ఐఏఎస్‌ల బదిలీ

వేళకాని వేళలో సినిమా ప్రదర్శనా?

16 ఏళ్లలోపు పిల్లల పరిస్థితి ఏమిటి?

15 నిమిషాల వ్యవధిలో జనాన్ని ఎలా నియంత్రిస్తారు?

'గేమ్ చేంజర్'పై పిటిషన్‌లు.. హైకోర్టు ప్రశ్నలు.. నేడూ విచారణ



హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వేళకాని వేళలో అత్యంత ప్రజాదరణ కలిగిన సినిమాల ప్రదర్శనకు అనుమతివ్వడం ఎందుకని హైకోర్టు ప్రశ్నించింది. "తెల్లవారుజామున 4 గంటలకు ప్రదర్శించే సినిమాలకు వెళ్లే 16 ఏళ్లలోపు పిల్లల పరిస్థితి ఏమిటి? వారి ఆరోగ్యంపై చెడు ప్రభావం పడటం ఎంతవరకు సమంజసం?" అని నిలదీసింది. 16 ఏళ్ల లోపు పిల్లలను రాత్రివేళ సినిమాలకు రానివ్వకుండా అడ్డుకోవాలని వ్యాఖ్యానించింది. "రాత్రి సమయాల్లో భారీగా వచ్చే జనాలను అదుపు చేయడం ఎవరి బాధ్యత? పోలీసులపై ఇది అదనపు భారం కాదా?" అని ప్రశ్నించింది. ఒక షోకు మరో షోకు మధ్య 15 నిమిషాల వ్యవధి మాత్రమే ఉండటంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. 15 నిమిషాల వ్యవధిలో

మిగతా 8వ పేజీలో...



కార్చిచ్చును ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

లాస్ ఏంజెలెస్ కార్చిచ్చు.. నష్టం

₹ 5 లక్షల కోట్లు

ఐదుగురి దుర్మరణం.. 1.37 లక్షల మంది తరలింపు

వేగంగా విస్తరిస్తున్న మంటలు.. నేడూ గాలులు

బైడెన్ కుమారుడు హంటర్ నివాసం కూడా దగ్ధం

హాలీవుడ్‌కు ముప్పు.. ఆస్తులు కోల్పోయిన స్టార్లు

ఆస్కార్ వేడుకపై నీలినీడలు.. క్రీడా టోర్నీలు రద్దు

12

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అని ట్రంప్ నినదించడం వెనుక అంతరార్థాలు, అంతిమలక్ష్యాలు ఏమిటో ఇప్పుడిప్పుడే తెలిసొస్తోంది. ఉన్న అమెరికాను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడం కంటే దురాక్రమణలతో ఆయన ఈ విడత మిగతా దేశాలను భయపెట్ట బోతున్నాడని అర్థమవుతోంది. పనామా కాలువ మీదా, గ్రీన్‌ల్యాండ్స్ మీదా కన్నేసిన ఆయనను విలేఖరులు మంగళవారం ఓ కీలకమైన ప్రశ్నవేశారు. వాటిని సొంతం చేసుకోవడానికి సైన్యాన్ని వాడతారా? అన్నది ఆ ప్రశ్న. మరోమరో నాయకుడైతే ఈ ప్రశ్నకు తత్తరపడే వారేమో. డోనాల్డ్ ట్రంప్ తన సమాధానంలో సైనికదాడి అవకాశాన్ని తోసిపుచ్చలేదు. అమెరికా ఆర్థిక, రక్షణపరమైన ప్రయోజనాల పరిరక్షణకు ఆ కాలువ, ఆ మంచుఖండమూ అత్యంత ముఖ్యమని ఆయన మరోమారు ఉద్ఘాటించారు. అతిజాగ్రత్తగా మాట్లాడాలన్న తాపత్రయం ట్రంప్‌లో ఉండదు కనుక, ఆయన ఎజెండా స్పష్టంగా అర్థమవుతుంది. ఆర్థికంతో తెగనప్పుడు, ఆయుధాల వాడకానికి కూడా ఆయన సిద్ధంగా ఉంటాడు. అమెరికా పుట్టుకకు ముందే నామకరణం జరిగిపోయిన గల్ఫ్ ఆఫ్ మెగ్జికోను తాను గద్దెనెక్కగానే గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చేస్తానని ప్రకటించే సాహసం ట్రంప్ మాత్రమే చేయగలరు. వందలాది సంవత్సరాలకు ముందు మొత్తం ఉత్తర అమెరికా అసలు పేరు మెగ్జికన్ అమెరికా గనుక అలా పిలుచుకుంటే మరింత తియ్యగా ఉంటుందని ఆ దేశాధినేత ట్రంప్‌కు కాస్తంత వెటకారంగా సమాధానం ఇచ్చారు.

గ్రీన్‌ల్యాండ్‌కోసం సైనికశక్తిని ఉపయోగించడం మీద నిర్దిష్టంగా ఏ హామీ ఇవ్వబోనని మరో పదిరోజుల్లో అమెరికా అధ్యక్షపదవిలో కూచోబోతున్న వ్యక్తి వ్యాఖ్యానించిన తరువాత కూడా మాట్లాడకపోతే యూరప్‌కు అప్రదిష్ఠ. ఐరోపా దేశాల సరిహద్దుల సార్వభౌమత్వాన్ని సవాలు చేసే ప్రయత్నాలను సహించేది లేదని ఫ్రాన్స్ వ్యాఖ్యానించింది. డెన్మార్క్‌లో ఆరువందలేళ్ళుగా అంతర్భాగంగా ఉన్న గ్రీన్

యూరప్ హెచ్చరిక!

ల్యాండ్‌ను అమెరికా దురాక్రమించుకుంటుందంటే నమ్మడం కష్టం, కానీ, కాలానుగుణంగా మనమూ మారినప్పుడే ఇటువంటి విపత్తులను తట్టుకొని నిలబడగలం అని ఫ్రాన్స్ విదేశాంగమంత్రి నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. గ్రీన్‌ల్యాండ్ యూరప్ భూభాగం, దాని జోలికి ఎవరు వచ్చినా ఊరుకొనేది లేదు, దాడికి ఎంతపెద్ద దేశం ప్రయత్నించినా వదిలేది లేదు అని ఘాటుగా సమాధానం ఇచ్చారాయన. ట్రంప్ యుద్ధకండూతిని తప్పుబడుతూ, యూరోపియన్ యూనియన్ ఒక్కటిగా నిలవాలి, బలోపేతం కావాలన్నారు ఆయన. జర్మన్ చాన్సలర్ కూడా గట్టిగానే సమాధానం చెప్పారు. ట్రంప్ వ్యాఖ్యలు ఈయూ నేతలందరిలోనూ ఆందోళన కలిగించాయని, మనమంతా ఐకమత్యంగా ఉండాలని అన్నారాయన. గ్రీన్‌ల్యాండ్ జోలికి వస్తే పరస్పర రక్షణ సహకార ఒప్పందాన్ని అమలుచేయాల్సివస్తుందని యూరోపియన్ కమిషన్ కూడా గుర్తుచేసింది. ట్రంప్ దెబ్బకు జస్టిన్ ట్రూడోను సాగనంపిన కెనడా నేతలు కూడా ఆయన పలుమార్లు యాభైఒకటవ రాష్ట్రంగా తమదేశాన్ని అభివర్ణించడం భరించలేకపోతున్నారు. మీ జోకులు ఆపకుంటే ఊరుకొనేది లేదు అని గట్టిగా విరుచుకుపడుతున్నారు. అమెరికాలో విలీనమైతే కెనడాకు ఆర్థికంగానూ, భద్రతాపరంగానో ఎంత లాభమో వివరిస్తూ, కెనడాను స్వాధీనం చేసుకోవడం ఖాయమంటూ ఆయన ఇటీవలే మరోమారు ఉద్ఘాటించారు. మిగతా దురాక్రమణలకు ఆయుధాలనీ, సైన్యాన్ని వాడతానని అంటున్న అమెరికా అధ్యక్షుడు కెనడా విషయంలో మాత్రం ఆర్థిక శక్తిని ప్రయోగిస్తానని కాస్తంత మినహాయింపు ఇచ్చారు.

సుంకాలను ఆయుధంగా మార్చి ట్రంప్ మిగతావారిని బెదిరిస్తున్నారు. గ్రీన్‌ల్యాండ్‌ను ఇవ్వకపోతే అత్యధిక సుంకాలతో డెన్మార్క్‌ను దెబ్బతీస్తానని, ఆయుధ ప్రయోగంతో దానిని స్వాధీనం చేసుకుంటానని బెదిరిస్తున్నాడు. పనామా కాలువ, గ్రీన్‌ల్యాండ్, కెనడా వంటివి ఉపరితలంలో కనిపిస్తున్నాయి కానీ, తనకు గిట్టని, దారికి తేవాలనుకుంటున్న దేశాలన్నింటిపైనా ఆయన ఇదే అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. రేపు అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఒత్తిడి విధానాలు ఇంతకంటే బలంగా అమలవుతాయనడంలో సందేహం అక్కరలేదు. చిన్నాచితకా దేశాలను, దీవులను, మంచుఖండాలను కలిపేసుకుంటే ఆర్థికంగానూ, సైనికపరంగానూ బలపడవచ్చునని, రాయితీలు, మినహాయింపులు ఇస్తున్న దేశాలను మోయడం కంటే విలీనం చేసుకోవడం ఉత్తమమని ట్రంప్ ఆలోచన. ఆయన 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' ఈ మారు ఆధిపత్య విస్తరణవాదాలతో మరింత ప్రమాదకరంగా పరిణమించబోతున్నది.

మేధో విరాణ్మూర్తి మన్మోహన్

మా సాహచర్యం విచిత్రమైనది, విశేషమైనది కూడా. ఇటీవల కీర్తిశేషుడు అయిన భారతదేశ ఆర్థిక సంస్కరణల పథనిర్దేశకుడు, ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మార్కెట్ శక్తులకు ప్రాధాన్యమిచ్చే అర్థశాస్త్ర విద్వత్తుతో ప్రభవించిన నవపథగామి. నిరుపమాన పర్యావరణవాది అనీల్ అగర్వాల్. పర్యావరణ భద్రతే ఆయన తొలి, మలి, తుది, ఏకైక లక్ష్యం. 1991లో మన్మోహన్ సింగ్ సరళీకృత ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టి, భారత్‌ను స్వేచ్ఛా విపణిగా రూపొందించినప్పుడు నిస్సంకోచంగా హర్షించిన వారిలో అనీల్ గానీ, నేను గానీ లేనేలేము. కొత్త ఆర్థిక పథం పర్యావరణ భద్రతకు భరోసానివ్వగలదా? అన్నదే మా ప్రశ్న. జాతి ఆర్థిక కార్యకలాపాలను క్రమబద్ధీకరించే సంస్థలు ప్రభావశీలంగా లేనప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానం చేయడం మన పర్యావరణ వ్యవస్థలకు మేలు చేస్తుందా?



■ సునీతా నారాయణ్

మట్టివాసన

ఆర్థికమంత్రి మన్మోహన్ సింగ్‌కు ఇవి ఇబ్బందికరమైన ప్రశ్నలే. అయితే ఆయన మా ప్రశ్నలను కొట్టివేయలేదు. ఈ విశాల దృక్పథం, నిష్పాక్షిక వైఖరే ఆయన్ను మిగతా రాజకీయ నాయకుల నుంచి విభిన్నంగా, సమున్నతంగా నిలబెట్టింది. పర్యావరణ సంబంధిత అంశాలపై మాతో ఆయన సమాలోచనలు జరిపారు. అంతమాత్రాన మా అభిప్రాయాలు, సూచనలను ఆయన అంగీకరించారని నేను చెప్పబోవడం లేదు. ఆర్థికాభివృద్ధి వ్యవహారాలను పర్యావరణ దృక్కోణం నుంచి చూడవలసిన అవసరాన్ని ఆయన అర్థం చేసుకున్నారు. మరింత విపులంగా తెలుసుకోవడానికి ప్రయత్నించారు. పర్యావరణ వ్యవస్థలను పటిష్ఠపరిచి, వాటి సమతౌల్యతను నిలబెట్టేందుకు చేయవలసిందేమిటో ఆయన సమాలోచించారు.

2004లో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి అయిన సందర్భంలో అనీల్ అగర్వాల్ ఒక రోడ్డు ప్రమాదంలో మరణించారు 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' నిర్వహణ బాధ్యతలు నేను చేపట్టాను. అప్పటికి పర్యావరణ అధ్యయనాలు, పరిశోధనలలో నాకు పెద్దగా అనుభవం లేదు. అయితే నేను ఆ బాధ్యతల నిర్వహణకు సరిపోని వ్యక్తిననే భావాన్ని మన్మోహన్ సింగ్ ఎప్పుడూ నాకు కలిగించలేదు. ప్రధానమంత్రి కార్యాలయానికి వెళ్లి ఆయనతో మాట్లాడే అవకాశాన్ని నాకు కల్పించారు. జలవనరుల సంరక్షణ నుంచి వాతావరణ మార్పు దాకా వివిధ పర్యావరణ అంశాలపై నేను చెప్పే విషయాలను మన్మోహన్ సావధానంగా వినేవారు. వినడమేకాదు, వివిధ సమస్యలకు పరిష్కారాలను సూచించమని కూడా నన్ను ప్రోత్సహించేవారు. 'ఏమి చేయాలి?' అన్నదాని పైనే ఆయన దృష్టి సదా ఉండేది.



డాక్టర్ మన్మోహన్ సింగ్ విలక్షణమైన వ్యక్తి. విభిన్నమైన రాజకీయవేత్త. విశిష్ట ప్రజాస్వామికవాది. కొత్త భావాలను ఆహ్వానించేవారు. వాటి వెలుగులో తన భావాలు పరిశీలించుకుని అవసరమైతే మార్చుకునేవారు. ఇతరులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు సమంజసమైనవి అయితే వాటిని అంగీకరించేందుకు సంకోచించేవారు కాదు. తన అధికారాలను పూర్తిగా ప్రజల శ్రేయస్సుకే వినియోగించిన మంచి మనిషి మన్మోహన్ సింగ్.

పులుల సంరక్షణ విషయమై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక కమిటీకి సారథ్యం వహించమని 2005లో మన్మోహన్ నన్ను కోరారు. అంగీకరించాను. ఆ కమిటీలోని ఇతర సభ్యులు వన్యప్రాణుల, ముఖ్యంగా పులుల సంరక్షణ వ్యవహారాలలో బాగా పలుకుబడి ఉన్న అనుభవజ్ఞులు. ఆ కమిటీకి నేతృత్వం వహించడమనేది ఒక క్లిష్ట బాధ్యత. పైగా పలు విధాల అదొక కష్ట కాలం. సరిస్కా టైగర్ రిజర్వ్‌లోని పెద్దపులులు అంతరించిపోయాయి. పులుల సంరక్షణ ఎజెండాను ఎలా రూపొందించాలి? అదే సమయంలో అటవీ హక్కుల చట్టంపై పార్లమెంటు లోపలా బయటా పెద్ద చర్చ నడుస్తోంది. ఆదివాసీలకు చారిత్రకంగా జరిగిన, ఇంకా జరుగుతున్న అన్యాయాలను అరికట్టి అటవీ భూములపై వారికి హక్కులు కల్పించాలన్న డిమాండ్‌పై తీవ్ర తర్జనభర్జనలు సాగుతున్నాయి. ఆదివాసీలు నివశిస్తున్న అటవీ భూముల పరిధిలో జాతీయ ఉద్యానవనాలు, వన్య ప్రాణుల సంరక్షణ కేంద్రాలు సైతం ఉన్నాయి. పులులతో సహా వన్య ప్రాణుల సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలా లేక ఆదివాసీల జీవన భద్రత, జీవనాధారాల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలా? ఇదొక సంఘర్షణాత్మక ఎజెండా. ఎందుకంటే రెండూ ముఖ్యమే. పులులు సంరక్షణకు ప్రాధాన్యమిస్తున్న వారితో పాటు ఆదివాసీలకు ప్రాధాన్యమివ్వాలనే వారి వాదానలనూ మన్మోహన్ శ్రద్ధగా వినేవారు. ఆ వాద ప్రతివాదాల మధ్య ఒక సమతౌల్యం సాధించేందుకు ఆయన ప్రయత్నించారు.

మా కమిటీ నివేదికలోని అంశాలపై మన్మోహన్‌తో నేను విపులంగా చర్చించాను. ముఖ్యంగా సమ్మిళిత సంరక్షణ నమూనాను అనుసరించాల్సిన ఆవశ్యకత గురించి ఆయనకు చెప్పాను. ఆ ఎజెండా అమలులో ఎదురయ్యే సమస్యల గురించి ఆయన ప్రశ్నించారు. వన్యప్రాణుల సంరక్షణ వ్యవహారాలతో సంబంధమున్న వారందరూ సహకరిస్తారా అని ఆయన అడిగారు. అది కష్టమేగానీ అసాధ్యం కాబోదని వివరించాను. మా నివేదిక 'జాయినింగ్ ది డాట్స్' ప్రజలకు నివేదించి పులుల సంరక్షణ ఆవశ్యకతపై వారికొక స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరమున్నదని చెప్పాను. సంబంధిత విధానాలలో మార్పులకు ఇది దోహదం చేయగలదని స్పష్టం చేశాను. మా నివేదికకు, సాధారణంగా ప్రభుత్వ కమిటీల నివేదికలకు పట్టే గతే పడుతుందని భయపడ్డాను. నా భయం నిరాధారమైనదని నాకు త్వరలోనే తెలిసివచ్చింది. మా కమిటీ సిఫారసులను మన్మోహన్ ఆమోదించారు. వాటి అమలుకై సత్వర చర్యలకు ఆదేశించారు. దేశంలో పులుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా పులుల జనాభా గణన పద్ధతులు బాగా మెరుగుపడ్డాయి. ఇప్పుడు చాలవరకు కాలి జాడల ఆధారంగా కాకుండా, ప్రత్యక్ష పరిశీలన ద్వారా పులుల సంఖ్యను లెక్కిస్తున్నారు.

డాక్టర్ మన్మోహన్ సింగ్ విలక్షణమైన వ్యక్తి, విభిన్నమైన రాజకీయవేత్త. విశిష్ట ప్రజాస్వామికవాది. వర్తమాన ప్రపంచంలో అటువంటి విశాల దృక్పథమున్న వ్యక్తులు, నాయకులు అరుదు. తాను ఏకీభవించని వారిని సైతం ప్రోత్సహించే ఉదారుడు మన్మోహన్. విద్వజ్ఞుడు అయిన మన్మోహన్‌కు వివిధ అంశాలపై పాఠ్యగ్రంథాలు, స్వీయ అనుభవాల ప్రాతిపదికన ఏర్పరచుకున్న భావాలు, అభిప్రాయాలు ఉండేవి. అయితే ఆయనలో మేధో నిజాయితీ ఉండేది. కొత్త భావాలను ఆహ్వానించేవారు. వాటి వెలుగులో తన భావాలు పరిశీలించుకుని అవసరమైతే మార్చుకునేవారు. ఇతరులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు సమంజసమైనవి అయితే వాటిని అంగీకరించేందుకు సంకోచించేవారు కాదు. ఆయన మృదు స్వభావి. మూర్తీభవించిన మేధో నిజాయితీ. తన అధికారాలను పూర్తిగా ప్రజల శ్రేయస్సుకే వినియోగించిన మంచి మనిషి మన్మోహన్ సింగ్.

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

చట్టబద్ధ మద్దతు ధర ఎండమావేనా?



వ్యవసాయ ఉత్పత్తులకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర అన్న భావనను అమలుపరచాల్సిన సమయమాసన్నమవలేదా? చట్టబద్ధ ఎమ్ఎస్‌పీకై పంజాబ్ రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ గత నవంబర్ 26 నుంచి చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష ఇంకా కొనసాగుతూనే ఉన్నది. రైతుల ఉద్యమం మళ్లీ ప్రారంభమైన తరువాత వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, పశు పోషణపై పార్లమెంటరీ స్థాయీ సంఘం ఒకటి 'చట్టబద్ధంగా కట్టుబడి ఉండే' కనీస మద్దతు ధరను రైతులకు సమకూర్చాలని సిఫారసు చేసింది. కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన మద్దతు ధరకు హామీ ఇవ్వాలనే డిమాండ్‌ను పరిశీలించేందుకు సైతం నిర్బంధ్వంగా నిరాకరిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదే పదే 'ఎమ్ఎస్‌పి హై ఔర్ రహేగా' అంటున్నప్పటికీ ఆందోళన చేస్తున్న రైతులతో చర్చలు ప్రారంభించేందుకు ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదు. రైతులకు కొత్త సంవత్సర కానుకగా పంటల బీమా కొనసాగింపు, ఎరువులపై రాయితీని ప్రధానమంత్రి ప్రకటించారు. కనీస మద్దతు ధరను పూర్తిగా ఉపేక్షించారు.

ఎమ్ఎస్‌పి డిమాండ్‌పై నెలకొన్న ప్రతిష్టంభన కొనసాగుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాజస్థాన్‌లో పెసర ఒక ప్రధాన ఖరీఫ్ పంట. దానికి అధికారికంగా ప్రకటించిన ఎమ్ఎస్‌పి క్వింటాల్‌కు రూ.8,682. అయితే ఆ రాష్ట్రంలోని ప్రధాన వ్యవసాయ మార్కెట్ అయిన మెర్టాలో గత డిసెంబర్‌లో దానికి లభించిన ధర రూ.6,467 మాత్రమే. రైతు తాము పండించిన పెసలను క్వింటాల్‌కు రూ.2,215 నష్టానికి విక్రయించుకోవల్సి వచ్చింది. తత్ఫలితంగా ఆ ఒక్క మార్కెట్‌లో ఒక్క నెలలో ఒక్క పంట విషయంలో రైతులు కోల్పోయిన మొత్తం ఆదాయం రూ.10 కోట్లకు పైగా ఉంటుంది. మహారాష్ట్రలోని జాల్నా మార్కెట్‌లో గత డిసెంబర్‌లో క్వింటాల్ జొన్నలకు లభించిన సగటు ధర రూ.2,456. అయితే ఆ పంట అధికారిక ఎమ్ఎస్‌పి రూ.3,371. అంటే రైతులు క్వింటాల్‌కు రూ.915 చొప్పున నష్టపోయారు. మొక్కజొన్నకు అధికారిక ఎమ్ఎస్‌పి రూ.2,225 కాగా మధ్యప్రదేశ్ మార్కెట్లలో ఆ పంటకు లభించిన ధర కేవలం రూ.1980 మాత్రమే. సోయాబీన్‌కు ప్రకటించిన ఎమ్ఎస్‌పి రూ.4,892 కాగా అక్టోబర్, డిసెంబర్‌ల మధ్య మహారాష్ట్రలో ఆ పంటకు లభించిన మార్కెట్ ధర రూ.4,076 కాగా మధ్యప్రదేశ్‌లో రూ.4,892 మాత్రమే.

కేంద్ర ప్రభుత్వం ఏటా 23 పంటలకు చాలా ఆర్భాటంగా కనీస మద్దతు ధర ప్రకటిస్తుంది. రైతులకు ప్రభుత్వం చాలా మేలు చేస్తుందని ప్రజలు విశ్వసించేలా పాలకులు వ్యవహరిస్తారు. అయితే వాస్తవంగా రైతులకు ఆ కనీస మద్దతు ధర సమకూరేందుకు ప్రభుత్వం కనీస మాత్రంగానైనా చేస్తుంది ఏమీ లేదు! సంబంధిత పంటలకు మార్కెట్‌లో లభిస్తున్న ధర ప్రకటిత ఎమ్ఎస్‌పి కంటే తక్కువగా ఉన్నప్పుడు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదు. మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే తక్కువగా ఉంటే 'కనీస', 'మద్దతు' అనే మాటలు అర్థరహితమైనవే. కచ్చితంగా లభిస్తుందనే హామీ లేని ఎమ్ఎస్‌పి అసలు ఎమ్ఎస్‌పినే కాదు. ప్రభుత్వం తన వాగ్దానాన్ని నెరవేర్చుకోవాలని రైతులు గట్టిగా కోరుతున్నారు. కనీస మద్దతు ధర విషయమై రైతుల డిమాండ్ చర్చకు వచ్చినప్పుడల్లా ప్రధాన స్రవంతి మీడియాలో ఆ విషయమై తీవ్ర వాదోపవాదాలు జరగడం పరిపాటి అయింది. ఎమ్ఎస్‌పి అనేది ఒక హేతు విరుద్ధ డిమాండ్ అనీ, అది ఆచరణ సాధ్యం కానిదని, ద్రవ్య సంక్షోభానికి అది దారితీస్తుందని ఎమ్ఎస్‌పి వ్యతిరేకులు గట్టిగా వాదిస్తున్నారు. వాస్తవమేమిటి? చట్టబద్ధంగా కట్టుబడి ఉండే కనీస మద్దతు ధర తార్కికంగా సుసంగతమైనది, ఆచరణ సాధ్యమైనది. అదెలా సాధ్యమో విపులంగా చూద్దాం.

> చట్టబద్ధమైన కనీస మద్దతు ధరను సమకూర్చేందుకు అయ్యే వ్యయం కేంద్ర బడ్జెట్‌లో 0.5 శాతంగా ఉంటుంది. రైతులు డిమాండ్ చేసే అధిక ధరలు పరిగణనలోకి తీసుకున్నా, సంబంధిత మొత్తం వ్యయం కేంద్ర బడ్జెట్‌లో 4.2 శాతంగా, స్థూల దేశీయోత్పత్తిలో 0.6 శాతంగా ఉండగలదు. దేశ వ్యాప్తంగా వ్యవసాయ కుటుంబాలకు ఈ మేరకు ఆర్థిక సహాయాన్ని సమకూర్చినప్పుడు వారి కొనుగోలు సామర్థ్యం మరింతగా పెరుగుతుంది. ఈ దృష్ట్యా చట్టబద్ధ కనీస మద్దతు ధర సమకూర్చేందుకు అయ్యే వ్యయం పూర్తిగా సమర్థనీయమైనది.

ఇంతకూ చట్టబద్ధంగా కట్టుబడి ఉండే కనీస మద్దతు ధర అంటే ఏమిటి? ప్రభుత్వం అన్ని పంటల సమస్త దిగుబడులను విధిగా కొనుగోలు చేసి తీరాలని, లేదూ, అధికారిక ఎమ్ఎస్‌పి కంటే తక్కువ ధరకు విక్రయమవుతున్న పంటల దిగుబడులను కొనుగోలు చేసి తీరాలన్న నిబంధనగా అర్థం చేసుకోకూడదు. అలా కొనుగోలు చేయడం సాధ్యమూ కాదు, అదసలు తప్పనిసరి కూడా కాదు. చట్టబద్ధంగా కట్టుబడిన ఎమ్ఎస్‌పి మౌలిక సూత్రం చాలా సరళమైనది. కనీస మద్దతు ధర అనేది రైతుల హక్కు.. అది రైతులకు లభించేలా చూడడమనేది ప్రభుత్వ శాసన విహిత బాధ్యత.



■ యోగేంద్ర యాదవ్

ఈ మౌలిక సూత్రంలోని ప్రధాన విషయమేమిటంటే రైతులు తమ దిగుబడులకు చట్టబద్ధమైన ధర పొందేలా ప్రభుత్వం పూచీ వహించడం. రైతుల ఉత్పత్తులను తప్పనిసరిగా కొనుగోలు చేయడం కాదు. అదేవిధంగా పంట దిగుబడులను ఎవరు కొనుగోలు చేస్తున్నారనే దానితో నిమిత్తం లేకుండా చట్టబద్ధమైన కనీస మద్దతు ధరను రైతులు పొందాలి, పొంది తీరాలి.

ఈ మౌలిక సూత్రాన్ని మూడు పద్ధతుల ద్వారా అమలుపరచవచ్చు: విస్తృత సేకరణ, ప్రభావశీల మార్కెట్ జోక్యం, లోటు చెల్లింపులకు హామీ. ప్రస్తుత ధాన్య సేకరణ పద్ధతులను విస్తరింప పరచాలి. వాటిలోని లోటుపాట్లను సరిదిద్దాలి. చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనె గింజలను భారీ స్థాయిలో సేకరించాలి. ఆహార భద్రతా పథకాలలో వాటిని భాగం చేయాలి. దీనివల్ల ధాన్య సేకరణలో ప్రస్తుత అసమతౌల్యతను తొలగించేందుకు తోడ్పడుతుంది. రెండో పద్ధతి మార్కెట్ జోక్యాలు. ఇవి వివిధ రూపాలలో ఉండవచ్చు. ధరలు ఎమ్ఎస్‌పి కంటే తక్కువకు పడిపోతున్నప్పుడు పరిమిత స్థాయిలో కొనుగోలు చేయడం, మార్కెటింగ్ కేంద్రాలలో ఎమ్ఎస్‌పికి నిర్వహించే వేలం పాటల్లో కనిష్ఠ ధర నిర్ణయించడం, అంతర్జాతీయ వాణిజ్య విధానంలో మార్పులు చేర్పులు చేయడం గోదాంలను మెరుగుపరచడం, సన్నకారు చిన్నకారు రైతులు తమ దిగుబడులకు మంచి ధర లభించేంతవరకు వాటిని నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకునేందుకు గాను రైతుల ఉత్పత్తిదారు సంఘాలను పటిష్ఠపరచడం మొదలైన చర్యలు అవశ్యం చేపట్టాలి. ఈ పద్ధతులేవీ మార్కెట్ ధరను కనీస మద్దతు ధరకు సమానస్థాయిలోను లేదా అంతకంటే హెచ్చు స్థాయిలోను ఉంచడంలో విఫలమయిన పక్షంలో ప్రభుత్వం ఎమ్ఎస్‌పికి, సగటు మార్కెట్ ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని విధిగా చెల్లించి తీరాలి. ఈ 'లోటు ధర చెల్లింపు' అనేది రైతుల ఎమ్ఎస్‌పి హక్కును చట్టబద్ధమైన హక్కుగా చేస్తుంది.

చట్టబద్ధమైన కనీస మద్దతు ధరను అమలుపరిచేందుకు అవసరమైన ఆర్థిక వనరులు ప్రభుత్వానికి ఉన్నాయా? రైతులకు శాసన విహితంగా మద్దతు ధరను సమకూర్చేందుకు రూ.14 లక్షల కోట్లు అవసరమవుతాయని ఎమ్ఎస్‌పిని వ్యతిరేకిస్తున్న వాణిజ్య వర్గాలు లెక్కలు కడుతున్నాయి. ఇంత ఆర్థిక భారం దృష్ట్యా చట్టబద్ధ ఎమ్ఎస్‌పి ఒక హాస్యాస్పద, అసాధ్య డిమాండ్ అని ఆ వర్గాలు ఘోషిస్తున్నాయి. ఇది ప్రజలను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవపట్టించే ప్రయత్నమే, సందేహం లేదు. ఎమ్ఎస్‌పి వర్తించే ప్రతి పంట దిగుబడుల్లో ప్రతి క్వింటాల్‌ను ప్రభుత్వం కొనుగోలు చేయవలసిన అవసరముందని భావించి వేసిన అంచనాలవి. మనం ముందే చూసినట్టు ప్రతి పంట దిగుబడిని ఎటువంటి మినహాయింపు లేకుండా కొనుగోలు చేసి తీరాలన్నది రైతుల డిమాండ్‌లో భాగం కానేకాదు. అంతేకాక మరో వాస్తవాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి: ప్రభుత్వం పంట దిగుబడులను కొనుగోలుకు ఇచ్చిన నిర్దిష్ట ధర, కొన్న పంటను విక్రయించిన ధరకు మధ్య ఉన్న వ్యత్యాసం ఎంత ఉన్నదనేదే ఎమ్ఎస్‌పిని అమలుపరిచేందుకు ప్రభుత్వానికి వాస్తవంగా అయ్యే వ్యయంగా పరిగణించాలి. అన్ని వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో సహాయక జోక్యం అవసరం ఉండదు; మార్కెట్ ధర ఎమ్ఎస్‌పి కంటే తక్కువగా ఉన్నప్పుడు మాత్రమే రైతుకు న్యాయం చేసేందుకు ప్రభుత్వ జోక్యం అవసరమవుతుంది. నిజానికి అది తప్పనిసరి కూడా.

15 ప్రధాన పంటలకు (ఎమ్ఎస్‌పిని ప్రకటించిన పంటల మొత్తం విలువలో వీటి వాటా 95 శాతానికి పైగా ఉంటుంది) 2022–23 మార్కెటింగ్ సంవత్సరంలో చట్టబద్ధమైన కనీస మద్దతు ధరను సమకూర్చేందుకు అయ్యే వ్యయాన్ని మేము లెక్కకట్టాము: ప్రకటిత ఎమ్ఎస్‌పి కంటే తక్కువ ధరకు విక్రయమైన అన్ని పంటలకు సంబంధించిన మొత్తం లోటు రూ. 26,469 కోట్లు. ఇది, పాక్షిక వ్యయం భావన ప్రాతిపదికన ప్రభుత్వం ప్రకటించిన ఎమ్ఎస్‌పి రేట్ల ప్రకారం నిర్ధారితమైన లోటు. రైతులు డిమాండ్ చేస్తున్న ఎమ్ఎస్‌పి (లేదా స్వామినాథన్ సిఫారసు చేసిన ఎమ్ఎస్‌పి)ని కూడా పరిగణనలోకి తీసుకుని కూడా లెక్కలు కట్టాం. సమగ్ర వ్యయం ప్రాతిపదికన కట్టిన లెక్కల ప్రకారం ఈ లోటు రూ. 2,00,710 కోట్లుగా ఉన్నది. సకాలంలో మార్కెట్ జోక్యంతో పాటు పైన ప్రస్తావిత ఇతర చర్యలు అన్నీ తీసుకున్న పక్షంలో మార్కెట్ ధరలు వాటికవే కనీస మద్దతు ధరకు దగ్గరగా ఉంటాయి. తద్వారా ప్రస్తావిత లోట్లు గణనీయంగా తక్కువ స్థాయిలో ఉండేందుకు అవకాశమున్నది.


ప్రస్తుత ధరల ప్రకారం చట్టబద్ధంగా వాగ్దానం చేసిన కనీస మద్దతు ధరను సమకూర్చేందుకు అయ్యే వ్యయం కేంద్ర బడ్జెట్‌లో 0.5 శాతంగా ఉంటుంది. రైతులు డిమాండ్ చేసే అధిక ధరలు పరిగణనలోకి తీసుకున్నా సంబంధిత మొత్తం వ్యయం కేంద్ర బడ్జెట్‌లో 4.2 శాతంగా, స్థూల దేశీయోత్పత్తిలో 0.6 శాతంగా ఉండగలదు. దేశ వ్యాప్తంగా వ్యవసాయ కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయాన్ని అందించినప్పుడు వారి కొనుగోలు సామర్థ్యం మరింతగా పెరుగుతుంది. ఈ అదనపు కొనుగోలు సామర్థ్యం ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు విశేషంగా దోహదం చేస్తుంది. ఈ దృష్ట్యా చట్టబద్ధ కనీస మద్దతు ధర సమకూర్చేందుకు అయ్యే వ్యయం పూర్తిగా సమర్థనీయమైనది. పైగా న్యాయసమ్మతమైనది. మరి రైతులోకానికి అటువంటి ఆర్థిక చేయూతనివ్వాలి. ఇందుకు రాజకీయ సంకల్పం అవసరం. మన దేశ పాలకులలో అది కొరవడిందని మరి చెప్పనవసరం లేదు.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

(కవితా కురుగంటి, విస్సా కిరణ్‌కుమార్ సహకారంతో)

మండే అక్షరాలు ఆయన కవితలు!

పల్లెల్లో జనం మాట్లాడే మాటలను కవిత్వం చేసి బయటకు విసిరిన విలుకాడు మద్దూరి. ఏ కవిత్వం రాసినా తన అలగాజనం కోసమే. అక్షరాలు పల్లె జనం తినే గొడ్డుకారపు ముద్దలా భగభగ మండుతుంటాయి. తెలుగు సాహిత్యం ఒక్కసారిగా మద్దూరి వైపు చూడటానికి కారణం ఆయన కవిత్వం సూటిగా, వాడిగా ఉండటమే. కవిత్వంలో తన జాతి బతుకులను కళ్ళకు కట్టి చూపెట్టిన కవి నగేష్ బాబు. అందుకే మద్దూరి నగేష్ కవిత్వం ఇంకా ప్రజల్లో చిరస్థాయిగా ఉంది.



అతను రాసిన ప్రతి కవిత దళితుల బతుకులను చూపెడుతూ, వెలివేయబడిన జనాల గుండెలోతుల్లో కసుక్కున దిగబడుతుంది, కుల వ్యవస్థను సమర్థించే వారి గుండెల్లో గునపంలా దిగబడుతుంది. నగేష్ కవిత్వం రాసిన తరువాత తెలుగు సాహిత్యంలో దళిత సానుభూతి కవులు బయటకొచ్చారు. మిరేపూట్లు, వెలివాడ, రచ్చబండ, నరలోక ప్రార్థన, గోదావరి, లోయ, పట్ట కవితా సంపుటాలు మద్దూరి నగేష్ బాబు కలం నుంచి లావాలా బయటకు వచ్చాయి. మద్దూరి కథలు కూడా సంచలనంగా ఉంటాయి. తక్కువ వయస్సులో చనిపోయినా, తన తరంలో ఒక స్ఫూర్తి నింపి, రాబోయే తరాలకు తన కవిత్వం ద్వారా దిక్సూచిలా మారాడు మద్దూరి నగేష్ బాబు. ఆయన తన కవిత్వంతో నిత్యం పొద్దు పొడిచే సూర్యుడులా వెలుగొందుతున్నాడు. తన దళిత జనాల కవిత్వం నల్లజెండా ఎగరేసిన మద్దూరి నగేష్ బాబు 1964 ఆగస్టు 15న జన్మించాడు.

– తంగిరాల సోని

(నేడు మద్దూరి నగేష్‌బాబు 20వ వర్ధంతి)

'పెద్దగట్టు' జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించండి

బోనాలు, బతుకమ్మ పండుగలకు తెలంగాణ రాష్ట్ర తొలి ప్రభుత్వంలో రాష్ట్ర పండుగల హోదా లభించింది. సమ్మక్క సారలమ్మ జాతరను నాటి సమైక్య రాష్ట్ర ప్రభుత్వం 1996లోనే రాష్ట్ర పండుగగా ప్రకటించింది. ఇది తెలంగాణలోనే అతి పెద్ద మొదటి జాతర. ఇక పెద్దగట్టు లేదా గొల్లగట్టు లింగమంతుల స్వామి జాతర రాష్ట్రంలోనే అతి పెద్ద రెండవ జాతర. ఇది రెండేళ్ళకొకసారి మాఘ శుద్ధ పౌర్ణమికి మొదలై ఐదు రోజుల పాటు జరుగుతుంది. ఈ జాతరకు 30 నుంచి 50 లక్షల వరకు హాజరౌతారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నేటి సూర్యాపేట జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో గల హైదరాబాదు–విజయవాడ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న దురాజుపల్లి గ్రామం ప్రక్కనే 'పాలశేర్లయ్యగట్టు' అనబడే గొల్లగట్టుపైన ఈ జాతర జరుగుతున్నది. వెయ్యేండ్లుగా ఈ జాతర జరుగుతున్నదని చెప్పుకోవడానికి ఈ పాలశేర్లయ్య గట్టు సమీపంలోనే ఉన్న 'పెద్దగట్టు' అనబడే ఉంద్రుగొండపైన నాటి కళ్యాణీ చాళుక్యులు 11వ శతాబ్దంలో నిర్మించిన గిరిదుర్గంపైన ఈ జాతర ప్రారంభించినట్లు తెలుస్తుంది. శివుడినే లింగమంతుల స్వామిగానూ, చౌడమ్మను శక్తి రూపిణిగానూ తలచి ఆ ఉంద్రుగొండపైన రెండు గుడులను కట్టి శివునికి నైవేద్యంతోను, చౌడమ్మకు జంతు బలులతోను ఈ జాతరను ప్రారంభించారు. ఇప్పటికీ పెద్దగట్టు గిరిదుర్గంపై ఈ గుడులున్నాయి. అందుకే దీనిని 'పెద్దగట్టు జాతర' అని కూడా అంటారు. కారణాంతరాల వల్ల నేటి పాలశేర్లయ్య గట్టుకు ఈ జాతరను మార్చారు.

ఇంతటి ఘన చరిత్ర గలిగిన ఈ జాతర ఇప్పటికీ 'రాష్ట్ర పండుగగా ప్రకటనకు నోచుకోలేదు. ప్రజాప్రతినిధులను, వివిధ పార్టీల నాయకులను గతంలో ఎన్నోసార్లు కలిసి, ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఫలించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక గత అక్టోబర్‌లో యాదవుల 'సదర్ ఉత్సవాన్ని' సహృదయంతో 'రాష్ట్ర పండుగగా ప్రకటించారు. 2025 ఫిబ్రవరి 16న లింగమంతులస్వామి జాతర ప్రారంభం కానుంది. ఇదే విశాల సహృదయంతో ఈ జాతరను కూడా 'రాష్ట్ర పండుగ'గా ప్రకటించాలని మనవి చేస్తున్నాం.

– వల్లాల అచ్చయ్య పరంధామ్
లింగమంతుల అధ్యయన పీఠం, నల్లగొండ

'మైసిన్' మందుల మాంత్రికుడు

బహుళ ప్రజాదరణ పొందిన టెర్రా'మైసిన్' మందును కనుగొన్నది మన తెలుగువాడయిన డా. యల్లాప్రగడ సుబ్బారావు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో 1895, జనవరి 12న నిరుపేద సనాతన సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. బాల్యంలో అనేక కష్టాలను అధిగమించి చదువుకుని, విదేశీ వైద్య పరిశోధనల నిమిత్తం కాకినాడ 'సత్యలింగం నాయికర్ ట్రస్ట్' వారి ఉపకార వేతనం పొందారు. అమెరికాలో రాత్రీ పగలు కష్టపడుతూ తన ప్రతిభా పాటవాలతో 'స్కాలర్‌షిప్'లు సంపాదిస్తూ వైద్య పరిశోధనలు కొనసాగించారు. 1922లో నోబెల్ బహుమతి అందుకున్న సిద్ధాంతాన్ని సుబ్బారావు పరిశోధనాత్మకంగా పరిశీలించి, అర్థవంతంగా లేదని రుజువు చేశారు. ఆ సిద్ధాంతంపైనే మళ్లీ పరిశోధన సాగించి, దిగ్భ్రాంతి గొలిపేలా సరికొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఆ సిద్ధాంతమే 'డా. ఫిస్కే–సుబ్బారావు మెథడ్'గా నేటి వైద్య కళాశాలల్లో పాఠ్యాంశంగా ఉంది.



'న్యారోస్పెక్ట్రమ్ యాంటి బయాటిక్స్– పెన్సిలిన్, స్ట్రెప్టోమైసిన్ వంటి మందులు కనుగొన్న వారికి నోబెల్ బహుమతులు లభించాయి. కానీ వాటికన్నా శ్రేష్ఠమైన, ప్రపంచంలో తొలి బ్రాడ్ స్పెక్ట్రమ్ యాంటి బయాటిక్ టెర్రా'మైసిన్' మాతృక టెట్రా'సైక్లిన్' మందును కనుగొన్న డా.యల్లాప్రగడకు నోబెల్ బహుమతి ఇవ్వకపోవడం శోచనీయం.

గతంలో ప్లేగు మహమ్మారి ప్రపంచ మానవాళిని చుట్టపెట్టినప్పుడు టెర్రామైసిన్ మందు ప్రాణరక్షక ఔషధంగా కాపాడింది. ఇటీవల భూగోళాన్ని భయభ్రాంతులకు గురి చేసిన కరోనా వ్యాధిని డాక్స్'సైక్లిన్', అజిత్రో'మైసిన్' వంటి మందులు కీలకపాత్ర వహించి ప్రజలను కాపాడాయి. ఈ మందుల సృష్టికర్త డా. యల్లాప్రగడ సుబ్బారావు. ప్రాణాంతక వ్యాధి క్యాన్సర్‌కి కీమోథెరపిలో తొలితరం ఔషధం మెథాట్రాక్సీన్ మందును, క్షయ వ్యాధికి 'ఐసోనెక్స్', బోదకాలు, ఇస్నోఫీలియాకు హెట్రజన్ మందును ఆయన కనుగొన్నారు.

ప్రపంచ మానవాళిని గడగడలాడించిన ప్రాణాంతక ఉష్ణమండల–'స్ప్రూ' వ్యాధికి దివ్యౌషధం 'ఫోలిక్ ఆసిడ్' పోషకాన్ని డా. యల్లాప్రగడ 1945లో కనుగొన్నారు. ఆనాటి 'ఫోలిక్ ఆసిడ్–పోషక విటమిన్' ఈ రోజు గర్భిణులకు సంజీవనిలా, పుట్టబోయే బిడ్డల ఆరోగ్యానికి 'వెన్ను'దన్నుగాను పనిచేస్తున్నది. అంతేగాక క్యాన్సర్, గుండె జబ్బులు, మానసిక వ్యాధులు, పక్షవాతం మొదలైన వాటిని నియంత్రించడంలో 'కల్పతరువులా– యాంటి ఆక్సిడెంట్'గా ఉపయోగపడుతోంది. తాను కనుగొన్న మందుల ద్వారా ప్రపంచ మానవాళికి ఒక 'శాశ్వత ఆరోగ్యకవచం' అందించిన క్రాంతదర్శి, అపర ధన్వంతరి డా. యల్లాప్రగడ సుబ్బారావు.

డా. యల్లాప్రగడ సుబ్బారావు 1948 ఆగస్టు 9న నిద్రలోనే గుండెజబ్బుతో కన్నుమూశారు. ఆయన కనిపెట్టిన అజరామరమైన దివ్యౌషధాలు ప్రపంచ మానవాళి శ్వాసలో శాశ్వతంగా నిలిచిపోతాయి. ఇంతటి సాటిలేని ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త పేరును ఏలూరు ప్రభుత్వ వైద్యకళాశాలకు ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం ఖరారు చేయడం ముదావహం. డా. యల్లాప్రగడ స్మారక అవార్డులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలి. ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి.

● డా. ఎస్. శ్రీనివాస్
యల్లాప్రగడ శతజయంతి స్మారక పురస్కార గ్రహీత

(జనవరి 12: యల్లాప్రగడ సుబ్బారావు 130వ జయంతి)

వర్గీకరణపై పాట, పుస్తకం ఆవిష్కరణ

ఎస్సీ సామాజిక వర్గాల్లో రిజర్వేషన్లు–వర్గీకరణ అంశం మూడు దశాబ్దాలుగా నానుతోంది. సుప్రీంకోర్టు ధర్మాసనం ఇటీవల వెలువరించిన తీర్పులో వర్గీకరణ రాజ్యాంగబద్ధమైనది అంటూ, దీని అమలుకు రాష్ట్ర ప్రభుత్వాలకు విచక్షణాధికారాలు కట్టబెట్టింది. రాజ్యాంగ వ్యతిరేకమని విమర్శించబడుతున్న ఈడబ్ల్యుఎస్ 10 శాతం రిజర్వేషన్లను పార్లమెంటులో 103వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా అమలుకు ఆమోదించిన కేంద్రం, ఎస్సీ వర్గీకరణ విషయంలో చట్టం చేయకుండా మిన్నకుంది. మాల–మాదిగల మధ్య తిరిగి వైషమ్యాలు రెచ్చగొట్టడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందుకే 'రిజర్వేషన్లు–వర్గీకరణ ప్రజాస్వామిక హక్కు.' అని చాటుతూ పీడిత వర్గాలు–సమూహాల మధ్య ఐక్యతను చాటుతూ ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక ఒక పుస్తకం రూపొందించింది. అలాగే అరుణోదయ తాజాగా 'వర్గీకరణకు సై అందాం–మాల, మాదిగల మొకటవుదాం' అంటూ కొత్త పాట సీడీని రూపొందించింది. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నేటి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ పుస్తకం, సీడీల ఆవిష్కరణ సభ జరుగుతుంది. ఈ సభలో విమలక్క, పటోళ్ళ నాగిరెడ్డి, వెల్తురు సదానందం, ఏపూరి మల్సూర్, రమేష్ పోతుల, అరుణ, సామా అనసూయ, మల్లేశ్, రాయిసిడాం బాబురావు, అల్లూరి విజయ్‌లు పాల్గొంటారు.

– ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక
తెలంగాణ

మోగిన ఐలోని 'మల్లన్న' డోలు



12వ తేదీ నుంచి జాతర సంరంభం

- ముస్తాబైన ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం
- జానపదుల సవ్వడులు ఇక్కడి ప్రత్యేకత
- వివిధ పూజా విధానాలు ఆచరించనున్న భక్తులు

5

రేపు, ఎల్లుండి క్రెడాయి ప్రాపర్టీ షో

క్రెడాయి రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు ప్రేమ్‌సాగర్‌రెడ్డి, ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న క్రెడాయి రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో శని, ఆదివారాల్లో క్రెడాయి ప్రాపర్టీ షోను నిర్వహిస్తున్నట్లు క్రెడాయి రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు ప్రేమ్‌సాగర్‌రెడ్డి, ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి గురువారం తెలిపారు. హనుమకొండలోని క్రెడాయి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వరంగల్ నగరంలో క్రెడాయి సంస్థ 3వ ప్రాపర్టీ షోను హనుమకొండలోని పీజీఆర్ గార్డెన్‌లో శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాపర్టీ షోలో నూతనంగా ఇల్లు, విల్లాలు, అపార్ట్‌మెంట్ కొనుగోలు చేయాలనుకునే వారు, సొంతంగా ఇల్లు నిర్మించుకునే వారికి గొప్ప అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇల్లు నిర్మించుకునే వారు సౌకర్యవంతంగా ఉండేందుకు నగరంలో నిర్మిస్తున్న అన్ని అపార్ట్‌మెంట్స్, విల్లాలు, లేఔట్లను సంబంధించిన సమాచారం ప్రాపర్టీ షో ద్వారా వినియోగదారులు తెలుసుకోవచ్చన్నారు. అలాగే లోన్ సౌకర్యం కోసం వివిధ బ్యాంకులను ఒకే వేదికపైకి క్రెడాయి సంస్థ తీసుకొస్తున్నట్లు ప్రేమ్‌సాగర్‌రెడ్డి తెలిపారు.

జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. క్రెడాయి సంస్థ వినియోగదారులకు నమ్మకంగా పనిచేస్తోందని తెలిపారు. క్రెడాయి సంస్థలో ఉన్న సభ్యులు నిబంధనలకు లోబడి నాణ్యతతో నిర్మాణాలు చేపట్టి నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నారని తెలిపారు. సామాన్యుల నుంచి ఉన్నత వర్గాల వారు కొనుగోలు చేసుకునేలా రూ.40లక్షల నుంచి రూ.3 కోట్ల వరకు అపార్ట్‌మెంట్స్, విల్లాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ నగరంలో ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేస్తామని ప్రకటించడంతో దేశ వ్యాప్తంగా పెట్టుబడిదారులు వరంగల్‌లో వివిధ ప్రాంతాల్లో పెట్టుబడులు పెడుతున్నట్లు తెలిపారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట నగరాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ప్రాపర్టీ షోలో పాల్గొని ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు బుక్ చేసుకున్న వారికి డిస్కౌంట్ అందించనున్నట్లు ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రెడాయి ఉపాధ్యక్షులు ఎస్.అమరేందర్‌రెడ్డి, ఎస్.అమరలింగేశ్వరరావు, ఎం.రవీందర్‌రెడ్డి, కార్యదర్శి జె.మదన్, జాయింట్ సెక్రటరీలు రాజిరెడ్డి, రజినీకాంత్‌రెడ్డి, ఈసీ మెంబర్ ఎ.నాగరాజు, డి.హరిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సన్నాలకు బోనస్ ఏదీ?



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

సన్న ధాన్యం పండిన రైతులకు బోనస్ టెన్షన్ పట్టుకుంది. తాము పండించిన సన్న ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించి నెల రోజులకు పైగా అయినా ఇస్తామన్న బోనస్ సొమ్ములు.. ఇంకా తమ ఖాతాల్లో జమ కాకపోవటంతో వారు ఆందోళన చెందుతున్నారు. వ్యక్తం అవుతుంది. ఈ వానాకాలం సీజన్‌లో సన్నధాన్యం పండించి.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్ముకున్న రైతులకు క్వింటాలుకు రూ.500బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. చెప్పినట్టుగానే మొదట్లో సన్న ధాన్యం అమ్మిన రైతులకు వెంటవెంటనే బ్యాంకు ఖాతాల్లో బోనస్ డబ్బులను జమ చేశారు. అయితే డిసెంబరు రెండో వారం నుంచి మాత్రం ఈ బోనస్ డబ్బులు జమ చేసే విషయంలో జాప్యం చేయడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇంకా 33,958మంది రైతులు ఖాతాల్లో రూ.85.24 కోట్ల బోనస్ డబ్బుల జమకావాల్సి ఉండగా.. ఇంత పెద్దమొత్తంలో బోనస్ డబ్బులు విడుదల చేయ కుండా పౌరసరఫరాల శాఖ అధికారులు జాప్యం చేస్తుండటమేంటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

సన్నాల బోనస్‌కు నిధుల కొరత

ప్రభుత్వం సన్న ధాన్యం సాగును ప్రోత్సాహిం చేందుకు బోనస్ ప్రకటించింది. క్వింటాల్ సన్నవడ్ల కు రూ.500 చొప్పున చెల్లిస్తామని ప్రకటించటంతో రైతులు భారీగా సన్నాలను సాగు చేశారు. గతం కంటే ఈసారి భారీగా సన్నాల సాగు చేయటంతో భారీగా సన్నధాన్యం దిగుబడి వచ్చింది. గ్రేడ్-ఏ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 ప్రభుత్వం చెల్లిస్తుండగా.. దానికి అదనంగా సన్న రకం వడ్లకు రూ.500 ఇస్తున్నారు. అయితే గత అక్టోబరు నెలలోనే సన్నాలకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తామని ప్రకటించింది. రాష్ట్రం లో సాగయ్యే 33రకాల సన్న ధాన్యాలను పండించే రైతులను అందుకు అర్హులని ప్రకటించి.. ఆయా ధాన్యం రకాల జాబితాను ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో ప్రధానంగా సాంబ మసూరి, వరంగల్ సాంబ, వరంగల్ సన్నాలు, వరంగల్ వరి 1119, వరంగల్ వరి- 02 లాంటి ఓరుగల్లు బ్రాండ్ వడ్లు కూడా ఉన్నాయి. హామీ మేరకు ప్రభుత్వం డిసెంబ రు మొదటి వారం వరకు బోనస్ డబ్బులు సక్ర మంగానే రైతుల ఖాతాలో జమ చేసింది. ఆ తరు వాత బోనస్ డబ్బుల కోసం రైతులకు నిరీక్షణ తప్పటం లేదు. నెల రోజులుగా బోనస్ డబ్బులు జమ కాకపోవటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రభుత్వం వద్ద నిధుల కొరత వల్లనే సన్నాలకు బోనస్ ఇవ్వటం లేదనే చర్చ జరుగుతోంది. సన్నధాన్యం విక్రయించిన రైతుల వివరాలను నిర్వాహకు లు ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఓపీఎస్)లో నమోదు చేసిన అనంతరం పౌరసరఫ రాల శాఖ మార్కెటింగ్ అధికారికి లాగిన్ పంపిస్తారు. వీటి ఆధారంగా రైతుల బ్యాంకు ఖాతాలకు మార్కెటింగ్‌శాఖ అధికారులు ఈ-కుబేర్ యాప్ ద్వారా నగదు చెల్లిస్తారు. అయితే ప్రభుత్వం వద్ద నిధుల కొరత

మిగతా 5వ పేజీలో...

ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు ప్రభుత్వం సన్నాలకు చెల్లించిన, చెల్లించాల్సిన బోనస్ వివరాలు

జిల్లా	రైతులు	చెల్లింపులు	అందని రైతులు	చెల్లించాల్సినవి
వరంగల్	11,000	రూ.25.15కోట్లు	14,019	రూ.32కోట్లు
హనుమకొండ	13,361	రూ.28.69కోట్లు	657	రూ.1.47కోట్లు
మహబూబాబాద్	9891	రూ.22.75కోట్లు	11,820	రూ.26.75కోట్లు
జనగామ	5,973	రూ.11.29కోట్లు	1,717	రూ.3.06కోట్లు
భూపాలపల్లి	7,700	రూ.4.36కోట్లు	4,150	రూ.8.40కోట్లు
ములుగు	3,417	రూ.14.34కోట్లు	1,595	రూ.13.56కోట్లు
మొత్తం	51,342	రూ.106.58కోట్లు	33,958	రూ.85.24కోట్లు

- అదనపు పైసల కోసం నెలరోజులకు పైగా ఎదురుచూస్తున్న రైతులు
- ఉమ్మడి జిల్లాలో 85,907మంది అర్హులుగా గుర్తింపు
- ఇప్పటి వరకు 42,440మందికి రూ.106.58కోట్ల బోనస్ జమ
- ఇంకా 33,958మందికి అందని వైనం
- తొలి విడతలో త్వరితగతిన ఖాతాల్లో వేసిన అధికారులు
- ప్రస్తుతం తీవ్ర జాప్యం.. అసంతృప్తిలో అన్నదాతలు

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అందని రూ.85.24 కోట్లు

బోనస్ డబ్బులు ఎప్పుడు ఇస్తారో?

సొంటిరెడ్డి మహేందర్, రైతు, ఫత్తేపురం, తొర్రూరు మండలం



వ్యవసాయ భూమిలో 28.40 క్వింటాళ్ల సన్నధాన్యం పండించా. గతేడాది నవంబరు 27 న పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్ర యించా. అందుకు గాను రూ.65,888 ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం నా ఖాతాలో జమ అయింది. అయితే బోనస్ మాత్రం ఇంకా జమకాలేదు. ఆ బోనస్ కోసం ఎదురుచూస్తున్నా.. ప్రభుత్వం బోనస్ ఇస్తుందనే ఆశతోనే కొనుగోలు కేంద్రంలో సన్నవడ్లను విక్రయించా. వెంట నే ప్రభుత్వం బోనస్ డబ్బులను విడుదల చేయాలి.

ఆలయాలకు 'ముక్కోటి' శోభ

నేడు వైకుంఠ ఏకాదశి పర్వదినం

ఉత్తర ద్వార దర్శనాలకు ఏర్పాట్లు

వరంగల్ కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని వైష్ణవ ఆలయాల్లో ద్వార దర్శనానికి ఏర్పాట్లు జరిగాయి. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశుల్లో ప్రత్యేక విశిష్టత కలిగిన ఏకాదశి వైకుంఠ ఏకాదశి. శుక్రవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో ఉదయం 5 గంటలకు ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బ్రాహ్మీ ముహూర్తంలో ద్వార దర్శనానికి తరలివచ్చే భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు, ప్రసాద వితరణలు, దర్శనానికి ఏర్పాట్లు జరిగాయి. బట్టలబజార్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, గీతాభవన్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, ఎల్లంబజార్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం, డాక్టర్స్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర ఆలయం, ములుగు రోడ్‌లోని శ్రీదత్తక్షేత్రం దత్తాత్రేయస్వామి, ఆకారపు వారి గుడిలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, శివనగర్‌లోని శ్రీరామాలయం, భద్రకాళి రోడ్డులోని సింహాద్రి బాగ్ లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయం, దుగ్గొండి మండలం కేశవపూర్‌లోని శ్రీవేంకటేశ్వరాలయం, కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి, నర్సంపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, సంగెం మండలం కాట్రపల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అన్ని దేవాలయాల్లో విష్ణు సహస్ర నామ పారాయణం, ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు, ప్రసాద వితరణలు నిర్వహించనున్నారు. ములుగురోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో ఉదయం 10గంటలకు సామూహికంగా శ్రీభగవద్గీత పారాయణాన్ని నిర్వహిస్తున్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుప్పావై ప్రవచనాలు, గోదాదేవి పూజలు ధనుర్మాసోత్సవాల అర్చనలతో ఆధ్యాత్మిక సందడి వాతావరణం నెలకొంది.



విద్యుత్ దీపాలంకరణలో బాలానగర వేంకటేశ్వరస్వామి దేవాలయం

పలిమెలపై పట్టింపేదీ?

- నేటికీ చెక్కుచెదరని ఇచ్చంపల్లి
- ఫ్రెంచ్‌కాలం నాటి ప్రాజెక్టు ఆనవాళ్లు
- సర్వాయిపేట-దమ్మూర్ ప్రాంతంలో సంగమం
- కొండల మధ్యన పారే గోదావరి పరవళ్లు
- దృష్టిసారిస్తే పర్యాటకంగా ఎంతో అభివృద్ధి

5



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి

వరంగల్ కలెక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, జనవరి 9: (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సత్య శారద అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రోడ్డు భద్రత మహోత్సవాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 31 వరకు రోడ్డు భద్రతా మాసోత్సవ అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రోడ్డు ప్రమాదాలు, మరణాలలో 75 నుంచి 80శాతం వరకు డ్రైవర్ల తప్పిదాల వల్లే సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు సెల్‌ఫోన్ ఉపయోగించడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాటిని నియంత్రించడం వల్ల రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీ రవీందర్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జైపాల్‌రెడ్డి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, ఆర్‌అండ్‌బీ ఈఈ జితేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భారీ వాహనాల డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు ప్రతీక్షణం అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. గురువారం ములుగురోడ్‌లోని ఆర్టీసీ శిక్షణ కళాశాలలో జిల్లా షెడ్యూల్ కులాల సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో లైట్, హెవీ మోటార్ డ్రైవింగ్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ముఖ్య అతిథిగా పాల్గొని ధృవీకరణ పత్రాలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. డ్రైవింగ్‌లో నైపుణ్యాల గురించి తెలుసుకోవాలన్నారు. శిక్షణ పొంది ధృవీకరణ పత్రాలు పొందిన వారు టీప్రైడ్ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు రాయితీ వస్తుందని, జిల్లా స్థాయి కమిటీలో వారికి సబ్సిడీ మంజూరు చేస్తామన్నారు.

శిక్షణ పొందిన వారు వెహికిల్ లోన్ తీసుకునేందుకు సిఫారసు చేస్తామని కలెక్టర్ తెలి పారు. జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో వచ్చే వారంలో జాబ్ మేళా ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ జీఎం ఆనంద్, రవాణాశాఖ డీటీసీ శ్రీనివాస్, ఆర్టీసీ డైరెక్టర్ ట్రెయినర్ సుధాపరిమళ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, ఆర్టీసీ ఐటీఐ ప్రిన్సిపాల్ అర్పిత తదితరులు పాల్గొన్నారు.



గీసుగొండ జడ్పీ పాఠశాలలో ఖో ఖో ఆడుతున్న క్రీడాకారిణులు

సంప్రదాయ క్రీడలను భావితరాలకు అందించాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి
- గీసుగొండలో రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీల ప్రారంభం

5



జేఎన్‌ఎస్‌లో సిద్ధమవుతున్న జాతీయస్థాయి సెపక్‌తక్రా క్రీడా కోర్టు

'సెపక్‌తక్రా' పోటీలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి జేఎన్‌ఎస్‌లో జాతీయ స్థాయి క్రీడలు
- 28 రాష్ట్రాల నుంచి 600 మంది క్రీడాకారులు హాజరు

పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలి

ఆర్‌ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్‌ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి

జనగామ రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : భూసేకరణ రీ హాబిలిటేషన్, రీ సెటిల్మెంట్(ఆర్‌ఆర్) అథారిటీ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, ఆర్‌ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌లతో కలిసి వినయ్ కృష్ణారెడ్డి భూసేకరణలో భాగంగా ఆర్‌ఆర్ అథారిటీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సేకరణలో భాగంగా ఆర్‌ఆర్ ద్వారా భూముల ఆమోదానికి సత్వరమే ప్రతిపాదనలు పంపించాలని, సంబంధిత హక్కుపత్రాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సీసీ రోడ్లు, తాగు నీరు, తదితర మౌలిక వసతుల కల్పనకు భూసేకరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, సర్వే ల్యాండ్ ఏడీ మన్యం కొండ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను నిబంధనలు అమలు చేయాలి

ఆదాయ పన్నుల శాఖ జిల్లా అధికారి మహేందర్ బాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మహేందర్ బాబు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆదాయ పన్ను నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, రికవరీలు, మినహాయింపులకు సంబంధించిన సమాచారాన్ని సవివరంగా అమలు జరిగేలా చూడాల్సిన బాధ్యత డీడీఓలపై ఉందని జిల్లా ఆదాయ పన్ను అధికారి మహేందర్ బాబు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్‌కుమార్‌తో కలిసి డీడీఓలకు, ఉద్యోగులకు ఆధాయపన్ను రిటర్న్ దాఖలుపై ఆదాయ పన్ను అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఆదాయ పన్ను ముఖ్య ఆదాయ వనరు అని, ఆదాయ పన్ను కింద వసూలయ్యే ప్రతీ పైసా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కోసం ఖర్చవుతోందన్నారు. ఆదాయ పన్ను రిటర్న్ ఫారం ఐటీఆర్-1 జులై31లోగా ఫైల్ చేయాలన్నారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా డీడీఓలకు ఆదాయ పన్నుకు సంబంధించి రిటర్న్, త్రైమాసిక, వార్షిక రిటర్న్ ఎప్పుడు సమర్పించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఆదాయ పన్ను అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేడీసీ డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ ఫలితాలు వెల్లడి



ఫలితాలను వెల్లడిస్తున్న కట్ల రాజేందర్, తిరుమలదేవి, రాజిరెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్ జనవరి 9(ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ ఫలితాలను గురువారం కళాశాలలో కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజిరెడ్డి వెల్లడించారు. గత డిసెంబరులో పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో అన్ని కోర్సుల్లో 39 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఐ.శివనాగశ్రీను, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఇ.కొమురయ్య, పి.త్యాగయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, వైస్ ప్రిన్సిపాల్ కె.రజినీలత, డాక్టర్ ఇందిరాదేవి, అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్యామ్‌ప్రసాద్, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ రవికుమార్, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల చోరీకి పాల్పడుతున్న నలుగురి అరెస్టు



సుబేదారి పోలీసుస్టేషన్‌లో చోరీకి పాల్పడిన ముఠా సభ్యులను అరెస్టు చూపుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న నలుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం సుబేదారి సీఐ పి.సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి పాల్గొని చోరీలకుసంబంధించిన వివరాలను వెల్లడించారు. సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలోని అదాలత్ సెంటర్ వద్ద ఎస్సై గాలిబ్ పోలీసు సిబ్బందితో వాహనాలు తనిఖీలు చేస్తుండగా నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా వెళ్తున్నట్లు తెలిపారు. వారిని పట్టుకొని విచారించగా హనుమకొండ, మచిలీబజార్, పరకాల మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన అఖిల్, అభిరామ్, సిద్ధార్థ, మధుసూదన్‌లు కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలోని రాంనగర్, సాయినగర్, బాలసముద్రం, భవానీనగర్, నయీంనగర్, అమరావతినగర్ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఇళ్లల్లో ఉన్న ద్విచక్ర వాహనాలను చోరీ చేసి విక్రయించగా వచ్చే డబ్బులతో జల్సాలు చేస్తున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన నలుగురు నిందితుల నుంచి ఆరు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోగా, మొత్తం విలువ సుమారు రూ.4లక్షల 60వేలు ఉంటుందన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్సై గాలిబ్, ఏఎస్సై పాపయ్య, హెడ్‌కానిస్టేబుల్ రోషన్ అలి, కానిస్టేబుల్ అఖిల్‌తోపాటు పోలీసు సిబ్బందిని ఏసీపీ దేవేందర్‌రెడ్డి అభినందించారు. సమావేశంలో ఎస్సైలు రామారావు, ఫణి తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా సంధ్యారాణి బాధ్యతలు



భద్రకాళి అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి

వరంగల్ కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా కె.ఎస్.సంధ్యారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న టి.శ్రీకాంతరావు కొండగట్టు దేవస్థానం ఈవోగా బదిలీ కాగా, ఆయన స్థానంలో సికింద్రాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న సంధ్యారాణి డీసీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ధార్మిక భవన్‌లో బాధ్యత చేపట్టిన అనంతరం సహాయ కమిషనర్ రాయల సునీత, సూపరింటెండెంట్లు, దేవాలయ సిబ్బంది డీసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సంధ్యారాణి చారిత్రక భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు భద్రకాళి శేషు, అధికారులు ఈవో శేషు భారతి స్వాగతం పలికారు. వల్లభగణపతిని దర్శించుకొని అమ్మవారి దర్శనం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో శేషు భారతి, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, కూచన హరినాథ్, ఫొటోగ్రాఫర్ శ్యామ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్‌కు ఐదు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఐదు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీ శనివారం వారంతపు యార్డు బంద్ సెలవు, 12వ తేదీ ఆదివారం వారాంతపు సెలవు, 13వ తేదీ సోమవారం భోగి పండుగ, 14వ తేదీ మంగళవారం సంక్రాంతి పండుగ, 15వ తేదీ బుధవారం కనుమ పండగ సెలవు తిరిగి గురువారం నుంచి మార్కెట్లో యథావిధిగా క్రయ విక్రయాలు జరుగుతాయి. ఈ విషయాన్ని గమనించి రైతులు, కార్మికులు, వ్యాపారులు మార్కెట్ కమిటీకి సహకరించాలని మార్కెట్ కార్యదర్శి నిర్మల కోరారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లు చేస్తుంది

వరంగల్ వ్యవసాయం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కనీస మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేస్తుందని, పత్తి కొనుగోళ్లలో ఏదైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సీసీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్ దవే గురువారం ఒక ప్రకటనలో కోరారు. పత్తి సీజన్ ప్రారంభమైనప్పటి (సెప్టెంబరు 2024) నుంచి ఇప్పటి వరకు 345.93 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. రైతుల వద్ద ఉన్న పత్తిని కొనుగోలు చేస్తుందని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. రైతులు పత్తి విక్రయించే సమయంలో ఏదైనా ఇబ్బందులుంటే సీసీఐ అధికారులకు ఫిర్యాదు చేయాలని, వాట్సాప్ నంబర్ 77189 55728 ద్వారా సమాచారాన్ని పంపవచ్చని అర్జున్ దవే ఆ ప్రకటనలో తెలిపారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ఆగాపేటలో కార్డెన్ సెర్చ్



నర్మెట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జనగామ ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ అన్నారు. గురువారం ఆగాపేటలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని నాలుగు వాహనాలను సీజ్ చేశారు. బెల్ట్ షాపు తనిఖీచేసి రూ.5,100 విలువైన మద్యాన్ని, 22 నిషేధిత అంబర్ ప్యాకెట్లను పట్టుకున్నారు. ఆగాపేట చౌరస్తాలో ప్రజలతో మాట్లాడుతూతల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారో గమనించాలన్నా రు. యువత గంజాయి, గుట్కా లాంటి అలవాట్లు చేసుకోవద్దన్నారు. కార్యక్రమం లో సీఐ అబ్బయ్య, నర్మెట ఎస్సై నగేష్, బచ్చన్నపేట ఎస్సై హమీద్, జనగామ ఎస్సైలు రాజేష్,రాజన్‌బాబు పాల్గొన్నారు.

పనితీరును తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్

పోలీసుల పనితీరును, పోలీసులపై ప్రజలకు అభిప్రాయాలను తెలుసుకునేందుకు పోలీస్ శాఖ క్యూఆర్ కోడ్ పద్ధతిని ప్రవేశపెట్టినట్లు జనగామ ఏఎస్పీ చేతన్ నితిన్ అన్నారు. నర్మెట మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో క్యూఆర్ కోడ్ గల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రజలు పోలీసుల పనితీరుపై ఫీడ్‌బ్యాక్ అందించాలన్నారు. కార్యక్రమంలో సీఐ అబ్బయ్య పాల్గొన్నారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ప్రభాకర్‌కు డాక్టరేట్



ప్రభాకర్

కేయూ క్యాంపస్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం పరిశోధకుడు బి.ప్రభాకర్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు గురువారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ ప్రభాకర్‌కు డాక్టరేట్ ప్రకటించారు. 'ఏ స్టడీ ఆన్ ఎఫెక్టు ఆఫ్ సర్క్యూట్ ట్రైనింగ్ ఆన్ వేరియాస్ స్కిల్‌స కబడ్డీ ప్లేయర్స్ ఆఫ్ వరంగల్ అనే అంశంపై వరంగల్ కిట్స్ కళాశాల ప్రొఫెసర్ పి. రమేశ్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. వరంగల్ ములుగు రోడ్డులోని ఎల్‌బీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ సాధించిన ప్రభాకర్‌ను బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

కామర్స్‌లో రామకృష్ణకు..

కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకుడు రామగిరి రామకృష్ణ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు గురువారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ డాక్టరేట్ ప్రకటించారు. రామకృష్ణ 'రిటైల్ ఇన్వెస్టర్స్ బిహేవియర్ అవార్డు ఈక్విటీ అన్వెస్టిమెంట్ ఇన్ స్టాక్ మార్కెట్ - ఏ స్టడీ ఆఫ్ నార్తన్ తెలంగాణ రీజియన్' అనే అంశంపై పరిశోధనగ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించారు. కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ పి.వరలక్ష్మి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఆర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ అండ్ సైన్స్ కళాశాల అటానమస్‌లో కామర్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా రామకృష్ణ పనిచేస్తున్నారు. డాక్టరేట్ సాధించిన రామకృష్ణను పలువురు అభినందించారు.

'డప్పుల సన్నాహక ప్రదర్శన'కు తరలిరావాలి

ఎంఎస్‌పీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కుమార్ మాదిగ

బాలసముద్రం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 19న నిర్వహించే సన్నాహక డప్పుల ప్రదర్శనలో పాల్గొనేందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ వస్తున్న సందర్భంగా ప్రతీ గ్రామం నుంచి ప్రతీ మాదిగ బిడ్డ డప్పును చంకనేసుకొని హనుమకొండ అంబేద్కర్ కూడలికి రావాలని ఎంఎస్‌పీ జాతీయ నేత మందకుమార్ మాదిగ విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే 'వేల గొంతులు లక్ష డప్పుల మహా ప్రదర్శన'ను విజయవంతం చేసేందుకు 19న జరిగే సన్నాహక డప్పుల ప్రదర్శనకు మాదిగలను తరించేందుకు గురువారం హరిత హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మందకుమార్ మాదిగ మాట్లాడారు. ఎస్సీల వర్గీకరణ చేస్తానని మాట ఇచ్చి తప్పిన సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగల ఆవేదన, ఆగ్రహం అంటే ఏంటో చూపిస్తామని ఆయన హెచ్చరించారు. మహా ప్రదర్శన నిర్వహించే ఫిబ్రవరి 7 లోపు ఎస్సీ వర్గీకరణ చేస్తే మాదిగలు ప్రభుత్వానికి అనుకూలంగా సంతోషంగా డప్పు కొడుతారని వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేస్తే చావు డప్పు కొట్టి మాదిగల ఆగ్రహం చూపిస్తామని హెచ్చరించారు. సమాజంలోని కవులు, కళాకారులు, మేధావులు, వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు హైదరాబాద్‌లో జరిగే డప్పుల ప్రదర్శనకు సంఘీభావం ప్రకటిస్తున్నారని ఆయన తెలిపారు.

ఈ సమావేశంలో ఎంఎస్పీ జాతీయ నేత వేల్పుల సూరన్న కాపు, జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, ఎంఈఎఫ్ జాతీయ కార్యదర్శి కుమ్మరి రాజయ్య మాదిగ, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు పుట్ట రవి మాదిగ, మంద రాజు, ఆరెపల్లి పవన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీకి ఐనవోలు జాతర ఆహ్వాన పత్రిక



సీపీ అంబర్‌కిషోర్ ఝాను ఆహ్వానిస్తున్న ఈవో నాగేశ్వర్‌రావు, అర్చకులు

ఐనవోలు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలను ఈనెల 12 నుంచి ప్రారంభం కానున్నాయి. కాగా, జాతరకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝాను ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు సీపీ కార్యాలయంలో సీపీని కలిసి శాలువాతో సత్కరించి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించగా అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు.

కేయూ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ చెస్ పురుషుల జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య తదితరులు

కేయూ క్యాంపస్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని వెల్స్ యూనివర్సిటీలో జనవరి 8 నుంచి 11 వరకు జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ క్రీడలకు కేయూ పురుషుల చెస్ జట్టును 2024-25 ఏడాదికి గురువారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో టి.అరుణ్‌కుమార్(కేయూ ఇంజనీరింగ్ కో ఎడ్యుకేషన్ కళాశాల, కేయూ క్యాంపస్), ఎం.ప్రశాంత్(యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సుబేదారి), కె.అద్వైత్, టీవీఎస్ దివ్యంశ్, ఎన్. సంజయ్‌చంద్ర, బి.లోకేశ్(కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల, హసన్‌పర్తి)లున్నట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా హసన్‌పర్తి కిట్స్ కళాశాల, ఫిజికల్ డైరెక్టర్ ఎస్.మహేశ్ వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.

పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

వరంగల్ క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో దాడులు చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతోపాటు రూ. 11,600, 6 సెల్‌ఫోన్‌లు, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. సుధానగర్‌లోని అనుమాండ్ల కుమారస్వామి ఇంట్లో దుర్గాకాలనీకి చెందిన తౌటిరెడ్డి జవహర్, ఆదర్శ కాలనీకి చెందిన రిటైర్డ్ రైల్వే ఎంప్లాయ్ ఎం.డి. నజీమోద్దిన్, జులైవాడకు చెందిన ఎం.డి.రియాజ్, గోపాల్‌పూర్‌కు చెందిన ఆర్‌టీసీ రిటైర్డ్ ఎంప్లాయ్ కేదారి నాగేశ్వర్‌రావులు పేకాటాడుతూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారన్నారు.

గీసుగొండ పీఎస్ పరిధిలో..

గీసుగొండ పీఎస్ పరిధిలోని గొర్రెకుంట శివారులో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.8,670 స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ తెలిపారు. మొత్తం ఏడుగురు ఆడుతుండగా నలుగురు పట్టుబడగా గొర్రెకుంటకు చెందిన కుతాటి మధు, కరీమాబాద్‌కు చెందిన తొగటి కిరణ్, ఖిలా వరంగల్‌కు చెందిన దేవర వినయ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఏషియన్ పారా త్రోబాల్ పోటీలకు క్రిష్ణవేణి

దాతల సాయం కోసం ఎదురుచూపు



స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన మాచర్ల క్రిష్ణవేణి ఏషియన్ పారా త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు వరల్డ్ పారాత్రోబాల్ ఫెడరేషన్ నుంచి ఆమెకు వచ్చిన ఆహ్వాన పత్రంను తెలంగాణ పారా త్రోబాల్ అసోసియేషన్ బాధ్యులు ఇటీవల అందించారు. కాంబోడియా దేశ రాజధాని నగరం నామ్‌పెన్‌లో మార్చి 28 నుంచి 30 వరకు జరగనున్న పోటీలలో పాల్గొనడం కోసం పారాత్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెలక్షన్ కమిటీ తెలంగాణ నుంచి క్రిష్ణవేణిని ఎంపిక చేశారు. కాంబోడియాకు వెళ్లి అక్కడ పోటీలలో పాల్గొనడానికి అయ్యే ఖర్చులు క్రీడాకారులే భరించాల్సి ఉండడంతో నిరుపేద కుటుంబానికి చెందిన క్రిష్ణవేణి దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో గత డిసెంబరు కాంబోడియాలో జరిగిన ఇంటర్నేషినల్ సిట్టింగ్ పారా త్రోబాల్ పోటీలలో పాల్గొని క్రిష్ణవేణి గోల్డ్‌మెడల్ సాధించింది. ప్రస్తుతం ఏషియన్ పోటీలకు ఎంపిక కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి



సమావేశంలో పాల్గొన్న జగదీష్ చందర్‌రెడ్డి, నాయకులు

రఘునాథపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శ్రీమన్నారాయణపురంలో గురువారం జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ హాజరయ్యారు. సమావేశంలో గ్రామానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులపై తీర్మానాలను చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో బూత్ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ బొల్లం అజయ్‌మణికంఠ, లోనే శ్రావణ్ కుమార్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొనాసి క్రాంతి కుమార్, తూడి సుదర్శన్, తిప్పారపు రవిందర్, మాచర్ల యాదగిరి, గొల్లూరు భిక్షపతి, బి.ప్రభాకర్, ఎం.బాలరాజు పాల్గొన్నారు.

● ఇబ్రహీంపూర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఉల్లోజు సంపత్(35) భౌతిక కాయానికి కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్‌రెడ్డి, తదితరులు గురువారం నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి గ్రామస్థులు రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు మేకల నరేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, పోకల శ్రీనివాస్, దొరగొల్ల యాదగిరి, చింత నరేష్, పల్ల అబ్బయ్యగౌడ్, కల్లెం భాస్కర్‌రెడ్డి, కాసర్ల లక్ష్మయ్య, పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2520	2045
పల్లికాయ (సూక)	6300	5600
పల్లికాయ (పచ్చిది)	5000	4500
కందులు	7020	5560
పెసళ్లు	7033	4000
పత్తి	7200	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	15300	9000
తేజ మిర్చి (కొత్తది)	-	-
తేజ ఏసీ	14500	13000
వండర్‌హాట్ ఏసీ	13000	12000
యూఎస్341ఏసీ	12500	11000
యూఎస్341	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

మోగిన ఐలోని మల్లన్న డోలు

- 12వ తేదీ నుంచి జాతర
- ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం ముస్తాబు

- జానపదుల సవ్వడులు ఇక్కడి ప్రత్యేకత
- వివిధ పూజా విధానాలు ఆచరించనున్న భక్తులు

ఆధ్యాత్మికం



ఆలయంలో భక్తులు కట్టిన టెంకాయ బంధనం మొక్కులు (ఫైల్)

కోడె కట్టుట.. టెంకాయ బంధనం

శివుడి వాహనం కోడె (నంది) కోరికలు తీరితే కోడెను కడుతారు. ఖండోబ అవతారంలో స్వామి వారికి భార్యలు కుడిపక్క గొల్ల కేతమ్మ ఎడమ పక్కన బలిజ మేడమ్మలు కొలువయ్యారు. పెళ్లి కాని వారు, సంతానం లేమి, తదితర సమస్యలు ఉత్పన్నమైనప్పుడు మొక్కుబడి టెంకాయ బంధనం చేస్తారు. కొబ్బరికాయ, పసుపు, కుంకుమ, జాకెట్ ముక్క ముడుపు కడుతారు. కోరికలు తీరాక ముడుపు విప్పి మొక్కుబడిని చెల్లిస్తారు. ఇది తరతరాలుగా వస్తున్న భక్తుల నమ్మకం. ఒడి బియ్యం పసుపు, నూనెతో కలిపి పోకచెక్కలు, ఖర్జూర పండ్లు, ఇద్దరు అమ్మవార్లకు చీరలు, జాకెట్ ముక్కలు, గాజులు పెడతారు. స్వామి వారికి దోతి తువ్వాల సమర్పిస్తూ ఒడి బియ్యం పోసి మొక్కు తీర్చుకుంటారు. రాణి రుద్రమదేవి సైతం తన కూతురు ముమ్మడమ్మకు సంతానప్రాప్తి కోసం ఐదు రోజులు ఇక్కడే ఉండి మొక్కుకున్నట్లు చరిత్ర ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి.

ఐనవోలు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పూర్వకాలంలో జానపదుల జాతరగా కీర్తి గడించి.. శైవారాధన పూజలు అందుకుంటున్న ఐనవోలు మల్లికార్జునస్వామి (మల్లన్న) జాతర భక్తులకు ఎంతో ప్రాశస్త్యమైనది. 1100 ఏళ్ల శైవక్షేత్రమైన అష్టోత్తర స్తంభాల ఆలయంలో కోరికలు తీర్చేందుకు కోరమీసాల మల్లన్న కొలువయ్యాడని భక్తుల విశ్వాసం. విభిన్న శైవాగామ పద్ధతుల్లో నిత్యపూజలు అందుకునే మల్లన్నస్వామి ఒక చేతిలో ఖడ్గం, మరో చేతిలో త్రిశూలం, ఢమురకం.. తలపై కిరీటం, మూతిపై మీసంతో ప్రత్యేకంగా దర్శనమిస్తాడు. ప్రతీ రోజు శైవాగమ పద్ధతిననుసరించి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం జరుగుతుండగా ముఖ్య పూజల్లో భక్తులు బోనాలు, పట్నాలతో నైవేద్యం సమర్పిస్తారు.

స్వామి అమ్మవార్లకు బోనం, నైవేద్యం

భక్తులు బోనం అన్నంలో పాలు, బెల్లంతో పరామాన్నం వండుతారు. కాకరకాయ, చిక్కుడుకాయ, వంకాయ, గుమ్మడికాయ అన్ని కలిపి వండి పచ్చి పులుసుతో నైవేద్యం సమర్పిస్తారు. ఆలయంలో స్వామి వారికి అర్చకులు ఉదయం బాల బోగం, మధ్యాహ్నం మహానైవేద్యం, సాయంత్రం ప్రదోశకాల బోగం సమర్పిస్తారు. ఒగ్గు పూజారులు రాత్రి స్వామి వారికి పవళింపుసేవతో ద్వారబంధనం చేస్తారు.

బండారి పసుపు.. గజ్జెల లాగు..

తెలుపు బొట్టు విభూతి పెట్టుకున్న వారితో మరణం ఉండకూడదని మణిమల్లాసురులనే రాక్షసులు బ్రహ్మచే వరం పొందారు. అదే రాక్షసులను సంహరించేందుకు పసుపు(బండారి) బొట్టు గజ్జెల లాగు తొడిగి జాలి ముస్కు వేసుకోని కొరడా, త్రిశూలం, ఢమురుకంతో వచ్చి మల్లికార్జున స్వామి రాక్షసులను సంహరించడాని భక్తుల విశ్వాసం. భక్తులు పసుపును కిలోల కొద్దీ తీసుకవచ్చి స్వామి వారికి సమర్పించి వెంట కొంత తీసుకెళ్తారు. ఒగ్గు పూజారుల కథల్లో మల్లన్న కు-మంగోలియ దేశానికి పసుపు సంబంధం కనిపిస్తుంది.



భక్తి పారవశ్యంతో శివసత్తులు (ఫైల్)

శివసత్తులు.. శివసతులు

జాతరలో ఎటు చూసినా శివసత్తుల పూనకాలే కనిపిస్తాయి. శివసతులే శివసత్తులుగా పిలువబడుతున్నారు. శివుడికి నాట్యం అంటే ఇష్టం మహిళలు శివుడిని కల్యాణం చేసుకునే సంప్రదాయం పూర్వ కాలం నుంచి వస్తుంది. అందులో భాగంగానే పునకాల నడుమ నృత్యాలు చేస్తారు. పురుషలు మహిళా వేషాధారణలో తన్మయం చెందుతారు.

గండ దీపం.. శేవాలు

గండాలు తీరితే గండదీపం పెడుతారు. తలపై దీపం పెట్టుకొని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తారు. పిల్లజెల్ల సల్లగా ఉంటే శేవాలు తీస్తామని మొక్కుకున్న వారు తలనీలాలు సమర్పిస్తారు.

పుట్టమట్టితో ఇంట్లో గద్దెల నిర్మాణం

మల్లికార్జునస్వామిని ఇలవేల్పు దైవంగా భావించే యాదవులు, కుర్మలు, ఇలవేల్పులుగా కొలిచే మరిన్ని కులాలవారు జాతరకు ముందు పుట్ట మన్నుతో ఇంట్లో మల్లన్న గద్దెలు నిర్మించుకొని రోజు సాయంత్రం ఇళ్లలో డోలు మోగిస్తారు. ఆలయంలో మల్లన్న స్వామి పుట్టమన్ను రూపంలోనే కొలువయ్యాడు. నెల పట్టులు సస్టేడు (ఏడు) వారాలు పండుగను జరుపుకుంటారు. ఇళ్లలో డోలు మోగించి నెల పాటు భక్తిపారవశ్యంతో మాంసహారం, మద్యానికి దూరంగా ఉంటూ జాతరకు వచ్చి దర్శనం చేసుకుంటారు. పాలు, పెరుగు బయటికి ఇవ్వకుండా నేతి(నెయి)ని చేసి స్వామి వారికి దీపంగా సమర్పిస్తారు.

నృత్య మండపంలో సల్లవద్దనం

బండారి పూసుకున్న భక్తులు కాకతీయుల నృత్యమండపంలో కొరడాల మధ్య శివనాట్యం చేసి మల్లన్నను స్మరిస్తూ సల్ల కవ్వం (మజ్జిగ) చేసి స్వీకరిస్తారు. దీనిని చూడటానికి భక్తులు వేలసంఖ్యలో హాజరవుతారు. శివసత్తుల నృత్యాలు మండపాన్ని మారుమోగిస్తుండగా పసుపుమయమవుతుంది.

జాతర

ఐనవోలు మల్లన్నకు డిసెంబరు 16న సోమవారం దృష్టి కుంభం జరిగింది. ఈ నెల 12న ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 13న బోగి పండుగ 14న మకర సంక్రాంతి ఈ రెండు రోజుల్లో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. తదుపరి ఉగాది వరకు ప్రతీ ఆది, బుధవారం వారాంతపు జాతర కొనసాగుతుంది. మొత్తం 11 వారాల జాతరకు లక్షల భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి దైవ దర్శనం చేసుకొని మొక్కులు ముట్టచెప్పుతారు.



ఒగ్గు పూజారుల పట్నం తంతు (ఫైల్)

చెలుక, నజరు, పెద్దపట్నాల తంతు

మొక్కులతో ఆలయానికి వచ్చే భక్తులు ముందుగా ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించుకోని మొక్కులు చెల్లించాకే స్వామి వారిని దర్శించుకుంటారు. బండారి పలుకపై తెల్లపిండి పసుపు కనుగోల్లు, దోశడు బియ్యం పోసి మైలపోలు తీస్తారు. కుడుక, పోక, ఖర్జూర, పసుపు గౌరమ్మను పెట్టి రైక మలపు తెల్లతువ్వాల పెట్టి మైలపోలు తీశాక, తంగడిపచ్చతో చల్లి తెల్లపిండిలో పలుక కొట్టి పట్నం(పటం) వేసి మల్లన్న కథలు చెప్పుతారు. శరణు మల్లేశా.. అంటూ పాటలోనే కల్యాణం చేసి పట్నం మీద అక్షింతలు వేస్తారు. భక్తులు ఒక్కకొద్దు విడిచి స్వామి వారిని దర్శించుకుంటారు. పెద్దపట్నం వేసి స్వామి కథ ను చెప్పుతారు. జానపదుల అవాహనాల్లో పట్నం అంటే 'ఆసనం' రూపకంలో శివుడిని ఆహ్వానించడం అన్నమాట. స్వామి వారికి ఉదయం మేలుకొలుపు, రాత్రి పవళింపు ఒగ్గు పూజారులే చేయం ఆనవాయితీగా వస్తోంది.

సంక్రాంతికే ప్రభల జాతర

సంక్రాంతి వరకు మొదటి పంట పండి రెండో పంట రైతు ఇంటికి చేరుకుంటాయి. ధాన్యం దిగుబడులు పెరుగాలని పశుసంపద వృద్ధి చెందాలని ప్రభల బండ్లను (ఎద్దుల బండ్లు) సుందరంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. మార్నేని వంశీయులు పెద్ద రథంను (శిడి) అందంగా ముస్తాబు చేసి గ్రామంలోని పురవీధుల గుండా మహానివేదనను ఆలయానికి తీసుకువస్తారు. దీనిని అనుసరించి వివిధ గ్రామాల నుంచి వచ్చే బంతి పూల బండ్లు ఆలయం చుట్టూ తిరుగుతాయి. సాయంత్రం నుంచి తెల్లవారేవరకు శోభ సంతరించుకుంటుంది. దీనిని బట్టే జానపదుల జాతరగా పిలుబడుతుందని ప్రచారంలో ఉంది. ఒగ్గు పూజారులు పట్నాలు వేసి ఢమురుకాల శబ్దాల నడుమ భక్తులకు దీవనార్థి ఇస్తారు.

ఐనవోలు జాతర ఉత్సవ కమిటీ నియామకం

ఐనవోలు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం జాతర ఉత్సవ కమిటీని ప్రకటించారు. ఈ కమిటీ పదవీకాలం కేవలం 4 రోజులకే ఇచ్చారు. ఈ మేరకు దేవాదాయ, ధర్మదాయశాఖ కమిషనర్ ఇ.శ్రీధర్ నియామకపు ఉత్తర్వులు వెలువరించారు. ఈ కమిటీలో మొత్తం 14 మంది సభ్యుల(ధర్మకర్తల)ను నియమించారు. ఈ కమిటీ పదవీకాలం ఈ నెల 12 నుంచి 15 వరకు కొనసాగనుంది. కమిటీలో 14 మంది సభ్యులను నియమించారు. కమ్మగొని ప్రభాకర్‌గౌడ్(కొత్తపల్లి), మానాల సుదర్శన్‌రెడ్డి(కొండపర్తి), బందెల వెంకన్న (దౌలత్‌నగర్), ధరం పూర్ణచందర్(పర్వతగిరి), బండ సరిత(ల్యాబర్తి), గుంటి కుమారస్వామి(ఇల్లంద), కొండేటి మమత(వర్ధన్నపేట), నూనావత్ కీమానాయక్ (బీకే తండా), కూస చిరంజీవి(పెరుమాండ్లగూడెం), పెండ్లి సంపత్(ఒంటిమామిడిపల్లి), దొమకొండ హరీష్(నందనం), నూతనగంటి రాజు(దమ్మన్నపేట), పల్లకొండ రమేష్(ఐనవోలు), సి.మధుసూదన్(కొండాపూర్, రంగారెడ్డి జిల్లా దాత) ఉత్సవ కమిటీ సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సన్నాలకు బోనస్ ఏదీ?

(3వ పేజీ తరువాయి)

ఉండటం మూలన రైతులకు అందాల్సిన బోనస్ డబ్బులు విడుదల కావటం లేదని సమాచారం.

రూ.85.24కోట్ల బోనస్ పెండింగ్

సన్నధాన్యానికి బోనస్‌కు బ్రేక్ పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ప్రకటనతో చాలా మంది రైతులు బోనస్‌పై ఆశతో బయట మార్కెట్లో విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మకాలు చేశారు. క్వింటాలుకు 5కిలోల వరకు తరుగు తీసినా బోనస్‌పై ఆశతో అమ్మకాలు చేశారు. అయితే గత నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో అమ్మితే మద్దతు ధర రూ.2,320మాత్రమే రైతుల ఖాతాల్లో జమయినట్టుగా మెసేజ్ రావటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ దాదాపుగా పూర్తయినా రైతులకు అందాల్సిన బోనస్ జమ కాకపోవటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 85,907 మంది రైతులు సన్నధాన్యం విక్రయించేందుకు అర్హత పొందారు. వీరిలో ఇప్పటి వరకు 51,342మంది రైతులు తమ ధాన్యాన్ని విక్రయించి రూ.106.58కోట్ల బోనస్‌ను పొందారు. ఇంకా 33,958మంది రైతులకు 85.24 కోట్ల బోనస్ డబ్బులు అందాల్సి ఉంది.

అయితే వీరిలో అత్యధికంగా హనుమకొండ జిల్లాలో 13,361 మంది రైతులకు 28.69 కోట్ల బోనస్ వచ్చింది. ఇంకా కేవలం 657మంది రైతులకు రూ.1.47కోట్ల బోనస్ పెం డింగ్‌లో ఉంది. అలాగే వరంగల్ జిల్లాలో 11 వేల మంది రైతులకు రూ. 25.15కోట్ల బోనస్ జమ అయింది. ఇంకా 14,019 మందికి రూ.32 కోట్ల బోనస్ అందాల్సి ఉంది. అతి తక్కువగా భూపాలపల్లి జిల్లాలో 7,700 రైతులకు రూ.4.36 కోట్ల బోనస్ మాత్రమే జమ అయింది. ఇంకా 4,150 మంది రైతులకు రూ.8.40 కోట్ల వరకు బోనస్ డబ్బులు అన్నదాతల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రూ.85.24కోట్ల బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సంప్రదాయ క్రీడలను భావితరాలకు అందించాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి
- గీసుగొండలో రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడలు ప్రారంభం

ఖోఖో క్రీడల ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి →



గీసుగొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దేహదారుఢ్యంతో పాటు, మానసికోల్లాసాన్ని కలిగించే సంప్రదాయ క్రీడలను భావితరాలకు అందించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి కోరారు. గీసుగొండ జడ్పీ పాఠశాలలో 57వ రాష్ట్రస్థాయి ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందన్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న వారికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని స్పష్టం చేశారు. మనకంటే తక్కువ జనాబా ఉన్న దేశాలు ఆటల్లో ఎంతగానో రాణిస్తున్నాయన్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను పరకాల నియోజకవర్గంలో నిర్వహించాలని, దానికి తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఖోఖో పోటీల నిర్వహణకు ఆర్థిక సహకారంతో పాటు క్రీడాకారులకు భోజనవసతిని కల్పించిన వారిని ఎమ్మెల్యే అభినందించి సన్మానించారు.

మొగిలిచర్లలో స్పోర్ట్స్ సిటీకి కృషి

మొగిలిచర్లలో స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి హామీ ఇచ్చారు. ఖోఖో పోటీల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. గీసుగొండలో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఆయిల్‌సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. అజీజ్‌ఖాన్, వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా విద్యాశాఖాధికారి జ్ఞానేశ్వర్, ఖోఖో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కృష్ణమూర్తి, ఆర్గనైజింగ్ కన్వీనర్ వీరగోని రాజ్‌కుమార్, అల్లం స్వప్నదేవి బాలకిశోర్‌రెడ్డి, వరంగల్ ఒలంపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కైలాస్‌యాదవ్, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం పట్టాభి, మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య, మాజీ జడ్పీటీసీ పోలీసు ధర్మారావు, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, నాయకులు అల్లం మర్రెడ్డి, నాగరాజు, బాబు, వీడీలు కోట రాంబాబు, స్వప్న, భిక్షపతి, రాజన్న, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు

వరంగల్ జిల్లా గీసుగొండ జడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో వివిధ జిల్లాల జట్లు హోరాహోరీగా పోటీపడుతున్నాయి. గురువారం మొదటి రోజు మహిళల విభాగంలో హైదరాబాద్ జట్టు ఖమ్మం జట్టును 40-17 పాయింట్లతో చిత్తుచేసింది. మహబూబాబాద్ జట్టు నిజామాబాద్ జట్టును 26-11 పాయింట్లతో ఓడించింది. అదిలాబాద్ జట్టు మెదక్ జట్టును 56-2 పాయింట్లతో చిత్తుచేయగా వరంగల్ కరీంనగర్‌పై 26-14 పాయింట్లతో రంగారెడ్డి జట్టు నిజామాబాద్‌పై 50-12తో పాయింట్ల తేడాతో విజయం సాధించింది. పురుషుల విభాగంలో వరంగల్ జట్టు నల్లగొండపై (36-22), హైదరాబాద్ జట్టు నిజామాబాద్ జట్టుపై(34-14), అదిలాబాద్ జట్టు మెదక్‌పై (35-30), రంగారెడ్డి జట్టు నిజామాబాద్‌పై (50-12), కరీంనగర్ జట్టు నల్లగొండ జట్టుపై (28-22), ఖమ్మం జట్టు మహబూబ్‌నగర్ జట్టుపై (38-26) పాయింట్ల తేడాతో విజయం సాధించాయి.

'సెపక్‌తక్రా' పోటీలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి జేఎన్‌ఎస్‌లో జాతీయ స్థాయి క్రీడలు
- 28 రాష్ట్రాల నుంచి 600 మంది క్రీడాకారులు హాజరు
- బస, భోజన ఏర్పాట్లను పూర్తి చేసిన నిర్వాహకులు



జేఎన్‌ఎస్‌కు వస్తున్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఈ నెల 14 వరకు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ (జేఎన్) ఇండోర్, ఔట్ డోర్ స్టేడియంలో 34వ జాతీయ స్థాయి సీనియర్ స్త్రీ, పురుషుల సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం కానున్నాయి. పురుషుల విభాగంలో 28రాష్ట్రాలు, స్త్రీల విభాగంలో 22 రాష్ట్రాల నుంచి 600మంది క్రీడాకారులు 150మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు, రెఫరీలు పాల్గొననున్నారు. అదే విధంగా సీనియర్స్ స్త్రీ, పురుషుల విభాగాల్లో 5రోజుల పాటు పండుగ వాతావరణంలో క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. ఫుట్ వాలీబాల్‌గా కీర్తి గడించి.. నేడు సెపక్‌తక్రాగా రూపాంతరం చెందిన క్రీడా పోటీలు 20 ఏళ్ల కిందట హనుమకొండ నగరంలో నిర్వహించారు. ఇప్పుడు జేఎన్‌ఎస్ స్టేడియం వేదికగా జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. పోటీల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి హాజరయ్యే క్రీడాకారులకు, టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లకు నగరంలోని వివిధ ప్రైవేటు హోటల్స్, పాఠశాలలు, యూత్ హాస్టల్‌లో బస సౌకర్యాలను నిర్వాహకుల ఏర్పాట్లు చేశారు. క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు టెక్నికల్ అఫీషియల్స్‌కు జేఎన్‌ఎస్‌లో భోజన వసతి ఏర్పాటు చేసినట్లు సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెక్కల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

నాలుగు పద్ధతుల్లో క్రీడల నిర్వహణ

టీమ్ ఈవెంట్, రెగో, డబుల్స్, కాడ్ లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిన క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. టీ ఈవెంట్, రెగో విభాగాల్లో ముగ్గురు, ముగ్గురు క్రీడాకారులు పోటీలో పాల్గొంటారు. అదే విధంగా డబుల్స్‌లో ఇద్దరు ఇద్దరు చొప్పున పోటీ పడగా కాడ్ విభాగంలో నలుగురి చొప్పున పోటీల్లో ఎదురెదురుగా పోటీల్లో పాల్గొంటారు.

క్రీడా పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి




రెక్కల శ్రీనివాస్‌రెడ్డి, సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

జేఎన్ ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియంలో 5రోజుల పాటు నిర్వహించనున్న జాతీయస్థాయి సెపక్‌తక్రా క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అన్ని విధాలుగా ఏర్పాట్లను పూర్తి చేశాం. క్రీడాకారులకు నగరంలోని ప్రైవేటు స్కూల్‌లు, యూత్ హాస్టల్‌లో బస వసతి కల్పించాం. అదే విధంగా టెక్నికల్ అఫీషియల్స్, రెఫరీలకు సమీపంలోని ప్రైవేట్ హోటల్స్‌లో బస సౌకర్యంతో పాటు జేఎన్‌ఎస్‌లో భోజన వసతి ఏర్పాటు చేశాం.

పలిమెలపై పట్టింపేదీ?

- నేటికీ చెక్కుచెదరని ఇచ్చంపల్లి
- ఫ్రెంచ్ కాలం నాటి ప్రాజెక్టు ఆనవాళ్లు
- సర్వాయిపేట-దమ్మూర్ ప్రాంతంలో సంగమం
- కొండల మధ్యన పారే గోదావరి పరవళ్లు
- మైమరపించే పలిమెల ప్రకృతి అందాలు
- దృష్టిసారిస్తే పర్యాటకంగా ఎంతో అభివృద్ధి

సంగమ తీరం వద్ద గోదావరి పరవళ్లు



మహదేవపూర్ రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : చుట్టూ ఎత్తైన కొండలు.. వాటి మధ్య ప్రవహించే గోదావరి పరవళ్లు ఓ వైపు. శతాబ్దాల కాలం నాటి ప్రాజెక్టు.. ఇప్పటికి చెక్కు చెదరని ఆనవాళ్లు మరో వైపు. ఇలా అడుగడుగునా ఏదో ఒక కొత్త అనుభూతిని పంచే ప్రకృతి అందాలు పంచుకుతున్న మారుమూల ప్రాంతం పలిమెల మండలం. చారిత్రాత్మక సిగలో ఇమిడిన పర్యాటక ప్రాంతాలెన్నిటికో నిలయం. వీటిపై పర్యాటకశాఖ, ఇటు స్థానిక అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో ప్రకృతి అందాలు ప్రపంచానికి తెలియకుండానే పోతున్నాయి.

శతాబ్దాల కాలం నాటి ఇచ్చంపల్లి ప్రాజెక్టు

శతాబ్దాల కాలం కింద పలిమెల మండలం వెంచంపల్లి వద్ద అప్పటి ఫ్రెంచ్ ప్రభుత్వం నిర్మించిన ఇచ్చంపల్లి ప్రాజెక్టు ఆకృతులు ఈమండలానికి తరగని వన్నెలా నిలిచాయి. ఈప్రాజెక్టుకు ఓవైపు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, మరో వైపు తెలంగాణ రాష్ట్రాలు ఉంటాయి. ఫ్రెంచ్ ప్రభుత్వం సుమారు 2వేల మంది కూలీలతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టగా ప్రారంభంలోనే ప్లేగు వ్యాధి సోకి వారంతా మృతి చెందారు. దీంతో నాడు ప్రాజెక్టు నిర్మాణం మధ్యలోనే ఆగిపోగా.. ఆ అసంపూర్తి నిర్మాణాలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. ప్రాజెక్టు నిర్మాణం కోసం వెంచంపల్లి వద్ద గోదావరి నదిలో నిర్మించిన తాత్కాలిక రోడ్డు, ఛత్తీస్‌గఢ్ వైపు గోదావరి నది మధ్యలో నిర్మించిన ప్రాజెక్ట్ దిమ్మెలు కనువిందు చేస్తున్నాయి. శతాబ్దాల కాలంనాటి ప్రాజెక్టు కావడంతో పర్యాటకులు సెలవు దినాల్లో వచ్చి సేదదీరుతుంటారు. ఈనిర్మాణాలు డంగు సున్నంతో నిర్మించడంతో ఇప్పటికీ చెక్కు చెదరలేదని స్థానికులు, చరిత్రకారులు చెబుతున్నారు.

సంగమ తీరం.. పర్యాటక హారం

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మారుమూల పలిమెల మండలంలోని సర్వాయిపేట, దమ్మూర్ శివార్లలో గోదావరి-ఇంద్రావతి నదుల సంగమ(రెండు నదులు కలిసే చోటు) తీరం పర్యాటకులను మైమరపింపజేస్తోంది. తెలంగాణ, మహారాష్ట్రలను వేరు చేస్తూ గోదావరి నది, మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను వేరు చేస్తూ ఇంద్రావతి నది ఇక్కడ కలుస్తాయి. ఈప్రాంతం వద్ద మహరాష్ట్ర, తెలంగాణలతో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల వైపు ఎత్తైన కొండలు.. ఆకొండలను చీల్చుతూ రెండు నదులు కలిసే సంగమ తీరం ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తుంది. ఇక్కడ గోదావరి, ఇంద్రావతి నదుల్లో నల్లరాతి బండలు..వాటిపై వెళ్తున్న గోదావరి అలలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తాయి. సినిమాటిక్ తరహాలో ఈప్రాంతంలో లొకేషన్లు ప్రతిభింబిస్తాయి. కనుల విందుగా కనిపించే ఈదృశ్యాలను తిలకించేందుకు పలిమెల మండలంలోని సర్వాయిపేట, దమ్మూర్ గ్రామశివార్లలోని అటవీ ప్రాంతం ద్వారా నేరుగా లేక మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచా తాలూకా అసరెల్లి మీదుగా ఈ ప్రాంతానికి వెళ్లొచ్చు.

అద్భుతంగా ఉన్నా.. ఆదరణ లేక..

ఎత్తైన కొండల మధ్యన ఉన్న గోదావరి-ఇంద్రావతి నదుల సంగమ తీరం, ఏళ్ల కాలం నాటి ఇచ్చంపల్లి ప్రాజెక్టు పలిమెల పర్యాటకానికి వన్నె తీసుకువస్తున్న అధికారులు దృష్టిసారించకపోవడంతో ఆ అందాలు కనుమరుగవుతున్నాయి. పర్యాటకంగా ఈరెండింటిపై అధికారులు దృష్టిసారిస్తే ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంది. పర్యాటకులు వెళ్లేందుకు కనీసం వసతులు కల్పించినా సందర్శకులు మాత్రం వారాంతంలో భారీగా తరలివస్తున్నారు. ఆహ్లాదం పంచే అడవి అందాలు.. గత కాలం ప్రాజెక్టు, నదుల కలయికలను చూసేందుకు వచ్చే పర్యాటకులను మరింత ఆకర్షించేలా అభివృద్ధి చేస్తే పలిమెల మండలవ్యాప్తంగా ఉన్న గిరిజనులకు ఉపాధి కూడా దొరికే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


భక్తి పారవశ్యం మిళితం

లెంకలగడ్డ నుంచి మొదలు.. ముకునూర్, నీలంపల్లి వరకు ఉన్న అటవీ ప్రాంతం ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుంది. గుట్టల మధ్య నుంచి వెళ్తుంటే ఎంతటి ఏసీలు కూడా పనిచేయనంతా శీతల ఉపశమనాన్ని పొందొచ్చు. నీలంపల్లి సమీపంలోని కొండపై లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, గోదావరి, ఇంద్రావతి నదుల కలయిక వద్ద నది మధ్యలో శివలింగం ఇటుగా వచ్చిన వారికి భక్తి పారవశ్యాన్ని నింపుతాయి. ఈరెండు నదుల కలయిక వద్ద మధ్య ఉన్న శివలింగం గోదావరి నది ప్రవాహం తగ్గితేనే బయటకు కనిపిస్తుంది. ప్రవాహం ఉన్నన్ని రోజులు ఆశివలింగం గోదావరి నది క్రిందే నిక్షిప్తమై ఉంటుంది. రెండు నదులు కలుస్తుండటం, నది మధ్యలో శివలింగం ఉండటంతో మహారాష్ట్ర వైపు ఉన్న కొండమీద ప్రతి మహాశివరాత్రికి శివకళ్యాణం జరుపుతారని అక్కడి వారు చెబుతున్నారు.

దమ్మూరు సమీపంలో గోదావరి నది అందాలు



ఇచ్చంపల్లి వద్ద గోదావరిపై ప్రాజెక్టు కట్టడాలు



జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికయ్యారు. ఈ నెల 7 నుంచి 9 వరకు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నిర్వహించిన రాష్ట్ర సైన్స్ ఫెయిర్‌లో ఏకశిల హైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని కె.జెస్సీ, 9వ తరగతికి చెందిన ఎం.మన్విత‌రెడ్డి జాతీయ స్థాయికి ఎంపిక కాగా, రోజరి హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి బి.విష్ణువేద్ ద్వితీయ బహుమతిని సాధించారు. ఈనెల 19న పుదుచ్చేరిలో నిర్వహించే దక్షిణభారతస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఇద్దరు విద్యార్థులు హాజరు కానున్నారు. కాగా వీరి ముగ్గురికి డీఈవో వాసంతి అభినందనలు తెలిపారు.


జాతీయ స్థాయికి ఎంపికై బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఫార్మసీలో డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలి



కంట్రోలర్ రాజేందర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న పీడీఎస్‌యూ నేతలు

కేయూ క్యాంపస్ జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కేయూ పరిధిలోని ఫార్మసీ విభాగంలో డిటెన్షన్ విధానాన్ని వెంటనే ఎత్తివేయాలని పీడీఎస్‌యూ నేతలు గురువారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌ను తన చాంబర్‌లోకలిసి వినతిపత్రాన్ని అందచేశారు. బీఫార్మసీ కోర్సులలో డిటెన్షన్ విధానాన్ని అమలుచేయడంతో విద్యార్థులు పైచదువులకు వెళ్లలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీ అధికారులు స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్, నాయకులు వెంకట్, ఠాగూర్, ప్రభాస్, రాజు, నివేద, వైష్ణవి, సింధూజ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో ఫాతిమా చిత్రపటానికి నివాళి


ఫాతిమా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంద నరేశ్ తదితరులు

కేయూ క్యాంపస్ జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని మొట్టమొదటి మహిళా మైనారిటీ ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా చిత్రపటానికి గురువారం కేయూ ప్రధాన గ్రంథాలయం వద్ద ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ నేతృత్వంలో పూలమాల వేసి నివాళులర్పించారు. షేక్ ఫాతిమా సావిత్రిబాయి పూలే దంపతుల ఆదర్శాలను పణికిపుచ్చుకుందని కొనియాడారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని తెలిపారు. కార్యక్రమంలో కేయూ ఏబీఎస్ఎఫ్ అధ్యక్షుడు దూడపాక నరేందర్, ఉపాధ్యక్షుడు దార సురేశ్, శ్రవణ్, ప్రణయ్, కిరణ్ కుమార్, చంటి, గోవిందు రవి, సురేశ్‌లాల్, సాయి, ప్రసన్న, తేజ, ఉమా, శిరీష, పావని పాల్గొన్నారు.

కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలలో స్వయంపాలన


స్వయం పాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఖిలావరంగల్ మండలం కరీమాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తించారు. ఉపాధ్యాయులుగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి హెడ్మాస్టర్ పుట్ట రమేష్, ఉపాధ్యాయ బృందం రాజమౌళి, శ్రీనివాస్, శ్రీవాణి, అశోక్, తిలక్, శైలజ, వెంకటరమణ, శేషాచారి, కరుణ కుమారి, ప్రగత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి మొక్కనాటాలి : కేయూ వీసీ


ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులంతా ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయన ఆర్ట్స్ కళాశాల ఎంబీఏ ప్రాంగణంలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకూ అడవులు అంతరించిపోతుండటంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ పుల్ల రమేష్, అధ్యాపకులు ప్రసాద్, గిరిప్రసాద్, స్వామి, సురేష్, కనకయ్య, రవీందర్, శ్రీనివాస్, సుచరిత, శ్రీలత, సాహితి, ఫిరోజ్, సునిత, మయూరి తదితరులు పాల్గొన్నారు.

గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ


గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అసోసియేషన్ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్-2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య గురువారం కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాఅభివృద్ధిలో అన్ని ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో గెజిటెడ్ అధికారులు కీలకపాత్ర పోషిస్తారని కొనియాడారు. క్యాలెండర్ ఆవిష్కరణలో గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమనేని జగన్‌మోహన్ రావు, జిల్లా అధ్యక్షులు దాసరి మురళీధర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కోశాధికారి పెరుమాండ్ల రాజేష్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలా రాజేష్, శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, మాధవ రెడ్డి, పెద్ది ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లోనే రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

- సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న అధికారులు
- ప్రభుత్వానికి కోట్ల ఆదాయం వస్తున్నా.. సొంత భవనాలు కరవు

హనుమకొండ టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఏడాదికి కోట్లల్లో ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా సొంత భవనాలు నిర్మించడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సరైన వసతులు లేక కార్యాలయానికి వచ్చే ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో తాగునీరు, మరుగుదొడ్లు లేక మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ, పరకాల, నర్సంపేట, ములుగు, కొడకండ్ల, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, భూపాలపల్లి, భీమదేవరపల్లి, వర్ధన్నపేట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఖిలా వరంగల్, వరంగల్ రూరల్, మహబూబాబాద్‌లోనే ప్రభుత్వ సబ్ రిజిస్ట్రేషన్ భవనాలు ఉన్నాయి. ఈ భవనాల్లో కొన్ని చోట్ల మరుగుదొడ్లు ఇతర మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించి దశల వారిగా పక్కా భవనాలు నిర్మిస్తామని ప్రకటించారు. మొదటి దశలో హైదరాబాద్, రంగారెడ్డి, ఇతర ప్రాంతాల్లో సబ్ రిజిస్ట్రర్ భవనాలు నిర్మిస్తున్నారు.



హనుమకొండలో అద్దె భవనంలో ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయం

దశల వారీగా నిర్మాణం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మిస్తామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన వివరాలను అందజేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వానికి రూ.కోట్లల్లో ఆదాయం వచ్చే రిజిస్ట్రేషన్ల సొంత భవన నిర్మాణాలను చేపట్టాలని, అన్ని వసతులు ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డుకు సీపీ సత్కారం

వరంగల్ క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సుదీర్ఘకాలంగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు పురుషోత్తంను సీపీ అంబర్ కిషోర్ ఝా గురువారం క్యాంపు కార్యాలయంలో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. భవిష్యత్‌లో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా పురుషోత్తంకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేశ్‌కుమార్, హోంగార్డ్స్ ఏసీపీ నాగయ్య, ఆర్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


హోంగార్డుకు జ్ఞాపికను అందజేస్తున్న సీపీ


ముగ్గుల పోటీల్లో కామర్స్ అధ్యాపకులు, విద్యార్థులు

కామర్స్ విద్యార్థులకు రంగవల్లి పోటీలు

కేయూ క్యాంపస్ జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కేయూ కామర్స్ అండ్ బిజినెస్ విభాగంలో గురువారం విద్యార్థులకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రంగవల్లి - పతంగుల పోటీలు నిర్వహించారు. కేయూ కామర్స్ విభాగాధిపతి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.అమరవేణి ఆధ్వర్యంలో జరిగాయి. విద్యార్థులు సంప్రదాయక దుస్తులు ధరించి అలరించారు. పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగవల్లి పోటీల్లో తీరొక్క ముగ్గులు వేశారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలలో ముగ్గులు ప్రత్యేకమని అమరవేణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇతర అధ్యాపకులు డాక్టర్ బి.రాధికరాణి, సీహెచ్ రాధిక, ప్రగతి, ఫణీంద్ర, ఏఆర్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్‌తోపాటు ఎంకామ్, ఎంబీఏ స్టూడెంట్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా, ముగ్గుల పోటీల్లో ప్రత్యూష, సాత్విక, నిఖిత బృందాలు వరుసగా మూడు బహుతులను అందుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

వరంగల్ క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 21 మందిని గురువారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రాజశేఖర్‌రెడ్డి రూ.27,500 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 8 మందికి రూ.3,800 జరిమానా విధించామన్నారు.

యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తి

కేయూ క్యాంపస్ జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తిగా నిలిచారని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు అన్నారు. గురువారం కేయూ జువాలజీ విభాగంలో కేయూ శాఖ నేతృత్వంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని 'భారతీయత వివేకానంద దార్శనికత' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాచర్ల రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశ సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత విద్యార్థులు, యువతపై ఉందన్నారు. వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప మహనీయుడు స్వామి వివేకానంద అని పేర్కొన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని వర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థులకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ప్రతిభచూపిన వారికి బహుమతులను అందచేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కేయూ ప్రెసిడెంట్ సాయి, సెక్రటరీ శివ, రాష్ట్ర నాయకులు చట్ల సతీశ్, అంబాల కిరణ్, గట్టు ప్రశాంత్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పూజ, ఒరాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరికృష్ణ, సంయుక్త, సాయి ప్రియ, ఎలేంద్ర, అఖిల్, ఈశ్వర్, రాజు, ఫణింద్ర, అభి, మల్లేశ్, రాజ్‌కుమార్, భార్గవ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

యువత దేశాభివృద్ధికి పాటుపడాలి

రాంనగర్ : యువత వివేకానంద స్ఫూర్తితో దేశాభివృద్ధికి తోడ్పాటునందించాలని కేయూ వైస్‌చాన్సలర్ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఎన్ఎస్ ఎస్ జిల్లాస్థాయి యువజనోత్సవాలు గురువారం హనుమకొండ కిషన్‌పురలోని వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. దేశ సాంస్కృతిక, సంప్రదాయాలను వెలికితీయడంలో యువజనోత్సవాలు దోహదం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థుల నృత్యాలు, గానాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శేషాచలం, వైస్ ప్రిన్సిపాల్ హరీందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ కో-ఆర్డినేటర్ ఈసం నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కేయూలో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రాంబాబు తదితరులు

ఎల్కతుర్తి జంక్షన్ లెవలింగ్ పనులు పూర్తిచేయాలి

- అధికారులకు కలెక్టర్ ప్రావీణ్య ఆదేశం

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తి జంక్షన్‌లో రెండు వైపులా లెవలింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య సం బంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖ అధికారులతో గురువారం కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో పలు అభివృద్ధి పనులు, వాటి పురోగతి, తదితర వివరాలను సంబంధిత శాఖల అధికారులు కలెక్టర్‌కు వివరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. వంగరలోని పీవీ విజ్ఞాన కేంద్రంలోని పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన పనులు ఏమైనా ఉంటే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ మేన శ్రీను, సీపీఓ సత్యనారాయణరెడ్డి, హనుమకొండ ఆర్‌డీఓ రమేష్ రాథోడ్, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్ బాబు, శాఖల అధికారులు పాల్గొన్నారు.



కేయూ మొదటి గేటు వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నూతన మార్గదర్శకాలతో వర్సిటీల మనుగడకు ముప్పు

కేయూ క్యాంపస్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా ఉన్నత విద్య రంగంలో యూజీసీ తీసుకువచ్చిన 2025 నూతన మార్గదర్శకాలతో వర్సిటీ స్వయం ప్రతిపత్తి దెబ్బతిని మనుగడకు ముప్పు వాటిల్లుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్ ఆందోళన వ్యక్తంచేశారు. గురువారం యూజీసీ నూతన మార్గదర్శకాలను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో కేయూ మొదటి గేటు వద్ద నిరసన ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ అధ్యక్షుడు స్టాలిన్, సెక్రటరీ మంద శ్రీకాంత్‌లు మాట్లాడారు. వర్సిటీల కొత్త మార్గదర్శకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.గవర్నర్లకు విశిష్ట అధికారులను కల్పించడంతో వర్సిటీ వారి జోక్యం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగంలో కార్పొరేట్ సంస్కృతిని తెస్తున్నారని చెప్పారు. వీసీలు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో పారదర్శకత లోపిస్తోందని ఆరోపించారు. యూజీసీ ముసాయిదా నిబంధనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో దేశ వ్యాప్తంగా ఆందోళనలను చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేయూ కమిటీ సభ్యులు అజయ్, మల్లేశ్, రాహుల్, సందీప్, రత్నాకర్, వినయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

- తహసీల్దార్‌కు సీపీఎం నేతల వినతి

రాంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పెద్దమ్మగడ్డ ఏరియాలోని జ్యోతిబస్‌నగర్ ఫేజ్-2 కాలనీవాసులకు పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ తహసీల్దార్ శ్రీపాల్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. 20 ఏళ్లుగా నివాసం ఉంటున్న జ్యోతిబస్ నగర్ ఫేజ్-2 కాలనీ వాసులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నార్త్ ఏరియా కమిటీ ఆధ్వర్యలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. జ్యోతిబస్ నగర్ కాలనీలో ఉంటున్న గుడిసేవాసులందరికీ ప్రభుత్వం నుంచి కరెంట్ మీటర్లు, హౌస్ హోల్డర్ నెంబర్స్ కేటాయించారన్నారు. జీవో 58 ప్రకారం ఇంటి పట్టా కోసం గతంలోనే దరఖాస్తు చేసుకొని ఉన్నారన్నారు. పట్టాలు రెడీగా ఉన్నాయని గత ప్రభుత్వం చెప్పినప్పటికీ ఇప్పటికీ అందలేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సొంత స్థలంలో పట్టా కలిగి ఉండాలని నిబంధన పెట్టడంతో గుడిసెల్లో ఉంటున్న పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు వచ్చే అవకాశం లేదన్నారు. కాగా, ప్రభుత్వం తక్షణమే బాధితులకు వ్యక్తిగత పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొట్ల చక్రపాణి, నార్త్ ఏరియా కార్యదర్శి గాదె రమేశ్, నాయకులు నవీన్, అభిరామ్, రాజు, శ్యామ్, రమ, విజయ, రజిని పాల్గొన్నారు.


తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

జర్నలిస్టు ముఖేష్ చంద్రకర్ హత్యపై విచారణ జరిపించాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వడ్డెపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో జరిగిన జర్నలిస్టు ముఖేష్ చంద్రకర్ హత్యపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్(టీపీఎఫ్) రాష్ట్ర ప్రతినిధి జనగాం కుమారస్వామి డిమాండ్ చేశారు. ముకేష్ చంద్రకర్ హత్యకు సంబంధించిన దోషులను కఠినంగా శిక్షించాలని ఛత్తీస్‌గడ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. అబూజ్‌మడ్ ప్రాంతంలో ఆదివాసీ ప్రజల సంస్కృతి సంప్రదాయాలను హక్కులను ప్రపంచానికి తెలియజేస్తున్న జర్నలిస్టు ముకేష్ చంద్రకర్‌ను హత్య చేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. అక్కడి ఖనిజ సంపదను, బడా కార్పొరేట్ సంస్థలు దోపిడీ చేస్తుంటే వాటిని తన కలం ద్వారా సమాజానికి తెలియజేసేవారని అన్నారు. అవినీతి అక్రమాలను బయటపెట్టినందుకే చత్తీసగడ్‌లోని కాంట్రాక్టర్ ముకేష్ చంద్రకర్‌ను హత్య చేయించారని, ఈ హత్యకు బీజేపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రాచర్ల బాలరాజు, జె.కళా, గోపు సోమయ్య, జయంత్, క్రాంతి, వడ్డెపల్లి రాజేందర్, రాజ్‌మహ్మద్, మహమూద్, పొన్నాల రమేష్, యాకన్న, వెంకన్న పాల్గొన్నారు.


క్వెస్ట్ గణిత ఒలింపియాడ్‌లో రామన్ విద్యార్థుల ప్రతిభ

హనుమకొండ టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గత నెలలో హైదరాబాద్‌లో నిర్వహించిన క్వెస్ట్ గణిత ఒలంపియాడ్‌లో జాతీయ స్థాయిలో హనుమకొండ రామన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు గురువారం పాఠశాల కరస్పాండెంట్ రాజేష్ కుమార్ రామినేని, ప్రిన్సిపాల్ కె.రజిత తెలిపారు. ఈ మేరకు ఒలంపియాడ్‌లో ప్రతిభ కనబర్చిన 21మంది రామన్ పాఠశాల విద్యార్థులు వందలోపు ర్యాంకులు సాధించడంపై పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయస్థాయి ఒలంపియాడ్‌లో ప్రతిభ కబర్చిన విభాస్‌కాష్యప్ 6వ ర్యాంకు, రిషిక్‌ఆశ్రం 9వ ర్యాంకు, శ్రీవర్శిణి 33వ ర్యాంకు మిథాన్ష్‌రెడ్డి 18వ ర్యాంకు, నంద హరినాథ్‌రెడ్డి 19 ర్యాంకు, అజీజ్‌ఖాన్ పథన్ 24వ ర్యాంకు. అభీరానందన్ 25వ ర్యాంకు, నాగశ్రీ యజ్ఞిక్ 26వ ర్యాంకు, యశ్వర్ధన్ 27వ ర్యాంకు, యశస్విని 3వ ర్యాంకు, శ్రీహర్షిక 28వ ర్యాంకు, సూర్యవైష్ణవి 6వ ర్యాంకు, అశ్విన్‌వర్మ 13వ ర్యాంకు, మోహిత్‌రెడ్డి 20వ ర్యాంకు, చంద్రిక 23వ ర్యాంకు, పునీత్ రామ్‌సదన్ 24వ ర్యాంకు సాయి రిత్విక్ 26వ ర్యాంకు, సాయి శ్రీకర్, 27వ ర్యాంకులు సాధించారు. కాగా, ఒలంపియాడ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ రాజేష్‌కుమార్ రామినేని, డైరెక్టర్లు పురుషోత్తం తీర్థాల, మడికొండ బ్రాంచ్ ప్రిన్సిపాల్ స్రవంతి, హనుమకొండ బ్రాంచి ప్రిన్సిపాల్ రజిత గణిత అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పుష్పగుచ్ఛాలను అందించి అభినందించారు.


ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న రామన్ పాఠశాల డైరెక్టర్లు

స్టేట్ ట్రస్మా కార్యవర్గంలో జిల్లా వాసులు

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : స్టేట్ ట్రస్మా కార్యవర్గంలో వరంగల్ జిల్లా వడుప్సా ప్రతినిధులకు చోటు దక్కింది. బుధవారం హైదరాబాద్ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించగా అందులో ఎగ్జిక్యూటీవ్ సెక్రెటరీగా ఎస్.వెంకటేశ్వర్‌రావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శ్యాం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్‌గా గ్యానేశ్వర్‌సింగ్, జాయింట్ సెక్రెటరీగా చక్రపాణి ఎన్నికయ్యారు.



సహజయోగ

సహజ సంక్రాంతి

'సం'-క్రాంతి' అనే పదంలో 'సం' అంటే 'శుభం' అని, 'క్రాంతి' అంటే 'పరివర్తన' లేదా 'విప్లవం' అని అర్థం. 'సంక్రాంతి' అంటే శుభకరమైన పరివర్తన తెచ్చే రోజు. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని 'మకర సంక్రమణం' అంటాం. ఆ రోజు నుంచి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది. అప్పటివరకూ దక్షిణ దిక్కున ప్రయాణించిన సూర్యుడు తన దిశను మార్చుకొని... ఉత్తర దిక్కులో సంచారం మొదలుపెడతాడు. సూర్యుడి గమనం మారడం వల్ల... వాతావరణంలో మార్పులు వస్తాయి.

సమస్త సృష్టికి ఆధారభూతుడు సూర్య భగవానుడు. ఆయన అనుగ్రహం లేకపోతే మానవాళికి మనుగడ లేదు. తను నిరంతరం మండుతూ సమస్త విశ్వానికి మేలు చేకూరుస్తాడు. ఇతరులకు ఆనందం కలిగిస్తాడు. ఈ గుణాలు మనలో పెంపొందించుకుంటే అహంకారానికి తావుండదు. రాత్రి చీకటి వల్ల మనం నిద్రావస్థలో ఉంటాం. సూర్యుడు ఉదయించాక... ఆయన ప్రకాశం వల్లనే పనులన్నీ జరుగుతాయి. కాబట్టి అన్ని కార్యాలను ప్రభావితం చేసేది సూర్యుడే. మరో ముఖ్యమైన విషయం ఏవిటంటే... మిగిలిన పండుగలన్నీ చంద్రుని గమనం ఆధారంగా జరుపుకొంటే... సంక్రాంతిని సూర్య గమనాన్ని పరిగణనలోకి తీసుకొని జరుపుకొంటాం. అందుకే ఇది చాలా ముఖ్యమైన రోజు.

పెద్ద పండుగ

సంక్రాంతి పండుగ సమయానికి ధాన్యం పొలాల నుంచి ఇంటికి చేరుకుంటుంది. చేతికి వచ్చిన పంటను చూసి రైతులు ఆనందంతో పొంగిపోతారు. కొత్త బియ్యానికి బెల్లం జోడించి పరమాన్నం, అప్పాలు, అలాగే అరిసెలు, చక్కిలాలు లాంటివి తయారు చేస్తారు. తమిళనాడులో కొత్త బియ్యంతో పొంగలి చేస్తారు, అందుకే ఈ పండుగను అక్కడ 'పొంగల్' అని పిలుస్తారు. పంటను ప్రసాదించిన దేవుడికి ధన్యవాదాలు తెలుపుతూ... తాము తయారు చేసిన వాటిని నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ పండగ సందర్భంగా ప్రకృతిని, పశువులను కూడా పూజిస్తారు. మొదటి రోజున భోగీ, రెండో రోజు మకర సంక్రాంతి మూడో రోజు కనుమ... మొత్తంగా ఇది ప్రధానమైన పండుగ. పల్లెల్లో దీన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ధాన్య లక్ష్మికి స్వాగతం చెప్పడానికి ఇంటి గుమ్మాలను మామిడి కొమ్మలతో, పూల దండలతో, వాకిళ్ళను రంగవల్లులతో, వాటిలో ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలతో అలంకరిస్తారు. సంక్రాంతి జానపద కళా సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, రంగవల్లుల పోటీలు తదితరాలు ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి. మూడో రోజు కనుమ రైతులకు అత్యంత ప్రీతిపాత్రమైనది. వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉంటూ ధాన్య రాశులను ఇంటికి తీసుకురావడానికి సహాయం చేసిన పశువులకు కృతజ్ఞతతో పూజలు జరుపుతారు.

> సంపూర్ణమైన ఆధ్యాత్మిక ఉన్నతి సాధించాలంటే మనలో అంతర్గతంగా విప్లవం లేదా పరివర్తన రావాలి. అలాంటి పరివర్తనకు మనలో నిగూఢంగా ఉన్న మాతృశక్తి అయిన కుండలీని శక్తి మనకు చాలా సాయం చేస్తుంది. సహజయోగ ధ్యాన సాధన ద్వారా లభించే ఆ అంతర్గత పరివర్తనే సహజ సంక్రాంతి.

సమతుల్యత ప్రధానం

మానవ చరిత్రలో సంభవించిన అనేక విప్లవాల గురించి మనకు తెలుసు. రాజకీయపరమైనవీ, అసమానతల నిర్మాణం కోసం ఉద్దేశించినవి అయిన ఇలాంటి విప్లవాలతో ఎన్నో సమస్యలకు పరిష్కారాలు సాధ్యమయ్యాయి. కానీ మానవులు సంపూర్ణమైన ఆధ్యాత్మిక ఉన్నతి మాత్రం సాధ్యపడలేదు. అది జరగాలంటే మనలో అంతర్గతంగా విప్లవం లేదా పరివర్తన రావాలి. అలాంటి పరివర్తనకు మనలో నిగూఢంగా ఉన్న మాతృశక్తి అయిన కుండలీని శక్తి మనకు చాలా సాయం చేస్తుంది. సహజయోగ ధ్యాన సాధన ద్వారా లభించే ఆ అంతర్గత పరివర్తనే సహజ సంక్రాంతి. మన సూక్ష్మ శరీరంలో సూర్యుడి స్థానం మన నుదుటి భాగంలోని ఆజ్ఞాచక్రంలో ఉంటుంది. ముందుగా దాన్ని శుభ్రపరచుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే అది సూర్యుడి ద్వారా ప్రభావితం అవుతుంది. ఆజ్ఞాచక్రం సరిగ్గా లేకపోతే మనకు చాలా త్వరగా కోపం వస్తుంది. మనలో క్షమాగుణాన్ని పెంపొందించుకోవడం ద్వారా మాత్రమే ఆజ్ఞాచక్రాన్ని శుభ్రంగా ఉంచుకోగలం. అందుకే క్షమాగుణం అలవరచుకోవడం చాలా ముఖ్యం. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే... సూర్యచంద్రుల గమన ప్రభావం మనపై బాహ్యంగానే కాదు... అంతర్గత సూక్ష్మ శరీర వ్యవస్థ మీద కూడా ఉంటుంది. మనలో ఎడమవైపున 'ఇడానాడి' అంటే చంద్రనాడి, కుడివైపు 'పింగళానాడి' అంటే సూర్యనాడి ఉంటాయి. సూర్యనాడి క్రియాశక్తిని, చంద్రనాడి ఇచ్ఛాశక్తిని సూచిస్తాయి. మనం శక్తికి మించిన పని చేసినప్పుడు లేదా అతిగా ఆలోచిస్తున్నప్పుడు కుడి భాగం మీద భారం పడుతుంది. శరీరంలో ఉష్ణం ఎక్కువై అది బలహీనపడుతుంది. ఇక ఏ పనీ చేయాలనే కోరిక లేకుండా, ఎప్పుడూ సోమరితనంతో ఉండేవారిలో చంద్రనాడికి, అంటే ఎడమ పార్శ్వానికి సంబంధించి ససమస్యలు వస్తాయి. 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నట్టు ఏదీ అతిగా ఉండకూడదు. దీనివల్ల మనలో ఉండే సహజమైన సమతుల్యత విచ్ఛిన్నం అవుతుంది. కాబట్టి మనలోని సూర్యనాడిని, చంద్రనాడిని ప్రతి నిత్యం ధ్యానం ద్వారా సమతుల్య స్థితిలో ఉంచుకోవాలి. అది సహజయోగ ధ్యానం ద్వారా సాధ్యమవుతుంది.

డాక్టర్ పి. రాకేష్ 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



హరేకృష్ణ

అప్పుడు ఇల్లే వైకుంఠం

నేడు వైకుంఠ ఏకాదశి

వైకుంఠ ఏకాదశి మహాపర్వదినానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ రోజున సంభవించిన దైవ లీలలు ఎన్నో ఉన్నాయి. వాటిలో ఒకటి: విష్ణు సేవకులలో ఒకడైన పరమభక్తుడు ఈ భౌతిక ప్రపంచంలో తన ప్రయాణాన్ని ముగించి, విష్ణులోకానికి వెళ్ళిన సందర్భం. ఆ విశిష్ట భగవత్ సన్నిధానానికే 'వైకుంఠం' అని పేరు. 'విగత కుంఠ యస్మాద్ వైకుంఠ'... 'విగత' అంటే 'పోయినది' అనీ, 'కుంఠ' అంటే 'ఆందోళన', 'ఆత్రుత', 'ఆవేదన' అని అర్థం. ఏ ప్రదేశంలోనైతే ఆతృతకు, ఆందోళనకు, ఆవేదనలకు తావులేదో... ఆ ప్రదేశమే వైకుంఠం.

వైకుంఠాలు అనేకం. మనం నృసింహ భగవానుడి పట్ల ఆకర్షితులమైతే... ఆ నృసింహ వైకుంఠానికి చేరుకుంటాం. అలాగే కేశవ, మాధవ, గోవింద, మధుసూదన, శ్రీరామ తదితర రూపాల పట్ల ఆకర్షితులైనవారు సంబంధిత వైకుంఠాలను చేరుకుంటారు. సాక్షాత్తూ వైకుంఠనాథుడైన శ్రీమహావిష్ణువు స్వయంగా వైకుంఠద్వారం వద్దకు వచ్చి, తన ప్రియభక్తుణ్ణి స్వాగతించడమే వైకుంఠ ఏకాదశి విశిష్టత. భగవత్సందేశాన్ని లోకానికి బోధించే భక్తునికన్నా తనకు ప్రియమైనవారు మరొకరు లేరని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు వివరించాడు. ఈ శుభ తిథినాడు వైకుంఠ ద్వారంలోనికి ప్రవేశించి, ఉత్తర ద్వారం వద్ద ఆసీనుడైన భగవంతుణ్ణి దర్శనం చేసుకున్నవారు... మోక్షానికి అర్హత పొందుతారని, ప్రస్తుత దేహాన్ని త్యజించిన తరువాత వైకుంఠానికి చేరగలరని శాస్త్రోక్తి. మనమందరం ఈ భౌతిక ప్రపంచమనే అసహజమైన నివాసంలో చిక్కుకుపోయి ఇబ్బందులు పడుతున్నాం. ఆత్రుత, ఆవేదనల మధ్య కొనసాగే జీవన పోరాటంలో విసిగిపోతూ ఉంటాం. ఇలాంటివాటిని మనలో ఎవరూ కోరుకోం. ఎన్ని భోగభాగ్యాలు ఉన్నా... అంతరంగంలో ఏదో ఒక వెలితి ఉండనే ఉంటుంది. మన నిజ నివాస స్థానమైన ఆ భగవత్సన్నిధానంలో మనం లేకపోవడమే ఆ వెలితి. మరి ఎక్కడికి ఎలా చేరుకోగలం? మన అసలైన ఇంటికి తిరిగి వెళ్ళడం ఎలా? వైకుంఠనాథుడైన ఆ విష్ణుమూర్తిని లేదా నారాయణుణ్ణి లేదా శ్రీకృష్ణుణ్ణి దర్శించడం ఎలా? సామాన్య జనులకు ఈ మార్గ నిర్దేశం చేయడానికే విశుద్ధ భక్తులు ఈ లోకంలో అవతరిస్తూ ఉంటారు.

మన కర్తవ్యమేమిటి?

వైకుంఠం అనేది కేవలం 'ఒక భౌతికాతీతైన లోకం' మాత్రమే కాదు. ఎలాగైతే విష్ణు భగవానుడు విస్తరించి... ఒక ఆలయంలో మూర్తిగా వెలసి, మనకు దర్శనం ఇస్తాడో... అదే విధంగా వైకుంఠం కూడా విస్తరించగలదు. ఈ కలియుగంలో శ్రీకృష్ణుడి పవిత్రనామాలను ఎవరు జపిస్తారో... వారి ఇంట్లోకి వైకుంఠమే స్వయంగా ప్రవేశిస్తుంది. కాబట్టి కుటుంబ సభ్యులతో కలిసి భగవన్నామాలను జపిస్తూ... మన ఇంటినే వైకుంఠంగా తీర్చిదిద్దుకోవచ్చు. కాబట్టి 'హరే కృష్ణ హరే రామ' నామాలను జపించండి. మీ ఇంటిని వైకుంఠంగా మార్చుకోండి. తదుపరి జన్మలో దివ్య వైకుంఠ లోకానికి తిరిగి వెళ్ళండి. అదే ప్రతి జీవునికీ అంతిమ లక్ష్యం.



వైకుంఠ ఏకాదశిని ఎలా జరుపుకోవాలి?

. ఈ రోజు ఏకాదశి వ్రతాన్ని ఆచరించాలి. ధాన్యాలు, పప్పు దినుసులు భుజించకూడదు. పండ్లు, పాలు, సగ్గుబియ్యం లాంటివి తీసుకోవచ్చు

. విష్ణు ఆలయాన్ని సందర్శించాలి. విష్ణు నామాన్ని జపిస్తూ వైకుంఠ ద్వారంలోకి ప్రవేశించాలి. ఆలయంలో తీర్థ ప్రసాదాలు స్వీకరించాలి.

. హరేకృష్ణ మంత్రాన్ని జపించాలి, కనీసం నూట ఎనిమిది సార్లు పఠించడం ఉత్తమం.

. భగవద్గీత లేదా శ్రీమద్భాగవతాన్ని పఠించాలి.

. నిత్యాన్నదానానికి లేదా గోసేవకు దానధర్మాలు చేస్తే మంచిది.

శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్, హైదరాబాద్, 9396956984

భక్తులకు రంగుల తోవ!

నలుదిశలకూ నాలుగు రంగుల ప్రాంగణాలు

స్టేషన్లలోకి వచ్చే, వెళ్లే దారులు వేర్వేరుగా

ప్లాట్ ఫాంపైకి నేరుగా ఎవరూ వెళ్లలేరు

తొక్కిసలాట నివారణకు రైల్వే ఏర్పాట్లు

9 స్టేషన్లలో 1186 సీసీ కెమెరాలు

వాటిలో 116 ఏఐ ఆధారిత ముఖ గుర్తింపువి

(ప్రయాగ్ రాజ్ కుంభమేళా ప్రాంగణం నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక ప్రతినిధి)

ప్రయాగ్‌రాజ్‌లో తొక్కిసలాటలను నివారించడానికి పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు రంగులతో దారి చూపిస్తామంటున్నారు నార్తర్న్ సెంట్రల్ సీపీఆర్వో శశికాంత్ త్రిపాఠి. క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్లు తీసుకోవడానికి ఏర్పాట్లు చేయడమే కాకుండా ఏఐ ఆధారిత ముఖ గుర్తింపు కెమెరాల ద్వారా తప్పిపోయిన వాళ్లనూ గుర్తిస్తామంటున్నారు. ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి మాటామంతీ..



కమాండ్ కంట్రోల్ రూమ్



సీపీఆర్వో శశికాంత్ త్రిపాఠి

ప్రయాగ్ రాజ్‌కు లక్షల మంది వస్తారు. రైల్వే స్టేషన్లలో తొక్కిసలాట వంటి ఘటనలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

సాధారణంగా తొక్కిసలాట వంటి ఘటనలు వెళ్లే వాళ్లు, వచ్చే వాళ్లు ఒకే మార్గంలో ఉన్నప్పుడు ఎక్కువగా జరుగుతుంటాయి. అందుకే, రైల్వే స్టేషన్లలో లోపలికి వచ్చే, బయటకు వెళ్లే దారులను వేర్వేరు చేసేశాం. వచ్చే వాళ్లు సిటీ లైన్ దిశగా వస్తే.. వెళ్లే వాళ్లను సివిల్ లైన్ దిశగా మళ్లిస్తున్నాం. అలాగే, ప్లాట్ ఫాంపైకి నేరుగా ఎవరూ వెళ్లలేరు. అందరూ ఒకేసారి రాకుండా నియంత్రించడానికి నాలుగు ప్రత్యేక ప్రాంగణాలను ఏర్పాటు చేశాం. తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిశల్లో వెళ్లే వారిని ఆయా ప్రాంగణాల్లో ఉంచి.. అక్కడి నుంచి ప్లాట్ ఫాంలపైకి పంపిస్తాం?

భక్తుల్లో ఎవరు.. ఎక్కడి నుంచి వచ్చారు? అన్నది ఎలా గుర్తిస్తారు!?

ఇందుకు నాలుగు దిశలకు నాలుగు రంగుల (పసుపు, నీలం, ఎరుపు, ఆకుపచ్చ) ప్రాంగణాలు ఏర్పాటు చేశాం. లఖ్‌నవూ, బనారస్ దిశగా వెళ్లాలంటే ఎరుపు రంగు ప్రాంగణంలోకి వెళ్లాలి. ఉదాహరణకు.. హైదరాబాద్‌కు ఎవరైనా వెళ్లాలనుకోండి. వారిని పసుపు రంగు ప్రాంగణంలోకి పంపిస్తాం. ఇక్కడ మంచినీళ్ల, మరుగుదొడ్ల నుంచి చార్జింగ్ స్టేషన్లు కూడా ఏర్పాటు చేశాం. ఒక్కో ప్రాంగణంలో ప్రత్యేకంగా దాదాపు 20 టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. అక్కడ టికెట్ తీసుకున్న తర్వాత ప్రాంగణంలోనే వేచి ఉంటారు. వారి రైలు వచ్చినప్పుడు మాత్రమే అక్కడి వలంటీర్లు వారిని ప్రత్యేక మార్గంలో ప్లాట్‌ఫాంపైకి పంపిస్తారు.

ఒక్కో ప్రాంగణంలో ఎంతమంది పడతారు?

ఇక్కడ ఒకేసారి 5000 మంది ఉండడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. అంటే, నాలుగు ప్రాంగణాల్లో కలిపి ఒకేసారి 20 వేల మంది వచ్చినా ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. దాదాపు పది వేల మంది సిబ్బంది ఈ మొత్తం వ్యవహారాలు పర్యవేక్షించనున్నారు. 200 మంది వరకూ వలంటీర్లు ఉంటారు. వారికి ఇప్పటికే వివిధ భాషల్లో శిక్షణ ఇచ్చాం. ఇదంతా అన్ రిజర్వ్‌డ్ ప్రయాణికుల కోసమే. రిజర్వ్‌డ్ ప్రయాణికుల కోసం ప్రత్యేక ప్రాంగణం, ప్రత్యేక మార్గం ఉన్నాయి.

మేళాలో ఎవరైనా తప్పిపోవడం లేదా అసాంఘిక శక్తులు చొరబడటం వంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి ఏం చేయబోతున్నారు?

ప్రయాగ్‌రాజ్‌లో మొత్తం తొమ్మిది రైల్వే స్టేషన్లు ఉన్నాయి. వీటిలో 1186 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. ఒక్క ప్రయాగ్‌రాజ్ ప్రధాన స్టేషన్లోనే 384 కెమెరాలు ఉన్నాయి. వీటిలో 116 ఏఐ ఆధారిత ముఖాన్ని గుర్తించే సీసీ కెమెరాలు. ఎవరైనా తప్పిపోయారనుకోండి. వారి ఫొటో మాకు ఇస్తే.. ఏఐ కెమెరాల పరిధిలో వాళ్లు ఉంటే వెంటనే మాకు తెలిసిపోతుంది. ఏ కెమెరా పరిధిలో ఉన్నారో తెలుసుకుని వారిని గుర్తిస్తాం. అలాగే, కొంతమంది అసాంఘిక శక్తుల డేటాను ఇప్పటికే నమోదు చేశాం. ఒక వేళ వాళ్లు ఎవరైనా ఈ కెమెరాల పరిధిలోకి వస్తే వెంటనే మాకు తెలిసిపోతుంది.

రైళ్ల ద్వారా ఎంతమంది వస్తారని భావిస్తున్నారు? ఎన్ని రైళ్లను అందుబాటులో ఉంచుతున్నారు?

కుంభ మేళాకు దాదాపు 40 కోట్ల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. వారిలో కోటి మంది వరకూ రైళ్ల ద్వారానే వస్తారని భావిస్తున్నాం. ఇందుకు కుంభమేళా జరిగే 45 రోజులపాటు 13 వేల రైళ్లను ఏర్పాటు చేస్తున్నాం. వీటిలో 3000 వరకూ ప్రత్యేక రైళ్లే. అలాగే, దాదాపు పది వేల వరకూ పాసింజర్ రైళ్లు. కుంభమేళా మొత్తంలో మౌనీ అమావాస్యను అత్యంత పవిత్రమైన రోజుగా భావిస్తారు. ఆరోజు పెద్ద సంఖ్యలో వస్తారు. ఆ ఒక్కరోజే 350 రైళ్లను ఏర్పాటు చేశాం.

ఇక్కడి రైల్వే స్టేషన్లు ఒకేరోజు 350 రైళ్లు వస్తే తట్టుకోగలవా!?

సాధారణ రోజుల్లోనే ఇక్కడి మొత్తం 9 స్టేషన్లకు సరాసరిన 200 రైళ్ల వస్తూ పోతూ ఉంటాయి. ఇప్పుడు మరో 150 అదనంగా వస్తాయి. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నాం. వచ్చే, వెళ్లే దారులను వేర్వేరు చేసేశాం. రెండూ కలవకుండా మూసేస్తున్నాం. ఒకవేళ వెళ్లే వాళ్లు ఎవరైనా ప్రవేశ ద్వారం వైపు వస్తే చుట్టుతిరిగి మళ్లీ వెళ్లాల్సిందే. అలాగే, తమిళం, తెలుగు, కన్నడ సహా మొత్తం 12 భాషల్లో అనౌన్స్‌మెంట్లు ఇవ్వనున్నాం. ఒక బుక్‌లెట్‌లో కుంభమేళా రైళ్లకు సంబంధించిన పూర్తి సమాచారం ఉంటుంది. అలాగే, కుంభ్ రైల్ సేవా 2025 అనే యాప్ తెస్తున్నాం. దాని ద్వారా టికెట్లు తీసుకోవడంతోపాటు పూర్తి వివరాలూ తెలుసుకోవచ్చు. క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్ తీసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం.



ముత్యాల ముగ్గు



21 చుక్కలు, సరిచుక్క 1 వచ్చేవరకు

మొగలపు అనూష
ఖమ్మం

మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
ఈ-మెయిల్:
features@andhrajyothy.com

వేళకాని వేళలో సినిమా ప్రదర్శనా?

(మొదటిపేజీ తరువాయి)

వందల మంది వాహనాలను తీసుకుని వెళ్లడం, వందల వాహనాలను పార్కింగ్ చేయడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించింది. ప్రస్తుత పిటిషన్‌లకు ప్రజాప్రయోజన వ్యాజ్య స్వభావం ఉందని, అదనపు షోలు, బెనిఫిట్ షోలు, రేట్లపెంపుపై ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడింది. బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వబోమని పేర్కొంటూనే గేమ్ ఛేంజర్ సినిమాకు అదనపు షోల ప్రదర్శనకు, టికెట్ల రేట్ల పెంపునకు అనుమతిస్తూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి మెమో జారీచేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్‌లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్‌లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్‌ల తరఫు న్యాయవాదులు మామిండ్ల మహేశ్, విజయ్‌గోపాల్ తదితరులు వాదిస్తూ తెలంగాణ సినిమా రెగ్యులేషన్ రూల్స్ జీవో 120కి విరుద్ధంగా తెల్లవారుజామున 4 గంటల షోకు అనుమతించడం, లైసెన్సింగ్ అథారిటీలు కాకుండా హోంశాఖ ముఖ్యకార్యదర్శి మెమో జారీచేయడం, టికెట్ల రేట్ల పెంపునకు అంగీకరించడం సరికాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పుష్ప-2 సినిమా ప్రదర్శన సంఘటనలను ప్రస్తావించారు. షోల ప్రదర్శన మధ్య వ్యవధి లేకపోవడం వల్ల భారీగా వచ్చే జనాలను అదుపు చేయడం కష్టంగా మారుతుందని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిల్లల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ పలు ప్రశ్నలు వేసింది. తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా పడింది.

7న ఎమ్మార్పీఎస్ 'దండోరా'

» ఎస్సీ వర్గీకరణ అమలే లక్ష్యం : మందకృష్ణ మాదిగ



తార్నాక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తక్షణమే అమలు చేయాలనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ ఫిబ్రవరి 7న వెయ్యి గొంతులు లక్ష డప్పులతో దండోరా సాంస్కృతిక మహా ప్రదర్శన చేపట్టనుంది. హైదరాబాద్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. ఈ సాంస్కృతిక మహా ప్రదర్శనకు మద్దతుగా ఓయూలో విద్యార్థి సంఘాల నాయకులతో గురువారం ఓ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని అన్నారు. ఇప్పటికీ కొందరు మాలలు వర్గీకరణకు అడ్డుపడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అంతిమ పోరాటంగా మాదిగల అస్తిత్వమైన డప్పుతో ఫిబ్రవరి 7న మాదిగల గుండె చప్పుడు వినిపిస్తామని చెప్పారు. ఈ దండోరా సాంస్కృతిక మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సిర్పూర్(యూ) @ 5.2

» తెలంగాణపై కొనసాగుతున్న చలి పంజా

ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణపై చలి పంజా విసురుతోంది. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వీస్తున్న శీతల గాలులతో చలి తీవ్రత పెరిగి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రాత్రీ పగలూ అన్న తేడా లేకుండా చలి తీవ్రత కనిపిస్తోంది. గురువారం కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్(యు) మండలంలో రాష్ట్రంలోనే 5.2డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. తిర్యాణి మండలం గిన్నెధరిలో 5.8 డిగ్రీలు, తిర్యాణిలో 7.2 డిగ్రీలు, కెరమెరిలో 7.5 డిగ్రీలు, వాంకిడిలో 7.8డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలోని బేలలో 5.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మావలలో 6.9 డిగ్రీలు, తాంసిలో 7.7 డిగ్రీలు, తలమడుగులో 7.9 డిగ్రీలు, గాదిగూడలో 8.0 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు అయ్యాయి

మోహన్‌బాబుకు ఉపశమనం

» జర్నలిస్టుపై దాడి కేసులో

కఠిన చర్యలు తీసుకోవద్దన్న సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుపై దాడి కేసులో సినీ నటుడు మంచు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఉపశమనం లభించింది. ఈ కేసులో తదుపరి విచారణ జరిగే వరకు మోహన్ బాబుపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసు శాఖను సుప్రీం కోర్టు ఆదేశించింది. ఇందుకు సంబంధించి మధ్యంతర ఉపశమనం కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోసం మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు డిసెంబరు 23న కొట్టేసింది. దీంతో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జస్టిస్ సుధాంశు దులియా, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆ పిటిషన్‌ను గురువారం విచారించింది. మోహన్‌బాబు తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. ఘటన జరిగిన పరిస్థితులను వివరించారు. క్షణికావేశంలో మోహన్‌బాబు మైక్ విసిరారని తెలిపారు. బాధిత జర్నలిస్టును మోహన్‌బాబు ఇప్పటికే స్వయంగా పరామర్శించారని కూడా తెలియజేశారు. ఇందుకు, జర్నలిస్టు తరఫు న్యాయవాది స్పందిస్తూ.. మోహన్‌బాబు చేసిన దాడి వల్ల బాధిత జర్నలిస్టు ముఖానికి శస్త్రచికిత్స జరిగిందని, ఐదు రోజులు ఆస్పత్రిలోనే గడిపారని తెలిపారు. ఫిర్యాదును వెనక్కు తీసుకోవాలని బెదిరించేందుకే మోహన్‌బాబు ఆస్పత్రికి వచ్చారని తెలిపారు. అనంతరం.. రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. మోహన్‌బాబు జర్నలిస్టును బెదిరించలేదని అన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం పరిహారం కావాలా? వద్దా? చూడాలని జర్నలిస్టు తరఫు న్యాయవాదిని కోరింది. జర్నలిస్టు న్యాయవాదితో మాట్లాడి, ఆయనకు ఏమి కావాలో చేస్తామని ముకుల్ రోహత్గీ కోర్టుకు తెలిపారు. అనంతరం మోహన్‌బాబుకు మధ్యంతర ఉపశమనం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసిన కోర్టు తదుపరి విచారణను ఫిబ్రవరి 13కు వాయిదా వేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన తెలంగాణ ప్రభుత్వం, జర్నలిస్టుకు నోటీసులు జారీ చేసింది.

'మీ టికెట్' యాప్

» ప్రయాణం.. పర్యాటకం.. దర్శనం..

» ఒకచోటే టికెట్ బుకింగ్. . టీజీఈఎస్డీ రూపకల్పన

హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రయాణం, పర్యాటకం, దేవుడి దర్శనం.. వంటి ఏ టికెట్ అయినా ఇకపై సులభంగా పొందవచ్చు. అందుకోసం తెలంగాణ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ సర్వీసెస్ డెలివరీ(టీజీఈఎస్డీ) 'మీ టికెట్ అనే యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు గురువారం సచివాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెక్నాలజీ సాయంతో పౌర సేవలను ప్రజల ముంగిటకు చేరవేస్తున్నామని చెప్పారు. అన్ని రకాల టికెట్ బుకింగ్స్‌ను ఒకే వేదిక(ప్లాట్ ఫాం)పైకి తెచ్చేందుకు వీలుగా మీ టికెట్ యాప్‌ను రూపొందించామని తెలిపారు. ఇందులో తెలంగాణలోని 15 ప్రముఖ దేవాలయాలు, 129 పార్కులు, 54 బోటింగ్ ప్రదేశాలు, ఆర్టీసీ, మెట్రో, జీహెచ్ఎంసీ పరిధిలోని కమ్యూనిటీ హాళ్లు, జిమ్‌లు, స్పోర్ట్ కాంప్లెక్స్‌లు బుక్ చేసుకోవచ్చని శ్రీధర్ బాబు చెప్పారు. ఈ యాప్‌లో యూపీఐ ద్వారా చెల్లింపులు చేయొచ్చన్నారు. రాబోయే రోజుల్లో ఈ తరహా యాప్‌లు మరిన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

సవాలు విసిరిన పాత్ర

- ప్రగ్యా జైస్వాల్



'నటనకు ఆస్కారమున్న మంచి పాత్ర కావేరి. నేను ఇప్పటివరకు పోషించిన పాత్రలకు భిన్నంగా ఉంటుంది. ఈ పాత్ర నాకు నటిగా సవాలు విసిరింది' అని 'డాకు మహారాజ్'లో తన పాత్ర గురించి వివరించారు ప్రగ్యా జైస్వాల్. నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి తెరకెక్కించిన చిత్రమిది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ఈనెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రగ్యా జైస్వాల్ మీడియాతో ముచ్చటిస్తూ 'బాలకృష్ణగారితో వరుసగా సినిమాలు చేసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా. బాలకృష్ణగారికి సినీ పరిశ్రమలో ఎంతో అనుభవం ఉన్నప్పటికీ, ఇంకా కొత్తగా నేర్చుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉంటారు. బాబీ కొల్లి అద్భుతమైన దర్శకుడు. నా పుట్టిన రోజైన జనవరి 12న ఈ చిత్రం విడుదల అవుతుండటం నా అదృష్టం' అని అన్నారు.

'సంక్రాంతికి వస్తున్నాం' టికెట్ ధరల పెంపు

వెంకటేష్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా టికెట్ల ధరలు పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నెల 14న విడుదల కాబోతున్న ఈ సినిమా మొదటి రోజు ఆరు షోలకు, 15వ తేదీ నుంచి ఐదు ప్రదర్శనలకు అనుమతి లభించింది. మల్టీప్లెక్స్‌లలో అదనంగా రూ.125, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.100 పెంచుకోవచ్చని రాష్ట్ర హోంశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

మనసుల్ని హత్తుకునే సినిమా



దర్శకుడు సుకుమార్ తనయ సుకృతి వేణి నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకురాలు. సుకుమార్ సతీమణి సబితా సమర్పణలో నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, శేష సింధూరావు నిర్మించారు. ఈ నెల 24న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను మహేశ్‌బాబు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ "ఇది అందరి మనసుల్ని హత్తుకునే సినిమాలా ఉంది. చిత్రబృందానికి నా అభినందనలు" అని చెప్పారు.

ప్రతీ పాటకు ఆ పద్ధతి సరికాదు



'సలార్', 'రాధేశ్యామ్', 'సీతా రామం' వంటి సూపర్ హిట్ సినిమాల్లో రాసిన పాటలతో గుర్తింపు తెచ్చుకున్న గీత రచయిత కెకె(కృష్ణకాంత్). ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న 'రాజా సాబ్', 'ఫౌజీ' చిత్రాలకు పాటలు రాస్తున్న కెకె.. గురువారం మీడియాతో ముచ్చటించారు. "డైరెక్ట్‌గా పాటలు రాయడం కంటే డబ్బింగ్ సినిమాలకు పాటలు రాయడం సవాలుతో కూడుకున్నది. సినిమాకు ఓ పాట లేదా రెండు పాటలు రాయడం కంటే సింగిల్ కార్డ్ రాయడం మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. ఇప్పుడు ప్రతీ మ్యూజిక్ డైరెక్టర్ హుక్ లైన్స్ కోరుతున్నాడు. ఆ ఒత్తిడి గీత రచయితలందరిపై ఉంటోంది. అయితే, ఈ హుక్ లైన్ ట్రెండ్ అన్ని పాటలకు సరికాదు" అని చెప్పారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో వేధింపులు....



ఇన్‌స్టాగ్రామ్‌లో గుర్తు తెలియని వ్యక్తి చంపేస్తానంటూ వేధింపులకు గురిచేస్తున్నాడంటూ నటి నిధి అగర్వాల్ హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అసభ్య సందేశాలు పంపడమే కాకుండా, తనని, కుటుంబ సభ్యులను చంపుతానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.. తరచు ఇన్‌స్టాగ్రామ్‌లో వస్తున్న వేధింపులతో మానసిక వేదనకు గురవుతున్నానని, నిందితుడిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

చిత్రజ్యోతి

SINCE 1965

సినిమాకు కథే ప్రాణం



'మంచి కథే సినిమాకు ప్రాణం. మొదట్నుంచి ఆ కథను నమ్ముకునే సినిమాలు తీశాను.. 'తల్లి మనసు' చిత్రం కూడా ఇంటిల్లిపాది చూసే విధంగా చక్కగా రూపుదిద్దుకుంది' అని సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య అన్నారు. రచిత మహాలక్ష్మీ, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రధారులుగా వి.శ్రీనివాస్ (సిప్పి) దర్శకత్వంలో ముత్యాల సుబ్బయ్య తనయుడు ముత్యాల కిశోర్ నిర్మించిన చిత్రం 'తల్లి మనసు'. ఈనెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ముత్యాల సుబ్బయ్య పాత్రికేయులతో మాట్లాడుతూ 'దర్శకుడిగా 50 సినిమాలు తీశాను. మంచి కథలను ఎంచుకోవడమే కాదు, వాటికి తగ్గ మంచి టైటిల్స్ పెట్టి, ప్రేక్షకుల ఆదరణతో నా సినీ ప్రయాణం సాగింది. నా దగ్గర, చిత్ర పరిశ్రమలో దర్శకత్వ శాఖలో సుదీర్ఘ అనుభవం ఉన్న వి.శ్రీనివాస్‌ని ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం చేస్తున్నాం. ప్రేక్షకుల మనసులను హత్తుకునేలా ఉంటుందీ చిత్రం. ఫీల్ గుడ్ మూవీ అని సెన్సార్ సభ్యులు కూడా ప్రశంసించారు. తల్లి లేకుండా ప్రపంచమే లేదు. అలాంటి తల్లి భావోద్వేగం, తపనను ఈ చిత్రంలో చక్కగా ఆవిష్కరించాం. కథకు తగ్గట్టు మూడు పాటలు ఉంటాయి' అని తెలిపారు.

ఆనందమాయే



హాస్యనటుడు బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బ్రహ్మ ఆనందం'. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ హీరోయిన్స్‌గా నటించారు. ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా నిర్మిస్తున్నారు. గురువారం చిత్ర బృందం 'ఆనందమాయే' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. శాండిల్య పీసపాటి సంగీత సారథ్యంలో మనీషా, యశ్వంత్‌నాగ్ ఆలపించారు. సాయికిరణ్ సాహిత్యం అందించారు.

చంద్రబాబు ముందే మాటకు మాట

చైర్మన్ వర్సెస్ ఈవో: వాగ్యుద్ధం...

చైర్మన్: నేను చైర్మన్‌గా వచ్చినప్పటి నుంచి నన్ను చిన్నచూపు చూస్తున్నారు. నాకేమీ చెప్పడం లేదు.

ఈఓ: నీకేం చెప్పడం లేదు? చెబుతూనే ఉన్నాం కదా! (తీవ్ర స్వరంతో)

చైర్మన్: ఏం చెప్పావ్? రేపు వైకుంఠ ఏకాదశి. ఈ రోజు నుంచే హడావుడి ఉంది. మీరు ఏం చేస్తున్నారో ఆ విషయాలు ఏమైనా చెప్పావా? నేను చైర్మన్‌గా ఉండి ఇక్కడ ఏం చేస్తున్నట్లు? (తీవ్ర ఆగ్రహంతో)

ఈఓ: నువ్వు మాకు అన్నీ చెప్పే చేస్తున్నావా? మాకు చెప్పే ప్రకటిస్తున్నారా? శ్రీవాణి ట్రస్టు విషయంలో నువ్వేం చేశావు? నాతో మాట్లాడకుండానే ప్రెస్‌మీట్ పెట్టి నీకు నచ్చింది చెప్పేశావు. దాని వల్ల మాకు ఎంత ఇబ్బంది అవుతుందో నీకేమైనా తెలుసా?

(మొదటి పేజీ తరువాయి)

అక్కడున్న విషయాన్ని కూడా మరిచిపోయి రచ్చ చేశారు. పాలకమండలిలోనూ, పరస్పరం మాట్లాడుకోవాల్సిన అంశాలనూ అసందర్భంగా ప్రస్తావనకు తెచ్చారు. వారిద్దరి వాదనలతో సమావేశ మందిరం కొన్ని నిమిషాలపాటు దద్దరిల్లిపోయింది. అక్కడే ఉన్న మంత్రులు, సీఎం విస్మయానికి గురయ్యారు. ఇంతలో మంత్రి అనగాని సత్యప్రసాద్ జోక్యం చేసుకుని... ఈవోను మందలించారు. "ఏం మాట్లాడుతున్నారు? ఎవరి ముందు ఏం మాట్లాడుతున్నారు? ముఖ్యమంత్రి మన అందరికీ బాస్. ఆయన ముందు ఎలా మట్లాడాలో తెలియదా? శ్రీవాణి ట్రస్టులో అంశాలు ఏమైనా ఉంటే నోట్ రూపంలో ఇవ్వండి. ఇక్కడెందుకు ప్రస్తావిస్తున్నారు!" అని అభ్యంతరం తెలిపారు.


చంద్రబాబు, బీఆర్ నాయుడు, శ్యామలరావు

ఇద్దరూ ఆపండి...

అనగాని మాట్లాడుతుండగానే ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకున్నారు. 'సత్యప్రసాద్ నువ్వు ఆగు' అంటూ... అటు ఈవో, ఇటు చైర్మన్ ఇద్దరిపైనా విరుచుకుపడ్డారు. "ఏం మాట్లాడుతున్నారు మీరు? ఇదేనా పద్ధతి? మీ పరిధి దాటి మాట్లాడుకుంటున్నారు. మీ ఫ్రస్టేషన్ ఎవరిపైన చూపిస్తున్నారు? దేనికైనా ఒక పద్ధతి ఉంటుంది. అది కూడా దాటి మాట్లాడుతున్నారు. అసలు ఇక్కడ జరిగిందేమిటి? మీరు మాట్లాడుతున్నదేమిటి? ఒకచోట పనిచేస్తున్నప్పుడు ఓపిక, సమన్వయం ఉండాలి. అది మీకు ఎందుకు సాధ్యపడటం లేదు? నేనూ, చీఫ్ సెక్రటరీ సమన్వయంతో పనిచేసుకోవడం లేదా? మేం కోఆర్డినేషన్‌లో లేమా? ఒకరితో మరొకరం మాట్లాడుకోవడం లేదా? ఇద్దరం కలిసి పనిచేస్తేనే కదా రాష్ట్రం అభివృద్ధి చెందేది. ఇలా కొట్టుకుంటే ఎలా? ఇదేం భాష? ఇదేం వ్యవహారం. ఇది పద్ధతిగా లేదు. వెంటనే ఆపండి" అని తీవ్రస్వరంతో హెచ్చరించారు. ఇదే సమావేశంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి వ్యవహారశైలి కూడా ప్రస్తావనకు వచ్చింది. "వాటన్నింటిపై తర్వాత మాట్లాడుదాం. ఇది సందర్భం కాదు. సమయం వచ్చినప్పుడు అన్నీ పరిశీలిస్తాం. కానీ మీ పద్ధతి మార్చుకోవాలి. సమన్వయంతో పని చేయాల్సిందే" అని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది.

సీఎంతో చైర్మన్ విడిగా భేటీ

తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సీఎం చంద్రబాబుతో గురువారం టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు ముప్పావుగంట భేటీ అయ్యారు. టీటీడీ పరిపాలనా భవనంలో సమీక్షకు ముందు... చంద్రబాబు వ్యానిటీ బస్సులో సుమారు గంటపాటు ఉన్నారు. అదే సమయంలో బీఆర్ నాయుడు సీఎంతో భేటీ అయ్యారు. టీటీడీ ఉన్నతాధికారుల వ్యవహార శైలి, బోర్డు తీరు, దర్శన కోటాలకు సంబంధించిన పలు అంశాలను ఆయన వివరించినట్లు తెలిసింది. అప్పటికే తాను సేకరించిన సమాచారం, చైర్మన్ చెప్పిన వివరాలు విన్న అనంతరం... టీటీడీలో పాలకవర్గానికి, అధికార యంత్రాంగానికి నడుమ సమన్వయం, సయోధ్య లేవని సీఎం నిర్ధారణకు వచ్చారు. మీడియా సమావేశంలో ఒకింత సూటిగానే ఈ విషయం చెప్పారు. "చైర్మన్, ఈవో, జేఈవో కలసికట్టుగా పనిచేయాలని ఆదేశించాను. ఈగోలతో వ్యవహరించకూడదు. ఈగోతో గానీ, అసమర్థతతో గానీ, అనాలోచితంగా గానీ దేవుడి పవిత్రతను దెబ్బతీసేలా వ్యవహరించడం తప్పు" అని చెప్పారు.

ఎవరికి వారే!

- చైర్మన్, ఈవో, అదనపు ఈవో మధ్య సమన్వయ లోపం.. విభేదాలు
- ప్రభుత్వానికి ఇది వరకే సమాచారం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

టీటీడీ... ఒక పెద్ద వ్యవస్థ! వేలాది మంది భక్తులు ఏడుకొండల వాడిపై పెట్టుకున్న విశ్వాసాన్ని కాపాడటం టీటీడీ బాధ్యత! ఇందులో టీటీడీ ఈవో, చైర్మన్, కొండమీద ఉండే అదనపు ఈవోలదే కీలక పాత్ర. అయితే... ఈ ముగ్గురి మధ్య సమన్వయం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తాజా ఘటనలతో అది నిజమే అని కూడా స్పష్టమవుతోంది. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై టీటీడీ రికార్డు స్థాయిలో 15 సమావేశాలు ఏర్పాటు చేయగా... అందులో ఈవో, చైర్మన్ కలిసి పాల్గొన్నది ఒకే ఒక్క భేటీలో అని తెలిసింది. ఈవో శ్యామలరావు, చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఎవరికి వారు 'సొంత నిర్ణయాత్మక శక్తి'గా ఎదగాలనుకునే క్రమంలో సమన్వయం కొరవడుతోందని, ఇతర పాలనాపరమైన సమస్యలు వస్తున్నాయని ప్రభుత్వానికి ఇప్పటికే సమాచారం అందినట్లు తెలిసింది. ఇటీవల టీటీడీ చైర్మన్ నాయుడు అమరావతికి వచ్చి ముఖ్యమంత్రిని కలిసి ఈవోపై ఫిర్యాదుల పరంపర కొనసాగించారు. ఈ సమస్యకు తెరదించాలనే ఉద్దేశంతో... చంద్రబాబు ఈవో శ్యామల రావును పిలిపించి, సమన్వయంతో పనిచేయాలని హితవు పలికారు. అంతటితో ఇద్దరి మధ్య వివాదం ముగిసిందనుకున్నారు. కానీ... గురువారం సీఎం సమక్షంలోనే వారిద్దరూ తీవ్రస్థాయిలో మాటల ఘర్షణకు దిగడం కలకలం రేపింది. దీంతో టీటీడీ వ్యవహారాలను సమగ్రంగా పరిశీలించాలని సీఎం భావిస్తున్నట్లు తెలిసింది.

ఆరోగ్యశ్రీ, ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయండి

- సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి బండి సంజయ్ లేఖ



హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు తక్షణం విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. విద్య, వైద్యం విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో ఉందని, ఇది ఏమాత్రం సమంజసం కాదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మంది పేద ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరం అంటూ రేవంత్‌కు గురువారం బండి లేఖ రాశారు. 'ఆరోగ్యశ్రీ' పథకం అమలులో సీఎం అనుసరిస్తున్న తీరు 'నోటితో పొగిడి.. నొసటితో వెక్కిరించినట్లుగా' ఉందని, ఒకవైపు 'ఆరోగ్యశ్రీ' పరిమితిని రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు, ఆరోగ్య సేవలను విస్తరిస్తున్నట్లు ప్రకటించి, ఆచరణలో మాత్రం అసలు బిల్లులే చెల్లించకుండా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులను ఇబ్బంది పెడుతున్నారని లేఖలో విమర్శించారు.


ఇది పద్మావతి పార్కు ప్రధాన గేటు! దీని నుంచి బయటికి రాగానే టోకెన్ల క్యూలలోకి ప్రవేశించవచ్చు. అస్వస్థతకు గురైన మహిళను బయటికి పంపేందుకు పోలీసులు దీనిని కొద్దిగా తెరవగానే.. తొక్కిసలాటకు కారణమైంది.


పద్మావతి పార్కుకు మరోవైపున ఉన్న రెండు గేట్లలో ఇదొకటి ! అస్వస్థతకు గురైన మహిళను వీటిద్వారా బయటకు పంపి ఉంటే, పెను విషాదం తప్పేది

ప్రాథమిక విచారణలో గుర్తించిన లోపాలు ఇవే

- టోకెన్ల కోసం వచ్చే భక్తులను వారి సంఖ్యను బట్టి వివిధ కేంద్రాలకు మళ్లించక పోవడం.
- పద్మావతి పార్కు మెయిన్ గేటును అనాలోచితంగా, పరిణామాలను ఊహించకుండా తెరవడం.
- పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులను పార్కులోకి కూర్చోబెట్టడం.
- టోకెన్ల జారీపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం.

పోలీసులు వెటకారమాడారు

బైరాగిపట్టెడ పద్మావతి పార్కులో ఎటు చూసినా జనం. ఒక్క పోలీసూ లేడు. లైట్లు లేకపోవడంతో చీకటిగా ఉంది. ఇంతలో ఒక పెద్ద కప్ప జనాల్లోకి వచ్చింది. జనం మీదకు దూకుతుంటే పాము వచ్చిందనుకుని 'గోవిందా.. గోవిందా' అంటూ ఒకరిపై ఒకరు పడ్డారు. ఇంత జరిగినా పోలీసులు రాలేదు. వాళ్ల మనుషులను తీసుకొచ్చే క్రమంలో క్యూ లైన్లో తొక్కిసలాట జరిగింది. చచ్చిపోయేందుకు వస్తారా? అని పోలీసులు భక్తులను వెటకారంగా అన్నారు. పోలీసులు కంట్రోల్ చేసుంటే ఇంత ఘోరం జరిగేది కాదు.

- దేవి, హైదరాబాద్

పెను విషాదానికి 'తెరిచిన గేటు'

బైరాగిపట్టెడలో ఏం జరిగిందంటే... టోకెన్ల కోసం వచ్చిన భక్తులంతా పార్కులోకి!

- అస్వస్థతకు గురైన మహిళను తరలించేందుకు ప్రధాన గేటు తెరిచిన పోలీసులు
- టోకెన్లు ఇస్తున్నారంటూ ఒక్కసారిగా భక్తుల పరుగులు
- ఉవ్వెత్తున మీద పడటంతో నిస్సహాయంగా పోలీసులు
- అక్కడ ఉన్న రెండు చిన్న గేట్లు తెరిస్తే ప్రమాదం తప్పేది

(తిరుపతి రూరల్/ఎంఆర్‌పల్లె - ఆంధ్రజ్యోతి)

ఒక భక్తురాలికి అస్వస్థత... పోలీసుల అనాలోచిత చర్య... భక్త సమూహంలోని కొందరి అత్యుత్సాహం, ఆతృత! ఈ మూడూ కలిశాయి! టీటీడీ చరిత్రలోనే మాయని మచ్చలాగా మిగిలే పెను విషాదానికి దారి తీశాయి. వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీకోసం తిరుపతి బైరాగిపట్టెడలోని రామానాయుడు మునిసిపల్ స్కూలు ఈ ఘోరానికి వేదికగా మారింది. ప్రత్యక్ష సాక్షులు, స్థానికులు, అధికార వర్గాల కథనం ప్రకారం... బుధవారం రాత్రి ఏం జరిగిందంటే...

వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లు జారీ చేసేందుకు బైరాగిపట్టెడలోని రామానాయుడు మునిసిపల్ స్కూల్ కేంద్రానికి బుధవారం ఉదయం 9గంటల నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకోవడం మొదలైంది. మధ్యాహ్నం 2గంటల సమయానికి ఆ ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడింది. వాహనాల రాకపోకలకు అంతరాయంగా మారింది. దీంతో పోలీసులు పక్కనే ఉన్న పద్మావతి పార్క్ గేట్లు తెరిచి భక్తులను అందులోకి అనుమతించారు. సరిగ్గా పార్క్ గేటు ముందు నుంచే క్యూలైన్ మొదలవుతుంది. దీంతో... పార్క్‌లో ఉన్నవారికే తొలుత టోకెన్లు అందుతాయని భావించిన భక్తులు ఒకరినొకరు తోసుకుంటూ పార్క్‌లోకి చేరుకున్నారు. ఆ తర్వాత పార్క్ గేట్లను పోలీసులు మూసేశారు. దీంతో కొత్తగా వచ్చిన వారు గేట్లు ఎక్కిదూకి మరీ పార్కు లోపలికి వెళ్లడం మొదలుపెట్టారు. గురువారం తెల్లవారు జామున 5 గంటల నుంచీ టోకెన్ల జారీ ఉంటుందని తొలుత టీటీడీ ప్రకటించింది. అయితే... బుధవారం అర్ధరాత్రి 12 గంటలకే మొదలు పెడతారని ప్రచారం జరిగింది. రద్దీ పెరుగుతూనే ఉండడంతో 9 గంటలకే టోకెన్లు ఇస్తారని కూడా ప్రచారం జరిగింది. బుధవారం సాయంత్రం చీకటి పడే సమయానికి దాదాపు రెండు వేల మంది భక్తులు పార్క్‌లోకి చేరుకున్నారు. వీరిలో కొందరు ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోగా... మరికొందరు మాత్రం మూసివున్న పార్క్ గేట్ల ముందే ఎప్పుడెప్పుడు అవి తెరుస్తారా అని ఎదురు చూస్తున్నారు. రాత్రి 8 గంటల సమయంలో పార్క్‌లో ఉన్న భక్తుల్లో ఒక మహిళ అస్వస్థతతో సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో ఆమె భర్త... తమను బయటకు పంపాలని పోలీసులను ప్రాధేయపడ్డారు. పార్క్‌కు ఉత్తర, పశ్చిమ దిక్కుల్లో రెండు చిన్న గేట్లు ఉన్నాయి. వాటిని తెరిచి అస్వస్థతకు గురైన మహిళను బయటికి పంపితే సరిపోయేది. కానీ... ఇక్కడే పోలీసులు దిద్దుకోలేని పొరపాటు చేశారు. చిన్నగేట్లను కాకుండా... క్యూలైన్లలోకి దారితీసే ప్రధాన గేటును తెరిచి, ఆ మహిళను బయటికి పంపేందుకు ప్రయత్నించారు. రాత్రి 8.20గంటల సమయంలో పార్క్ ప్రధాన గేట్లను కొద్దిగా తెరిచారు. అప్పటికే అక్కడ గుంపుగా నిలబడి ఎదురుచూస్తున్న భక్తుల్లో కొందరు ఇది గమనించి... 'టోకెన్లు ఇస్తున్నారు. గోవిందా గోవింద' అని గట్టిగా అరిచారు. దీంతో పార్క్‌లో విశ్రాంతి తీసుకుంటున్న వారూ, అక్కడక్కడా కూర్చుని కబుర్లు చెప్పుకొంటున్నవారూ ఒక్కసారిగా లేచి గేట్ల వైపు పరుగులు తీశారు. పోలీసులు వీరిని అదుపుచేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. భక్తుల గోవింద నామ ఘోష మధ్య పోలీసుల హెచ్చరికలు ఎవరికీ వినిపించలేదు. గేట్లను మూసేందుకు చేసిన ప్రయత్నాలూ ఫలించలేదు. ఆతృత, అత్యుత్సాహం నిండిన భక్తులు బలవంతంగా గేట్లను నెట్టారు. ఇవతలవైపు పరిమిత సంఖ్యలో ఉన్న పోలీసులకు వారిని అదుపు చేయడం సాధ్యం కాలేదు. దీంతో ఒక్కసారిగా గేట్లు పూర్తిగా తెరచుకున్నాయి. వెల్లువెత్తిన ప్రవాహంలాగా జనం ముందుకు ఉరికారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరిగింది. కిందపడిపోయిన వాళ్లు మళ్లీ లేవలేకపోయారు. క్యూలైన్‌లోకి చేరడమే లక్ష్యంగా... జనం ముందుకు కదిలారు. ఈ తొక్కిసలాటలో ఊపిరాడక చాలామంది విలవిలలాడారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. కొన్ని నిమిషాల పాటు పూర్తిగా గందరగోళం! పోలీసులు కూడా కొద్దిసేపు అసహాయులుగా మిగిలిపోయారు. ఇదంతా బుధవారం రాత్రి 8.30 - 9 గంటల మధ్య జరిగింది.

బాధ్యత లేదా?.. తమాషా అనుకుంటున్నారా?

తిరుపతిలో అధికారులపై సీఎం చంద్రబాబు ఆగ్రహం

- డీఎస్పీ, టీటీడీ గోశాల డైరెక్టర్ల సస్పెన్షన్
- ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ జేఈవో గౌతమి, విజిలెన్స్ అధికారి శ్రీధర్‌లపై బదిలీ వేటు
- తొక్కిసలాటపై విచారణకు ఆదేశించిన ముఖ్యమంత్రి
- మృతుల కుటుంబాలకు 25 లక్షల పరిహారం
- కుటుంబంలో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం
- ప్రమాదస్థలి పరిశీలన.. బాధితులకు సీఎం పరామర్శ

తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారి వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ కేంద్రంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో అధికారుల తీరుపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బాధ్యత లేదా?.. తమాషా అనుకుంటున్నారా? అని మండిపడ్డారు. ఐదుగురు అధికారులపై అక్కడికక్కడే వేటు వేశారు. తొక్కిసలాట జరిగిన తిరుపతిలోని బైరాగిపట్టెడ కేంద్రం వద్ద విధుల్లో విఫలమైన డీఎస్పీ రమణకుమార్, ఆ కేంద్రం ఇన్‌చార్జి, టీటీడీ గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. పర్యవేక్షణ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ జేఈవో గౌతమి, టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీధర్‌ను బదిలీ చేస్తున్నట్టు వెల్లడించారు. చంద్రబాబు గురువారం మధ్యాహ్నం తిరుపతిలోని బైరాగిపట్టెడ టోకెన్ల జారీ కేంద్రాన్ని పరిశీలించారు. స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. తర్వాత అధికారులతో సమీక్షించారు. సాయంత్రం మీడియాతో మాట్లాడారు. "విశాఖలో ప్రధాని రూ.2.08 లక్షల కోట్ల పెట్టుబడులతో ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని సంతోషంగా విజయవాడ రాగానే తిరుపతి ఘటన తెలియడంతో మనసు వికలమైంది. తొక్కిసలాటలో మృతి చెందిన ఆరుగురి కుటుంబాలకు టీటీడీ నుంచి రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తాం. మృతుల కుటుంబాల్లో ఒకరికి చొప్పున టీటీడీలో కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తాం. తీవ్రంగా గాయపడిన ఇద్దరికి రూ.5 లక్షలు, సాధారణ గాయాలతో చికిత్స పొందుతున్న 33 మందికి రూ.2 లక్షల చొప్పున సాయం అందిస్తున్నాం. చికిత్స పొందుతున్న వారు ఎట్టి పరిస్థితుల్లోనూ శ్రీవారిని దర్శించుకునే తిరిగి వెళతామన్నారు. వారిని శుక్రవారం టీటీడీ అధికారులే తీసుకెళ్లి దర్శనం చేయించి, స్వస్థలాలకు చేర్చేలా ఆదేశాలిచ్చాం" అని చంద్రబాబు వివరించారు. తొక్కిసలాటపై న్యాయ విచారణకు ఆదేశిస్తున్నట్టు ప్రకటించారు. నివేదిక వచ్చాక బాధ్యులపై చర్యలు తీసుకొంటామని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని వెల్లడించారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న చంద్రబాబు

ఎప్పుడూ లేని సంప్రదాయాలు తెచ్చారు..

టీటీడీ గతంలో వైకుంఠ ఏకాదశి, ద్వాదశికి రెండు రోజులు మాత్రమే వైకుంఠ ద్వారదర్శనాలు కల్పించేదని చంద్రబాబు గుర్తు చేశారు. ఎంతమంది భక్తులు వచ్చినా తిరుమలలోనే వారికి టోకెన్లు జారీ చేసేవారన్నారు. కానీ, గత నాలుగైదేళ్లలో ఎప్పుడూ లేని సంప్రదాయాలను అమల్లోకి తెచ్చారన్నారు. తిరుపతిలో టోకెన్లు జారీ చేయడం అందులో ఒకటని, వైకుంఠ ద్వార దర్శనాలను పది రోజులపాటు కల్పించడం కూడా గతంలో లేదని చెప్పారు. ఆగమ శాస్త్రాన్ని, నిబంధనలను ఉల్లంఘించడం సరికాదన్నారు. టీటీడీ నిర్ణయాలపై బోర్డులో చర్చ జరగాలని, ఏది మంచిదో సమీక్షించి వాటిని అమలు చేయాలని స్పష్టం చేశారు. బైరాగిపట్టెడలోని పద్మావతి పార్కును, మున్సిపల్ స్కూలును టోకెన్ల జారీకి ఎంపిక చేయడమే పెద్ద తప్పని అభిప్రాయపడ్డారు. తొక్కిసలాట ఘటనలో అధికారుల తీరును చంద్రబాబు తీవ్రంగా తప్పుబట్టారు. 'మీరు ఏం ముందస్తు చర్యలు తీసుకున్నారు?' అంటూ టీటీడీ ఈవో శ్యామలరావును ప్రశ్నించారు. 'ఏం తమాషా అనుకుంటున్నారా?' అంటూ ఎస్పీ సుబ్బరాయుడుపై ఆగ్రహించారు. టీటీడీ జేఈవో గౌతమిపై మండిపడ్డారు.

టీటీడీలో ప్రక్షాళన జరగాలి: పవన్

టీటీడీకి సామాన్య భక్తులే ప్రాధాన్యం కావాలని, సమూలంగా ప్రక్షాళన జరిగితేనే అది సాధ్యమవుతుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన తర్వాత మీడియాతో మాట్లాడారు. చైర్మన్, ఈవో, ఏడీఈవోల మధ్య గ్యాప్ ఉన్నట్టు తెలుస్తోందన్నారు. కొండపై వీఐపీ సంస్కృతి ఆగిపోవాలి. 1100 మంది పోలీసులు, వంద మందికి పైగా అధికారులు బందోబస్తు చేసినా దుర్ఘటన జరగడం విచారకరం. ఎక్కడో నిర్లక్ష్యం కనిపించింది. గరుడసేవలో 4లక్షల మంది భక్తులు వస్తే దుర్ఘటనలు జరగనప్పుడు, బైరాగపట్టెడలో 2,500మంది వస్తే ఎందుకు జరిగింది? ఈవో, ఏడీఈవోలు బాధ్యత తీసుకోవాలి. తప్పు జరిగింది కాబట్టి పూర్తి బాధ్యత వహిస్తున్నాం. క్షమాపణలు చెబుతున్నా. ప్రభుత్వం నుంచి టీటీడీ బోర్డు సభ్యులు, పోలీస్ అధికారులు క్షమాపణ చెప్పి సంతాపం ప్రకటించాలి' అని అన్నారు.

రైతు భరోసాకు రూ.8,400 కోట్లు

- 26 నుంచి పంపిణీ, అదే రోజు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కూడా: భట్టి



మహబూబ్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గణతంత్ర దినోత్సవం రోజు, జనవరి 26 నుంచి రాష్ట్రంలో అమలు చేయనున్న రైతు భరోసా పథకం కోసం రూ.8,400 కోట్లు సిద్ధం చేశామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేల చొప్పున అందజేసే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కూడా జనవరి 26 నుంచే ప్రారంభిస్తామని తెలిపారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులదేనని అన్నారు. వనపర్తి జిల్లాలో గురువారం రెండు విద్యుత్ సబ్ స్టేషన్లను ప్రారంభించి మరో ఏడింటికి శంకుస్థాపన చేసిన భట్టి.. ఆ తర్వాత ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ప్రభుత్వం రోజూ 18 గంటలపాటు పనిచేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం రూ. 7 లక్షల కోట్ల అప్పును ప్రజల నెత్తిన మోపిందని దుయ్యబట్టారు. ఇబ్బందులున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మూడు నెలల్లోనే రూ. 22 వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు.

విద్యా శాఖ కార్యదర్శిగా యోగితా రాణా

- రవాణా శాఖ కమిషనర్‌గా సురేంద్ర మోహన్

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కీలకమైన రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శిగా ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న 2003 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి యోగితా రాణాను ప్రభుత్వం నియమించింది. ఇదివరకు విద్యా శాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న బుర్రా వెంకటేశంను ప్రభుత్వం టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించిన సంగతి తెలిసిందే. తాజాగా యోగితా రాణాను విద్యా శాఖ కార్యదర్శి పోస్టులో నియమించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. గనులు, భూగర్భ వనరుల శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్‌ను బదిలీ చేసి, రవాణా శాఖ కమిషనర్‌గా నియమించింది. ఈ గనులు, భూగర్భ వనరుల శాఖ కార్యదర్శి అదనపు బాధ్యతలను ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్‌కు అప్పగించింది.

రేవంత్ చేస్తోంది మంచి పనే

- 'హైడ్రా'పై వెంకయ్య నాయుడి స్పందన



హైదరాబాద్ సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): 'హైడ్రా' కూల్చివేతలపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్నది మంచి పనేనని అన్నారు. తెలంగాణలో కనుమరుగవుతున్న చెరువులను పరిరక్షించేందుకు రేవంత్ చేపట్టిన చర్యలను ఆయన అభినందించారు. అయితే ప్రభుత్వం అందరినీ సమదృష్టితో చూడాలని, ఆక్రమణ కూల్చివేతల కారణంగా నష్టపోయిన పేదలను ఆదుకోవాలని సూచించారు. దేశం బాగుండడం అంటే మనుషులతో పాటు నదులు, చెరువులు, అడవులు, పశువులు పక్షులు.. తదితరాలన్నీ బాగుండాలన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని లైఫ్ సైన్సెస్ విభాగంలో 'ఉన్నత్ భారత్ అభియాన్' పేరిట గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో వెంకయ్య నాయుడు మాట్లాడారు. గ్రామీణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన తనను రాజ్యాంగ పదవుల్లో కూర్చోబెట్టిన సమాజానికి ఎంతోకొంత సేవ చేయాలనే తలంపుతో పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలకు, సాంస్కృతిక సంస్థలకు వెళ్లి సహకారం అందిస్తున్నానని చెప్పారు. అలాగే హెచ్‌సీయూలో యుఆర్ అడ్వాన్స్ థెర్యాటిక్స్ పరిశోధనశాలలను ఆయన సందర్శించారు.

హాస్టళ్లను సందర్శించండి

- 29 మంది మహిళా ఐఏఎస్‌లకు సీఎస్ ఆదేశం

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తొలి దశలో 29 మంది మహిళా ఐఏఎస్‌లు రాష్ట్రంలోని బాలికల హాస్టళ్లను సందర్శించి, రాత్రి బస చేస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. బాలికల హాస్టళ్లను మహిళా ఐఏఎస్‌లు పరిశీలించి తరువాత ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వాలంటూ ప్రభుత్వం ఇదివరకు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ సందర్శనలపై గురువారం సచివాలయం నుంచి సీఎస్ రాష్ట్రంలోని మహిళా ఐఏఎస్‌లు, ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 540 బాలికల సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయని సీఎస్ తెలిపారు. హాస్టళ్లకు ప్రభుత్వం నిర్దేశించిన ఆహార పదార్థాలతో పాటు విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, హాస్టళ్ల నిర్వహణ తదితర అంశాలను పరిశీలిస్తారన్నారు. ఈ నెల 25వ తేది లోపు తొలిదశ పరిశీలన పూర్తి చేస్తారని, ఐఏఎస్‌ల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌పై సమీక్షిస్తామని తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై దృష్టి పెట్టండి

- మార్చి నెలాఖరుకు ప్రక్రియ పూర్తి కావాలి
- సమీక్షలో ముఖ్యకార్యదర్శి దానకిషోర్

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్(అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం) దరఖాస్తుల పరిష్కారంపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించాలని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిషోర్ ఆదేశించారు. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో గురువారం 142 పురపాలక సంఘాల కమిషనర్లతో ఎల్‌ఆర్‌ఎస్, రెవెన్యూ, రెవెన్యూయేతర పన్నుల వసూళ్ల లక్ష్యం, భువన్ సర్వే, మెప్మా కార్యకలాపాల ప్రగతి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేసేందుకు క్లియర్ పట్టా భూములు ఉండి, అనుమతులు లేని లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసేందుకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని దానకిషోర్ సూచించారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పారదర్శకంగా మార్చి నెలాఖరునాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. దరఖాస్తుదారులు భవన నిర్మాణ అనుమతులను తీసుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. భువన్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆస్తిపన్ను, ఇతర పన్నుల వసూళ్లలో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదని, క్షేత్ర స్థాయిలో వీటిపై దృష్టిపెట్టాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్, రెవెన్యూ మేళాలు, ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ మార్చి నెలాఖరులోగా వంద శాతం లక్ష్యాన్ని చేరాలని ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాల్లో అర్హులను చేర్పించాలని ఆదేశించారు. మెప్మా పరిధిలో స్వయం సహాయక సంఘాల సంఖ్యను పెంచాలని సూచించారు.

త్వరలో తెలుగు మాండలికాల గ్రంథస్థం

- తెలుగునాటక రంగాన్ని కాపాడతాం: ఏపీ మంత్రి దుర్గేశ్
- రాజమహేంద్రిలో ముగిసిన ప్రపంచ తెలుగు మహాసభలు

రాజమహేంద్రవరం/రాజానగరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు ముగిశాయి. శుక్రవారం చివరి రోజు కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారని, కిందస్థాయి నుంచి తెలుగు మాధ్యమం ప్రవేశపెట్టడం కోసం త్వరలో ప్రభుత్వం నిర్ణయం ప్రకటిస్తుందని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల ప్రభుత్వ పాలనలో తెలుగుభాష అడుగంటిపోయిందని, ఆంగ్ల మాధ్యమం బూచీని చూపించి తెలుగుభాషను పక్కన పెట్టారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే తెలుగు భాష పరిరక్షణకు శ్రీకారం చుట్టిందని, త్వరలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ తెలుగు మాండలికాలను సేకరించి గ్రంథస్థం చేయించి భావితరాలకు అందిస్తామని చెప్పారు. తెలుగునాటక రంగాన్ని కాపాడతామని, నంది నాటకాలు ప్రారంభించి, పౌరాణిక నాటకాలకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు.

పంచాయతీ ఉద్యోగులకు జీతాలు

(మొదటిపేజీ తరువాయి)

చెల్లించాలని అన్నారు. ఉపాధి హామీ పథకం కింద పెండింగ్‌లో ఉన్న బకాయిలు, పెండింగ్ బిల్లుల చెల్లింపుపై దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. గత ఏప్రిల్ నుంచి జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించాలని చెప్పారు. అలాగే, వివిధ పథకాల కింద కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు రాబట్టుకోవాలని అధికారులకు సూచించారు.



సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, కోమటిరెడ్డి తదితరులు

విమానాశ్రయంతో మహా వరంగల్: సీఎం

వరంగల్ మహా నగరంగా ఎదిగేలా విమానాశ్రయానికి రూపకల్పన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. వరంగల్ (మామూనూరు) విమానాశ్రయ భూ సేకరణ, ఇతర ప్రణాళికలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దక్షిణ కొరియాతో పాటు పలు దేశాలు తమ పెట్టుబడులకు విమానాశ్రయాన్ని ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయని, ఆయా దేశాల పెట్టుబడులు ఆకర్షించేలా వరంగల్ విమానాశ్రయం ఉండాలన్నారు. వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు విమానాశ్రయానికి అనుసంధానంగా ఉండాలని సీఎం సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఖమ్మం, కరీంనగర్, నల్గొండ జిల్లాల ప్రజలు భవిష్యత్‌లో వరంగల్ విమానాశ్రయం నుంచే రాకపోకలకు వీలుగా రహదారులు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. టెక్స్‌టైల్స్‌తో పాటు ఐటీ, ఫార్మా, ఇతర పరిశ్రమల అభివృద్ధితో హైదరాబాద్‌ను ప్రతిబింబించేలా వరంగల్ ఎదిగేలా ప్రణాళికలు ఉండాలని రేవంత్ సూచించారు.

నేడు కలెక్టర్లతో సీఎం సమావేశం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించనున్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల అంశాలపై చర్చించి, కలెక్టర్లకు దిశా నిర్దేశం చేయనున్నారు. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతు భరోసా కింద ఎకరానికి ప్రతి ఏటా రూ.12 వేల చొప్పున ఇస్తామని, భూమి లేని రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున భృతి అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. తెలిపారు. ఈ రెండు పథకాలకు సంబంధించి మార్గదర్శకాలు దాదాపు ఖరారయ్యాయి. రేషన్ కార్డులు లేనివారికి కొత్తగా రేషన్ కార్డులను జారీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు పాతవాటిలో కొత్త సభ్యుల పేర్లు చేర్చడం వంటి అంశాలను పరిష్కరించనున్నారు. రేషన్ కార్డుల కోసం ఈ నెల 15 నుంచి దరఖాస్తులను ఆహ్వానించే అవకాశముంది. ఈ మూడు అంశాలపై సీఎం ఉన్నతాధికారులు, కలెక్టర్లకు దిశా నిర్దేశం చేయనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. ఈ పథకాన్ని కూడా వీలైనంత త్వరగా ప్రారంభించాలని సీఎం సూచించనున్నారు.

14న ఢిల్లీకి సీఎం రేవంత్

- అక్కడి నుంచే సింగపూర్, దావోస్‌కు

ఈ నెల 14వ తేదీ సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లనున్నారు. 15న ఏఐసీసీ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. 16న కేంద్రమంత్రులను కలవనున్నారు. రాష్ట్ర ప్రాజెక్టులకు సంబంధించి వివిధ శాఖల మంత్రులకు వినతిపత్రాలు అందించనున్నారు. అలాగే పార్టీ అగ్రనేతలతోనూ సమావేశం అవుతారు. 17న ఢిల్లీ నుంచి సింగపూర్‌కు బయలుదేరుతారు. రాష్ట్రంలో క్రీడలు, స్టేడియం అభివృద్ధికి సంబంధించి అధ్యయనం చేసేందుకు సీఎం క్రీడల శాఖ ఉన్నతాధికారులతో కలిసి సింగపూర్, ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. అక్కడి నుంచి దావోస్ వెళతారు. 20 నుంచి 24 వరకు జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆయన పాల్గొనున్నారు. కాగా, రేవంత్ విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. ఓటుకు నోటు కేసు నేపథ్యంలో జప్తు చేసిన పాస్‌పోర్టును ఆరు నెలల పాటు తిరిగి ఇవ్వాలన్న అభ్యర్థనను ఏసీబీ కోర్టు అంగీకరించింది.

లోకం తీరు

అమెరికాలో కెనడాను విలీనం చేసుకుంటా: ట్రంప్



ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ ఫైనల్స్ నేడే

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్వియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) తుది అంకానికి చేరుకున్నాయి. తుది విజేతలు ఎవరో తేల్చే ఫైనల్స్ శుక్రవారం హైదరాబాద్‌లో జరగనున్నాయి. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 43 కేంద్రాల్లో ప్రాథమిక స్థాయి ముగ్గుల పోటీలు ఈ నెల 4, 5 తేదీల్లో జరిగాయి. ఆరు వేల మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతి కేంద్రంలో ప్రథమ స్థానం సాధించిన వారి నుంచి పదిమంది జిల్లాస్థాయి విజేతలుగా ఎంపికయ్యారు. వీరంతా హైదరాబాద్‌లో ఫైనల్స్‌లో పోటీ పడనున్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.30,000, మూడు ద్వితీయ బహుమతులు రూ.10,000 చొప్పున అందజేస్తారు. మరో ఆరుగురికి కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే అందరికీ స్పాన్సర్ల నుంచి గిఫ్ట్ హ్యాంపర్లు కూడా లభిస్తాయి. కొందరు సినీ, రాజకీయ, అధికార ప్రముఖులు ఈ ఫైనల్స్‌కు హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారు.

'బనకచర్ల' వివరాలు ఇవ్వండి

- గోదావరి బోర్డుకు తెలంగాణ లేఖ

హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు అందివమని గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ)ను తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ మేరకు బోర్డుకు తెలంగాణ అధికారులు లేఖ రాశారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఏపీ చేపట్టనున్న ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అందివ్వాలని బోర్డును కోరింది. స్పందించిన బోర్డు ఆ వివరాలు అందించడానికి సుముఖత తెలిపినట్లు సమాచారం.

బీరు ధరలో 70 శాతం ప్రభుత్వానికే!

- పన్నుల రూపంలో చెల్లిస్తున్నాం.. మాకు వచ్చేది 16% మాత్రమే
- ఐదేళ్లుగా ధరలు పెంచకపోవడంతో భారం: యునైటెడ్ బ్రూవరీస్

హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బీరు ధరలో దాదాపు 70 శాతం పన్నుల రూపంలో ప్రభుత్వమే తీసుకుంటోందని యునైటడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీ) తెలిపింది. తయారీ, సరఫరా ఖర్చులు పోగా తమకు వచ్చేది 16 శాతం మాత్రమేనని పేర్కొంది. ప్రస్తుతం అమలులో ఉన్న బీర్ల ధరలను 2019లో నిర్ణయించారని, గత ఐదేళ్లుగా నిర్వహణ వ్యయం పెరిగినా తెలంగాణ బెవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్) బీర్ల ధరలు పెంచలేదని తెలిపింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు పెరిగిపోవడం, ధరలు పెంచకపోవడంతో తమ బ్రాండ్లు కింగ్‌ఫిషర్, హీనెకెన్ బీర్ల అమ్మకాలను తెలంగాణలో నిలిపివేయాలని యూబీ సంస్థ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఎక్సైజ్ కమిషనర్‌కు బుధవారం లేఖ రాసింది. దీనిపై ఆ సంస్థ గురువారం ప్రకటన విడుదల చేసింది. ముడి సరకుల ధరలు, నిర్వహణ వ్యయం పెరగటంతో ధరలు పెంచాలని ఐదేళ్లుగా ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసినా స్పందన లేదని తెలిపింది. రాష్ట్రంలో తమ ఉత్పత్తులను మరింత పెంచాలన్నది తమ లక్ష్యమని, కానీ ఆర్థిక భారంతో అమ్మకాలు నిలిపివేయాలని నిర్ణయించామని తెలిపింది.

డిజైన్ లోపాలతోనే మేడిగడ్డ కుంగింది

- ఐఐటీ రూర్కీ అధ్యయనంలో నిర్ధారణ

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): భీకర వరదను తట్టుకునే వ్యవస్థలు లేకపోవడమే మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడానికి కారణమని ఐఐటీ రూర్కీ నిపుణుల నమూనా అధ్యయనం తేల్చింది. గేట్ల నుంచి వేగంగా దూకే వరదలో ఉండే పీడన శక్తిని నిర్వీర్యం చేయడానికి టెయిల్‌పాండ్ ప్రతిపాదించ లేదని, దీంతో దిగువ భాగంలో రక్షణ వ్యవస్థలు దెబ్బతిన్నాయని పేర్కొంది. డిజైన్లు, డ్రాయింగుల్లో లోపాలతోనే బ్యారేజీ కుంగిందని తెలిపింది. 2020-23 మధ్యకాలంలో వరుసగా నాలుగేళ్లు వరదలు రావడంతో బ్యారేజీ దిగువన మట్టి క్రమంగా కొట్టుకుపోయి గుంతలు సీకెంట్ పైల్స్ వరకు విస్తరించాయని, బుంగలను పూడ్చడంలో తాత్సారం చేయడంతో తీవ్రత పెరిగి బ్యారేజీ కుంగిపోవడానికి దారితీసిందని తేల్చింది. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ సిఫారసుతో ఈ అధ్యయనం చేయించారు. అధ్యయన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏకు పంపింది. కాగా, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై తక్షణమే నివేదిక అందించాలని కోరుతూ ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్‌కు ఈఎన్‌సీ (జనరల్) అనిల్‌కుమార్ లేఖ రాశారు. ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ సూచించిన పరీక్షలన్నీ నిర్వహించి, వివరాలు సమర్పించామని పేర్కొన్నారు.

పోస్టులు వస్తే పొంగిపోను.. లేవని కుంగిపోను

- అన్నింటికీ అతీతమే 'జగ్గారెడ్డి'
- ఎమ్మెల్యే అనో, మాజీ ఎమ్మెల్యే అనో అనేకన్నా జగ్గారెడ్డి అంటేనే ఇష్ట పడతా
- పోస్టులు వస్తాయి.. పోతాయి.. జగ్గారెడ్డి పర్మినెంట్
- చౌడమ్మతల్లి జాతరలో కళాకారులతో కలిసి సందడి

సంగారెడ్డి టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : "నన్ను మాజీ అనొద్దు.. ప్రజెంట్ అనొద్దు.. నాకు నచ్చేది నా పేరే. పోస్టులు వస్తాయ్.. పోతాయ్.. పోస్టులు వస్తే పొంగిపోను.. పోస్టు లేదని కుమిలిపోను.. అందుకే మాజీ, ప్రజెంట్ అనే వాటికంటే జగ్గారెడ్డి అనే పేరే పర్మినెంట్" అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తన మనసులో మాట పంచుకున్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎర్ధనూర్ గ్రామ శివారులో గుట్ట మీద ఉన్న చౌడమ్మ తల్లి జాతరకు గురువారం సీనియర్ కాంగ్రెస్ నేత చెర్యాల ఆంజనేయులుతో కలిసి జగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జన సందోహం నడుమ చౌడమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఒగ్గు కళాకారులతో కలిసి భక్త జనాన్ని హోరెత్తించారు. కాగా ఒక ఒగ్గు కళాకారుడు "మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాట్లాడుతారని చెప్పగా.. ఆయన పై విధంగా స్పందించారు. గెలిస్తే పొంగిపోయేది లేదని, ఓడితే కుంగిపోయేది లేదని అన్నారు. జగ్గారెడ్డి ఎప్పుడూ జగ్గారెడ్డిగానే ఉంటాడని స్పష్టం చేశారు. చౌడమ్మ తల్లిని దర్శించుకున్న వారికి మంచి జరుగుతుందని అన్నారు. భక్తులు అనేక కోరికలు కోరుకుంటారని.. వెనకా ముందు వారి కోరికలు నెరవేరుతాయని చెప్పారు. మన విశ్వాసం, మన నమ్మకమే మనల్ని బతికిస్తుందని.. ఏ కష్టం వచ్చినా కుంగిపోవడం సరికాదని అన్నారు.



సంగారెడ్డి జిల్లా ఎర్దనూర్ చౌడమ్మ జాతరలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

28 మంది ఎమ్మెల్యేలపై పెదవి విరుపు

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వని కారణంతో సగం మార్కులే పడిన ఎమ్మెల్యేలు 20 మంది వరకు ఆరెంజ్ జోన్‌లో ఉన్నారని చెబుతున్నారు. ఇందులో ఇద్దరు మంత్రులూ ఉన్నారట. కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలకు సమయం కేటాయించకుండా సొంత పనుల్లో మునిగిపోయిన ఎమ్మెల్యేలను రెడ్ జోన్‌లో ఉంచారని, ముగ్గురు మంత్రులు సహా 8 మంది ఎమ్మెల్యేలు ఈ జోన్‌లో ఉన్నారని పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఆరెంజ్, రెడ్ జోన్లు కలుపుకుని ఏకంగా ఐదుగురు మంత్రుల పనితీరుపై వారి నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు పెదవివిరవడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఏడాది పాలనలో ప్రభుత్వం పట్ల గ్రామీణ ప్రజల్లో ఒకింత అసంతృప్తి ఉన్నా.. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ అమలు, రైతు భరోసా, భూమిలేని వ్యవసాయ కార్మికులకు రూ.12 వేల సాయం ప్రకటనతో దాన్ని అధిగమించామని, స్థానిక సంస్థల ఎన్నికలను క్లీన్ స్వీప్ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి సహా పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. రాష్ట్రంలోని అన్ని జడ్పీటీసీ సీట్లనూ దక్కించుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది. అయితే దాదాపు 40శాతం మంది ఎమ్మెల్యేల పనితీరుపై స్థానిక కార్యకర్తలు, ప్రజలు పెదవి విరుస్తుండడం.. స్థానిక ఎన్నికల్లో ఏ మేరకు ప్రభావం చూపుతుందన్న ఆందోళన నెలకొంది. కొత్త ఏడాది పార్టీ ఎమ్మెల్యేలు తమ పనితీరు మార్చుకుని ప్రజలు, కార్యకర్తలతో మమేకం కావాలని ఇప్పటికే సీఎం సూచించారు. ఆయా ఎమ్మెల్యేలతో సీఎం త్వరలో భేటీ కానున్నారని, సర్వే వివరాలు తెలిపి తగు సూచనలు చేయనున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఇలాగైతే గట్టి పోటీ తప్పదా?

లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటునూ దక్కించుకోలేక పోయిన బీఆర్ఎస్ పార్టీకి.. తన మనుగడను చాటుకునేందుకు స్థానిక ఎన్నికలు కీలకంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల్లో 8 సీట్లు సాధించడమే కాకుండా లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 8 సీట్లు దక్కించుకున్న బీజేపీ.. ప్రత్యామ్నాయ రేసులో ముందుకొచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తన ఉనికిని చాటుకుంటే కానీ వచ్చే అసెంబ్లీ ఎన్నికలనాటికి ప్రత్యామ్నాయ రేసులో మిగిలే పరిస్థితి బీఆర్ఎస్‌కు ఏర్పడింది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలను బీఆర్ఎస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుందని, రెడ్, ఎల్లో జోన్లలో ఉన్న ఎమ్మెల్యేలు తమ పనితీరు మార్చుకోకుంటే పోటీ ఎదుర్కొనాల్సి రావచ్చని కాంగ్రెస్ ముఖ్యనేత ఒకరు చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ స్థానిక నాయకులకు ఆర్థిక వనరులూ పుష్కలంగా ఉన్నాయని గుర్తుచేశారు. పదేళ్ల పాటు ప్రభుత్వంతో పోరాడి, కేసులను ఎదుర్కొని ఆర్థికంగా నష్టపోయిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారని అన్నారు.

'భూభారతి'కి గవర్నర్ ఆమోదం!

(మొదటిపేజీ తరువాయి)

రూపొందించి చట్టాన్ని అమల్లోకి తేవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రజలకు సమగ్ర రెవెన్యూ సేవలందించాలన్న ఆశయంతో భూభారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు మంత్రి తెలిపారు. గవర్నర్ ఆమోదించిన భూభారతి బిల్లు కాపీని గురువారం రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణి వల్ల తెలంగాణలో సామాన్యులు, రైతులు అనేక భూ సమస్యలు ఎదుర్కొన్నారని చెప్పారు. గత ప్రభుత్వం తన స్వార్థ ప్రయోజనాల కోసం రెవెన్యూ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. కొందరి గుప్పిట్లో, కొందరికే పరిమితమైన రెవెన్యూ సేవలను గ్రామ స్థాయి వరకు సమర్థంగా అందించడానికి తమ ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టిందని చెప్పారు. ప్రతి గ్రామానికి ఒక అధికారిని నియమించబోతున్నామని, సంబంధిత కసరత్తు కొలిక్కి వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా భూభారతి చట్టాన్ని రూపొందించామని, ఈ చట్టాన్ని ఆమోదించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, అలాగే చట్టం తీసుకురావడానికి అన్ని విధాలా సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సహచర మంత్రులకు, ప్రజాప్రతినిధులకు, రేయింబవళ్లు శ్రమించి చట్టాన్ని రూపొందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇదీ నేపథ్యం..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 2024 జనవరిలో ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. ధరణిని సవరించాలా? లేక కొత్త చట్టం తేవాలా? అనే అంశంపై ఈ కమిటీ చర్చించింది. భూ సమస్యలకు సమగ్ర పరిష్కారాలు చూపాలంటే చట్టాన్ని మార్చాలనే అభిప్రాయం వ్యక్తమవడంతో మార్చి 2024 నుంచి భూభారతి ముసాయిదా బిల్లుపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. 2024 డిసెంబరు 18న అసెంబ్లీలో, 21న మండలిలో బిల్లును ప్రవేశపెట్టింది. బిల్లుకు గురువారం గవర్నర్ ఆమోదం తెలిపారు.

నిబంధనల్లోనూ ప్రజల భాగస్వామ్యం ఉండాలి

ప్రజల భాగస్వామ్యంతో తీసుకొచ్చిన భూభారతి చట్టం అమలు కోసం రూపొందించే నిబంధనల్లో కూడా ప్రజల భాగస్వామ్యం ఉండేలా చూస్తే చట్టం లక్ష్యం నెరవేరుతుంది. తెలంగాణ ప్రజల భూమి హక్కుల రికార్డుల సమస్యల పరిష్కారంలో భూభారతి కీలక మజిలీ అవుతుంది. ప్రజాస్వామ్యయుతంగా రూపొందించిన చట్టం అదే స్ఫూర్తితో భూ సమస్యలు తీర్చాలి.

- సునీల్, భూచట్టాల నిపుణుడు

దేవాదాయ శాఖ భూముల్లో ఆక్రమణల కూల్చివేత

- అత్తాపూర్ వద్ద 400 కోట్ల విలువైన 4.26ఎకరాల స్వాధీనం

రాజేంద్రనగర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలో సుమారు 35 సంవత్సరాలుగా అన్యాక్రాంతమైన రూ.400కోట్ల విలువ చేసే 4.26 ఎకరాల దేవాదాయ భూములను ఆ శాఖ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. దేవాదాయశాఖ రంగారెడ్డి జిల్లా సూపరింటెండెంట్ సి.మోహన్, అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, రాంబాగ్ శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయం ఈవో శ్రీనివాస్ తదితరుల నేతృత్వంలో దేవాదాయ శాఖ భూముల్లోని దుకాణాలను నేలమట్టం చేశారు. రాజేంద్రనగర్ పోలీసులు భారీ బందోబస్తు కల్పించారు. హైదర్‌గూడలో సర్వే నెంబర్లు 435, 446లో రాంబాగ్‌లోని శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయానికి చెందిన 4.26 ఎకరాల భూములు ఉన్నాయి. వీటిని కొంతమంది అక్రమించుకుని వారి ఏళ్లుగా వారి అధీనంలో పెట్టుకున్నారు. తర్వాత ఇతరులకు చిన్న చిన్న దుకాణాలు, మెకానిక్ షెడ్లు, కార్ మెకానిక్ షోరూమ్‌లు, క్రికెట్ గ్రౌండ్‌ల కోసం అద్దెకు ఇచ్చారు. దీనిపై దేవదాయశాఖ ట్రిబ్యునల్‌లో కేసు వేయగా 2017లో అనుకూలంగా తీర్పు రాగా, ఆక్రమణదారులు హైకోర్టును ఆశ్రయించారు. ఆ భూమి దేవదాయశాఖకు చెందినదేనని గత ఏడాది సెప్టెంబరు 26న తీర్పు వచ్చింది. అయినా కబ్జాలో ఉన్నవారు నిర్మాణాలను తీయకపోవడంతో దేవాదాయశాఖ అధికారులు వాటిని నేలమట్టం చేశారు. కాగా, రాజేంద్రనగర్‌లో హైడ్రా కూల్చివేతలంటూ సామాజిక మాధ్యమాల్లో జరిగిన ప్రచారంపై కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. ఆ కూల్చివేతలతో హైడ్రాకు సంబంధం లేదని పేర్కొన్నారు. ఎక్కడ కూల్చివేతలు జరిగినా హైడ్రాకు ఆపాదిస్తూ.. కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని అభిప్రాయపడ్డారు.

ఇందిరమ్మ స్కీమ్‌లో పారదర్శకతకు పెద్దపీట

- ఇండ్ల ఎంపికలో ఫిర్యాదులకు ప్రత్యేక వెబ్‌సైట్
- ప్రారంభించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, ఇండ్ల ఎంపికలో ఏమైనా సమస్యలు ఎదురైతే ఫిర్యాదు చేయాలని గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇందుకు వీలుగా ప్రత్యేక వెబ్‌సైట్ (indirammaindlu.telangana.gov.in)ను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇందులోని గ్రీవెన్స్ మాడ్యూల్‌కు అందిన ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు ఫిర్యాదుదారు ఫోన్‌కు సందేశం ద్వారా తెలియజేయనున్నట్టు తెలిపారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో గ్రీవెన్స్ మాడ్యూల్‌ను ప్రారంభించిన సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. మాడ్యూల్‌కు వచ్చిన ఫిర్యాదులు గ్రామాల పరిధిలో ఎంపీడీవోలు, పట్టణాల్లో మునిసిపల్ కమిషనర్ల ద్వారా సంబంధిత అధికారులకు వెళ్తాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పథకం అమలులో మధ్యవర్తులకు తావు లేకుండా అర్హులైన వారికే ఇల్లు మంజూరయ్యేలా పారదర్శకంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీలైనంత త్వరితగతిన ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లబ్ధిదారులు 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఎంత విస్తీర్ణంలోనైనా ఇంటిని నిర్మించుకోవచ్చని చెప్పారు. చివరి లబ్ధిదారుని వరకు ఇండ్లను మంజూరు చేసి నిర్మించే బాధ్యత తమ ప్రభుత్వానిదేనన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం ప్రభుత్వానికి అందిన దరఖాస్తుల పరిశీలన బుధవారంనాటికి హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో 95 శాతం మేర పూర్తయిందని మంత్రి పొంగులేటి తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 88శాతం వరకు పూర్తయిందన్నారు. త్వరలో లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి ఇళ్ల నిర్మాణానికి చేపట్టాల్సిన కార్యాచరణపై దృష్టిసారించాలని అధికారులకు సూచించారు.

కొత్తగా 3 కోర్సులకు నోటిఫికేషన్

- ఎండోస్కోపీ, టీవర్క్స్, మెడికల్ కోడింగ్‌లో కోర్సులు
- విడుదల చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ

హైదరాబాద్, జనవరి 9, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యువతకు ప్రైవేటు రంగంలో ఉపాధి, ఉద్యోగ కల్పన లక్ష్యంగా ఏర్పాటుచేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, కొత్తగా మరో మూడు కోర్సుల్లో ప్రవేశాలకు ప్రకటన జారీచేసింది. కిమ్స్, ఏఐజీ ఆస్పత్రులు, టీ వర్క్స్ భాగస్వామ్యంతో ఈ మూడు కోర్సులకు ప్రవేశ ప్రకటన ఇచ్చింది. మూడింటిలో ఏఐజీ హాస్పిటల్స్‌లో ఎండోస్కోపీ టెక్నీషియన్ శిక్షణ కార్యక్రమం ఒకటి. దీని కాల వ్యవధి ఆరునెలలు. ఇంటర్ (బైపీసీ)50శాతం మార్కులతో ఉత్తీర్ణులై, 25ఏళ్లలోపు ఉన్నవారు అర్హులు. ఎండోస్కోపీ ఆపరేషన్స్‌పై తరగతి గది, ప్రాక్టికల్ శిక్షణ రెండూ ఉంటాయి. దీనికి ఫీజు రూ.10వేలు. కోర్సు పూర్తయిన తర్వాత ఏఐజీతో పాటు ఇతర ఆస్పత్రుల్లో ఉద్యోగ అవకాశాలుంటాయి. ఇక రెండో కోర్సు... టీ వర్క్స్ ప్రోటోటైపింగ్ స్పెషలిస్ట్ కార్యక్రమం. కాల వ్యవధి; 2 నెలలు. పదో తరగతి ఉత్తీర్ణులై 18-25ఏళ్ల వయసున్నవారు అర్హులు. డిజైన్ థింకింగ్, క్యాడ్/క్యామ్‌పై అవగాహన కల్పించడం, 3డీ ప్రింటింగ్, వెల్డింగ్, సీఎన్‌సీ మెషిన్, అడ్వాన్స్‌డ్ ర్యాపిడ్ ప్రోటోటైపింగ్, ప్యాకేజింగ్, వుడ్, లేజర్ కటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. కోర్సు ఫీజు రూ.3వేలు. కోర్సు పూర్తిచేసినవారికి జూనియర్ ప్రోటో టైపింగ్ టెక్నీషియన్‌గా అవకాశాలు రావొచ్చు. ఇక మూడో కోర్సు... మెడికల్ కోడింగ్ అండ్ సాఫ్ట్ స్కిల్స్ ప్రోగ్రాం. కాల వ్యవధి 55 రోజులు. మెడికల్ కోడింగ్, సాఫ్ట్ స్కిల్స్, మాస్టర్ మెడికల్ టెర్మినాలజీ, కోడింగ్ సిస్టమ్స్‌పై శిక్షణ ఉంటుంది. బీఎస్సీ (లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులై 18-25ఏళ్ల మధ్య వయసున్నవారు అర్హులు. ఫీజు రూ.18వేలు. ఉత్తీర్ణులైనారు మెడికల్ కోడింగ్ ఎగ్జిక్యూటివ్, ట్రైనీ మెడికల్ అనువాదకులుగా ఉద్యోగాలు తెచ్చుకునేందుకు అవకాశాలుంటాయి.

స్కాన్ చేయండి.. అభిప్రాయం చెప్పండి

- పౌరుల అభిప్రాయాలు తెలుసుకోవడం కోసం పోలీస్‌శాఖ కొత్త ప్రయత్నం
- ప్రతి స్టేషన్‌లో క్యూఆర్ కోడ్
- ఫీడ్ బ్యాక్ ఆధారంగా పోలీస్ స్టేషన్లకు ర్యాంకులు
- స్కాన్ చేసి ఫిర్యాదు చేసేందుకు వెసులుబాటు
- క్యూఆర్ కోడ్ లాంచ్ చేసిన డీజీపీ జితేందర్

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పౌరులకు మెరుగైన సేవలను అందించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ ప్రత్యేక ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పోలీస్‌శాఖ గురించి, స్టేషన్లలోని సిబ్బంది గురించి ప్రజలేమనుకుంటున్నారు? పోలీస్ స్టేషన్లలో ప్రజలకు సరైన ఆదరణ లభిస్తోందా? ఫిర్యాదుదారులతో సిబ్బంది ఏ విధంగా ప్రవర్తిస్తున్నారు? అనే విషయాలు తెలుసుకోవడం కోసం ఓ క్యూఆర్ కోడ్‌ను రూపొందించారు. ఈ క్యూఆర్ కోడ్‌ను డీజీపీ జితేందర్ తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు క్యూఆర్ కోడ్‌ను తయారుచేశామని తెలిపారు. ఈ క్యూఆర్ కోడ్ తెలంగాణలోని అన్ని పోలీస్ స్టేషన్లలో, ఉన్నతాధికారుల కార్యాలయాల వద్ద, సోషల్ మీడియా, పోలీస్ వెబ్‌సైట్లల్లో అందుబాటులో ఉంటుందని చెప్పారు. క్యూఆర్ కోడ్‌ను ప్రజలు స్కాన్ చేస్తే ఇంగ్లిషు, తెలుగులో పేజీ తెరచుకుంటుందని, అందులో పోలీసుల గురించి ప్రశ్నలు ఉంటాయని వాటికి సమాధానాలు టైప్ చేసి పంపాలని లేదా వాయిస్ ద్వారా అయినా సమాధానం ఇవ్వవచ్చని డీజీపీ జితేందర్ తెలిపారు. అదే విధంగా ఎఫ్ఐఆర్ గురించి, ఈ చలాన్(ట్రాఫిక్ ఉల్లంఘనలు), పాస్‌పోర్టు ధ్రువీకరణ, ఇతర అంశాలపై ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని ఆయన చెప్పారు. ప్రస్తుత పోలీస్ సేవలపై ప్రజల అభిప్రాయాలు విశ్లేషించి వాటి ఆధారంగా సేవల ప్రమాణాలు మెరుగుపర్చనున్నామన్నారు. తద్వారా పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడం ప్రభుత్వ ఉద్దేశ్యమని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఆయా పోలీస్ స్టేషన్ల పనితీరుపై ర్యాంకులు ఇవ్వాలని నిర్ణయించామని వివరించారు. ఈ క్యూఆర్ కోడ్.. సీఐడీ విభాగం డీజీ షికాగోయల్ ఆధ్వర్యంలో రూపొందింది.

ఆరోగ్యశ్రీకి రూ.120 కోట్లు విడుదల

ఆరోగ్యశ్రీ పథకానికి ప్రభుత్వం రూ.120 కోట్లు విడుదల చేసింది. ఫిబ్రవరిలో మరో రూ.100కోట్లు విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. దీంతో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో యధావిధిగా ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగనున్నాయి. గురువారం నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ఆరోగ్యశ్రీ సీఈవో శివ శంకర్ చర్చలు జరిపారు. రోగులకు ఇబ్బంది కలగకుండా వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న నిధుల్లో కొంత విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో యధావిధిగా వైద్య సేవలు కొనసాగించేందుకు అసోసియేషన్ ప్రతినిధులు అంగీకరించినట్టు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది.

హరీశ్ అరెస్ట్ వద్దన్న ఆదేశాలను తొలగించండి

- హైకోర్టులో పంజాగుట్ట పోలీసుల కౌంటర్

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న హరీశ్‌రావును అరెస్ట్ చేయరాదంటూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలంటూ హైకోర్టులో పంజాగుట్ట పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. హరీశ్‌రావుకు వ్యతిరేకంగా ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, దర్యాప్తు ప్రారంభ దశలోనే ఉందని.. ఈ దశలో న్యాయస్థానం జోక్యం చేసుకోవడం వల్ల దర్యాప్తునకు తీవ్ర విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేట నుంచి హరీశ్‌రావుపై పోటీ చేసిన జీ చక్రధర్‌గౌడ్ అనే వ్యక్తి.. సిద్దిపేట నియోజకవర్గంలో తాను పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు హరీశ్‌రావు తనపై కక్షగట్టి క్రిమినల్ కేసుల్లో ఇరికించారని, తన ఫోన్ ట్యాపింగ్ చేయించారని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సదరు కేసును కొట్టేయాలని అభ్యర్థిస్తూ హరీశ్‌రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. హరీశ్‌రావును అరెస్ట్ చేయరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా గురువారం ఈ పిటిషన్ జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం ఎదుటకు వచ్చింది. అయితే, విచారణకు సమయం లేకపోవడంతో శుక్రవారానికి వాయిదా పడింది.

ప్రశ్నకు ప్రశ్నే జవాబు

(మొదటిపేజీ తరువాయి)


ఏసీబీ కార్యాలయం ఆవరణలో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

సమయంలో ఏసీబీ కార్యాలయానికి తన న్యాయవాది రాంచందర్‌రావుతో కలిసి వెళ్లిన కేటీఆర్ సాయంత్రం ఐదు తర్వాత బయటకు వచ్చారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ఒక గదిలో కూర్చోబెట్టి, ఆయన కన్పించే విధంగా మరికొంత దూరంలో న్యాయవాది రాంచందర్‌రావును కూర్చోపెట్టారు. విచారణ పూర్తిగా సీసీ కెమెరాలతో కవర్ అయ్యే విధంగా ఏర్పాట్లు చేశారు. విచారణ ప్రక్రియను ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి పర్యవేక్షించగా జాయింట్ డైరెక్టర్ రుతిరాజ్, అడిషనల్ ఎస్పీ శివరాం శర్మ, సీఐయూ యూనిట్ డీఎస్పీ మాజిద్‌ఖాన్ కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఫార్ములా-ఈ రేసు ఒప్పందం, క్యాబినెట్ ఆమోదం తీసుకోకపోవడం, డబ్బుల బదిలీ, సచివాలయ బిజినెస్ రూల్స్ ఉల్లంఘన, స్పాన్సరర్ కంపెనీతో సాన్నిహిత్యం తదితర విషయాలపై ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఈ కేసులో ఫిర్యాదుదారుడైన ఐఏఎస్ అధికారి దానకిషోర్ వాంగ్మూలం, సహనిందితుడైన ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ వాంగ్మూలం ఆధారంగా కూడా ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది.

పలు కోణాల్లో ప్రశ్నలు

ఫార్ములా-ఈ రేసు తొలి ఒప్పందం ఏ విధంగా జరిగింది? దీనికి స్పాన్సరర్‌గా గ్రీన్‌కో కంపెనీకి చెందిన ఏస్ నెక్ట్స్‌జెన్‌ను ఎందుకు ఎంపిక చేశారు? వారికి క్రీడల నిర్వహణలో ఎలాంటి అనుభవం లేకున్నా.. వారినే ఎంపిక చేయడానికి కారణాలేమిటి? టెండర్లకు వెళ్లకుండా ఆ కంపెనీకే ప్రత్యక్షంగా అవకాశం ఎలా ఇచ్చారు? చలమలశెట్టి అనిల్‌కు మీకు మధ్య ఉన్న అనుబంధం ఏమిటి? అనే ప్రశ్నలను కేటీఆర్‌ను అడిగినట్లు తెలుస్తోంది. ఫార్ములా-ఈ కారు రేసు 9వ సెషన్ పూర్తయిన తర్వాత 10వ సెషన్‌కు సంబంధించి స్పాన్సరర్ తప్పుకుంటున్నట్లు మీకు ఎవరు చెప్పారు? త్రైపాక్షిక ఒప్పందం నుంచి స్పాన్సరర్ తప్పుకుంటే ఆ కంపెనీపై చట్టపరమైన చర్యలకు ఎందుకు వెళ్లలేదు? లీగల్ నోటీసు ఇద్దామని పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్ కుమార్ చెబితే మీరేమన్నారు? లీగల్ నోటీసు ఎందుకు వద్దన్నారు? అంటూ ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించారు. అయితే, ఈ ప్రశ్నలకు కేటీఆర్ సమాధానాలు ఇవ్వకుండా ఎదురు ప్రశ్నలు వేశారని సమాచారం. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచటం కోసం తాను ఫార్ములా-ఈ కారు రేసును తీసుకొస్తే అందులో మీరు బొక్కలెతుకుతున్నారని కేటీఆర్ పేర్కొన్నట్లు తెలిసింది. ఏస్ నెక్ట్స్‌జెన్ విషయంలో నాటి అధికారుల సూచన మేరకే వ్యవహరించానని, ఎఫ్ఈఓతో పురపాలకశాఖ మరో ఒప్పందం చేసుకోవడంలో తప్పేముందని కేటీఆర్ ఎదురు ప్రశ్నించినట్లు సమాచారం. క్యాబినెట్ అనుమతి లేకుండా నిర్ణయం ఎలా తీసుకున్నారని ప్రశ్నించగా, క్యాబినెట్ అనుమతి లేకుండానే ఈ ప్రభుత్వం రేసును రద్దు చేసింది కదా! అని కేటీఆర్ పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పురపాలకశాఖ, ఎఫ్ఈఓ మధ్య ఒప్పందం జరిగితే పురపాలకశాఖ నిధులు వాడాలి కానీ, హెచ్ఎండీఏ నిధులు సుమారు రూ.46 కోట్లు ఎందుకు విదేశీ కంపెనీకి విదేశీ కరెన్సీ రూపంలో పంపించారు అని ప్రశ్నించగా, నిధుల ఖర్చు సంగతి అధికారులదని, విదేశీ కంపెనీకి వెళ్లిన డబ్బు అక్కడే ఉందని వారు చెబుతుంటే ఇక నిధులు దుర్వినియోగం అయ్యింది ఎక్కడ అని కేటీఆర్ బదులిచ్చారు. హెచ్ఎండీఏ నుంచి పది కోట్లపైన నిధులు తీసుకోవాలంటే ఆర్థికశాఖ అనుమతి తీసుకోవాలి కదా అన్న ప్రశ్నకు.. తనకు ఆ విషయం తెలియదని ఆయన సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. మొత్తమ్మీద హెచ్ఎండీఏ నుంచి రూ.56 కోట్లు దుర్వినియోగం అయ్యాయి కదా అని ప్రశ్నించగా, సెకండ్ సెషన్ నిర్వహిస్తే బీఆర్ఎస్‌కు పేరొస్తుందన్న కారణంతోనే ఈ ప్రభుత్వం ఆపివేసిందని, ప్రభుత్వానికి నష్టం చేసిన రేవంత్ రెడ్డిపైన కూడా కేసు నమోదు చేయాలని కేటీఆర్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. సచివాలయ బిజినెస్ రూల్స్ ఉల్లంఘన గురించి ప్రశ్నించినపుడు అదంతా ప్రధాన కార్యదర్శి పరిధిలోని అంశమని ఆమెనెందుకు ప్రశ్నించలేదని కేటీఆర్ పేర్కొన్నట్లు తెలిసింది.

కోడ్ అమల్లో ఉండగా.. నిధుల విడుదలా?

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో నిధుల విడుదలకు ఎలా అనుమతించారని ఏసీబీ అధికారులు ప్రశ్నించగా ఎన్నికల కమిషన్ తమకేమీ లేఖ రాయలేదని, అంతా అధికారులు చూసుకునే వ్యవహారమని కేటీఆర్ బదులిచ్చినట్లు సమాచారం. మొత్తానికి ఏసీబీ విచారణలో చాలా వరకు ప్రశ్నలకు తెలియదు అనే జవాబుతో పాటు.. ప్రశ్నకు ప్రశ్ననే కేటీఆర్ సంధించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కేటీఆర్‌ను ప్రశ్నలు అడిగే సమయంలో ఏసీబీ అధికారులు పలుమార్లు విరామం ఇచ్చారు. అయితే, మళ్లీ మళ్లీ అవే ప్రశ్నలు అడగటంతో ఒక దశలో కేటీఆర్ కొంత అసహనానికి గురై.. 'ఇదొక పనికిరాని కేసు.. నన్ను ఎందుకు వెంటాడుతున్నారు? ఇందులో కొత్తగా బయటపడేది ఏమీ లేదు. మీరు నన్ను అరెస్టు చేయదలచుకుంటే చేసుకోండి. మళ్లీ వేసిన ప్రశ్నలే వేయడం వల్ల ఉపయోగం లేదు' అని చెప్పినట్లు సమాచారం.

టెన్షన్‌లో కేటీఆర్!

విచారణ ప్రారంభించినప్పటి నుంచి కేటీఆర్ కొంత టెన్షన్‌గానే ఉన్నారని, పలుమార్లు అధికారులు విరామం ఇచ్చి ప్రశ్నలు అడిగినా ఆయనలో అసహనం కన్పించిందని, లంచ్ టైంలోనూ ముభావంగా ఉన్నారని సమాచారం. విచారణ ముగిసిన తర్వాత మీరు వెళ్లిపోవచ్చు అని ఏసీబీ అధికారులు చెప్పినపుడు కేటీఆర్ ముఖంలో ఆశ్చర్యం, ఆనందం కనిపించిందని.. మంచినీళ్లు తాగి ఆయన ఏసీబీ ఆఫీసు నుంచి బయటకు వచ్చేశారని తెలిసింది.

సంక్రాంతి తర్వాత మరోసారి విచారణ

తొలిరోజు విచారణలో ఏమీ బయటపడకపోవడంతో కేటీఆర్‌ను మరోసారి విచారణకు పిలవాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో మూడో నిందితుడైన బీఎల్ఎన్ రెడ్డి విచారణ కూడా ముగిసిన తర్వాత కేటీఆర్‌ను సంక్రాంతి పండుగ అనంతరం మళ్లీ పిలవవచ్చని తెలుస్తోంది.


ఈడీ కార్యాలయానికి చేరుకుంటున్న అర్వింద్‌కుమార్

నిబంధనలు తెలిసిన మీరు.. ఎలా ఉల్లంఘించారు?

- అర్వింద్ కుమార్‌ను ప్రశ్నించిన ఈడీ.. వాంగ్మూలం నమోదు
- నేడు బీఎల్ఎన్ రెడ్డిని విచారించనున్న ఏసీబీ

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసుకు సంబంధించి పురపాలక శాఖ మాజీ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్ కుమార్ గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) ముందు విచారణకు హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆయనను ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ)కు విదేశీ కరెన్సీలో నిధులు పంపించాలని హెచ్ఎండీఏను ఎందుకు ఆదేశించారు? విదేశీ కరెన్సీలో చెల్లింపులు జరిపినపుడు ఆర్‌బీఐ అనుమతి ఎందుకు తీసుకోలేదు? తదితర అంశాలపై ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. బుధవారం నాటి విచారణలో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి ఇచ్చిన జవాబుల ఆధారంగా కూడా కొన్ని ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. ఫెమా, పీఎంఎల్ఏ చట్టాల ఉల్లంఘన గురించి ప్రస్తావిస్తూ.. ఒక ఐఏఎస్ అధికారిగా మీకు అన్ని నిబంధనలు తెలిసినా ఎందుకు వాటిని ఉల్లంఘించారని ప్రశ్నించినట్లు సమాచారం. అర్వింద్ కుమార్ వాంగ్మూలాన్ని సైతం ఈడీ అధికారులు నమోదు చేశారు. కాగా, బీఎల్ఎన్ రెడ్డి శుక్రవారం ఏసీబీ విచారణకు హాజరుకానున్నారు. ఆయన వాంగ్మూలం కేసు దర్యాప్తులో కీలకం అవుతుందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. ఇదే కేసులో ఈ నెల 16వ తేదీన కేటీఆర్ ఈడీ ముందు హాజరు కానున్నారు.

సుప్రీంలో కేటీఆర్‌కు చుక్కెదురు

పిటిషన్‌పై అత్యవసర విచారణకు నిరాకరణ

15న విచారణ జరుపుతామని సీజేఐ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసులో నిందితుడిగా ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తక్షణమే విచారణ జరిపేందుకు న్యాయస్థానం నిరాకరించింది. శుక్రవారం అత్యవసర విచారణ చేపట్టాలని కేటీఆర్ తరఫు న్యాయవాదులు చేసిన విజ్ఞప్తిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా తోసిపుచ్చారు. ముందుగా లిస్ట్ చేసిన ప్రకారం ఈ నెల 15న విచారణ చేపడతామని స్పష్టం చేశారు. తనపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో ఆ తీర్పును సవాల్ చేస్తూ కేటీఆర్ మంగళవారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అత్యవసర విచారణ చేపట్టాలని న్యాయవాది మోహిత్‌రావు రిజిస్ట్రార్‌కు విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రార్ సీజేఐకి నివేదించడంతో కేటీఆర్ పిటిషన్‌పై విచారణకు ఈ నెల 15వ తేదీని కేటాయించారు. గురువారం మరోసారి కేటీఆర్ న్యాయవాదులు సీజేఐ బెంచ్ ముందు ప్రస్తావించారు. శుక్రవారం విచారణ జరపాలని కోరారు. స్పందించిన సీజేఐ.. అత్యవసర విచారణకు నిరాకరించారు.

కేటీఆర్.. దొరికిన దొంగ

కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడి దొరికిపోయిన దొంగ కేటీఆర్ అని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి విమర్శించారు. మతిస్థిమితం కోల్పోయి సీఎం రేవంత్‌పై అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నిబంధనలను ఉల్లంఘించి రూ.55కోట్ల ప్రజా ధనాన్ని విదేశీ కంపెనీలకు ఇచ్చి ఇప్పుడు నిజాయితీపరుడిలాగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తప్పు చేయకపోతే నిజాయితీని నిరూపించుకోవాలని సూచించారు. ఫార్ములా-ఈ రేసింగ్‌లో నిధుల దుర్వినియోగం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఏ విచారణ కైనా సిద్ధం అని చెప్పిన కేటీఆర్.. విచారణను అడ్డుకోవాలని ఎందుకు చూస్తున్నారని ప్రశ్నించారు. పదేళ్ల మంత్రిగా చేసిన వ్యక్తి లొట్టపీసు కేసు.. లొట్టపీసు సీఎం అని మాట్లాడవచ్చా? అని నిలదీశారు. కేటీఆర్ మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మండిపడ్డారు. నీటిపారుదల శాఖలోనూ బావ, బామ్మర్దులు(హరీశ్, కేటీఆర్) అనేక కుంభకోణాలకు పాల్పడ్డారని ఆరోపించారు. నాడు మంత్రిగా కేటీఆర్ చేసిన అక్రమాలకు ఇప్పుడు కొంతమంది ఐఏఎస్‌లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫార్ములా-ఈ కేసులో క్విడ్ ప్రోకో జరిగినట్టు స్పష్టమవుతోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. కేటీఆర్‌కు ఏ కోర్టులో ఊరట రావటం లేదంటే...తప్పు చేసినట్లు ఆధారాలు ఉన్నట్టే కదా? అని అన్నారు. చేసిన తప్పులకు కేటీఆర్ మూల్యం చెల్లించక తప్పదన్నారు. లుచ్చా పనులు చేసి విచారణకు వెళ్తున్న కేటీఆర్ లుచ్చా మాటలు మాట్లాడుతున్నాడని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య విమర్శించారు. తెలంగాణ ప్రతిష్ఠను పెంచానని ఇంకా పొంకణాలు కొడుతున్నాడని మండిపడ్డారు. అర పైసా అవినీతికి పాల్పడలేదని చెబుతున్న కేటీఆర్.. అనుమతి లేకుండారూ.55 కోట్లు ఎలా పంపించాడని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌పై నోటికొచ్చినట్టు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

రేవంత్.. నీలా మేం లుచ్చా పనులు చేయలే!

తెలంగాణను ప్రపంచపటంలో నిలిపేందుకు పనిచేశాం.. ఏడాదైనా నువ్వొక సీఎంవని ప్రజలు గుర్తించడం లేదు

- 'ఫార్ములా-ఈ' కేసులో అడగడానికి ఏసీబీ వద్ద ఏమీలేదు!
- నన్ను ప్రశ్నించేందుకు వారే ఇబ్బందిపడ్డారు: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారంలో తనను ప్రశ్నించడానికి ఏసీబీ అధికారుల వద్ద ప్రశ్నలేమీ లేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేసేందుకే ఫార్ములా-ఈ రేసింగ్ నిర్వహించామని, మరోసారి నిర్వహించేందుకు అడ్వాన్స్ చెల్లించామని చెప్పారు. ఇందులో అవినీతి, అక్రమం ఏమీ జరగలేదని స్పష్టం చేశారు. గురువారం ఏసీబీ విచారణకు హాజరైన అనంతరం పార్టీ శ్రేణులతో ఊరేగింపుగా తెలంగాణ భవన్‌కు చేరుకున్న ఆయన.. నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. "రేవంత్‌రెడ్డీ నీలాగా లుచ్చా పనులు మాకు రావు. మేం రూ.50 లక్షలతో దొరికిపోయిన దొంగలం కాదు. తెలంగాణ రాష్ట్రాన్ని, హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలపాలన్నది కేసీఆర్ లక్ష్యం. అందుకోసమే పనిచేశాం. మాకు భయంలేదు. ఎన్నికేసులు పెట్టినా.. ప్రజలకోసం నిన్ను ప్రశ్నిస్తూనే ఉంటాం. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజా సంక్షేమం కోసం కేసీఆర్ సైనికుడిగా మాట్లాడతా" అని కేటీఆర్ స్పష్టం చేశారు. "ప్రపంచ దేశాలతో పోటీపడి ఫార్ములా-ఈ రేసు హైదరాబాద్‌కు తెచ్చా. నగర ప్రతిష్ఠ కోసం, తెలంగాణను ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రంగా మార్చాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఏసీబీ అధికారులకు చెప్పా. నన్ను ప్రశ్నించడానికి వారే ఇబ్బందిపడ్డారు. ఏ అంశం లేకపోవడంతో ఆ ఫైల్ ఎక్కడకు వెళ్లింది? ఈ ఫైల్ ఎక్కడకు వెళ్లింది? అంటూ అడిగిన ప్రశ్నలనే అడిగారు. ఇక్కడి నుంచి పోయిన డబ్బులు ఫార్ములా-ఈ సంస్థ వద్ద ఉన్నాయని చెప్పా. అలాంటప్పుడు కేసు ఎక్కడ ఉందని, అవినీతే లేనప్పుడు ఏసీబీ కేసు ఎందుకని అడిగా. మంత్రిగా ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పా. పదేళ్ల నిబద్ధతతో బాధ్యతలు నిర్వహించినట్లు స్పష్టం చేశా" అని చెప్పారు. ఇప్పటికి ఏసీబీ వద్ద ప్రశ్నలు లేవని, ఒకవేళ రేవంత్‌రెడ్డి రాసిచ్చి, మరోసారి విచారణకు రమ్మంటే తప్పకుండా వెళ్తానని తెలిపారు. తనకు న్యాయస్థానాలు, చట్టాలపై నమ్మకం ఉందని.. విచారణకు సహకరిస్తానని అన్నారు. ఇది ముమ్మాటికీ లొట్టపీసు కేసని.. ఆయనొక లొట్టపీసు ముఖ్యమంత్రేనని విమర్శించారు. 'పదవిలోకి వచ్చి ఏడాది గడిచినా నువ్వొక సీఎంవని ప్రజలెవరూ గుర్తించడం లేదు. తెలంగాణ పరిస్థితి కనకపు సింహాసనమున శునకమును కూర్చోబెట్టినట్లుగా ఉంది' అని విమర్శలు గుప్పించారు. తెలంగాణ భవన్‌కు రాక ముందు ఏసీబీ కార్యాలయం బయట కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కక్షపూరిత కేసు పెట్టించిన సీఎం రేవంత్‌రెడ్డి ఏసీబీకి కొన్ని ప్రశ్నలు రాసిచ్చారని ఆరోపించారు. అడిగేందుకు ఏమీ లేకపోవడంతో అధికారులు 4 ప్రశ్నలనే 40 రకాలుగా అడిగారన్నారు. అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పాలని వారిని అడిగినట్లు కేటీఆర్ తెలిపారు. అధికారులు అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానం ఇచ్చానన్నారు. 'మీరు నమోదు చేసింది చెత్త కేసు. ఇందులో విషయమే లేదు. ప్రభుత్వ ఒత్తిడితో మీరేం చేస్తున్నారో మీకే తెలియడం లేదు' అని అధికారులతో అన్నట్లు కేటీఆర్ చెప్పారు. మీడియాతో మాట్లాడుతుండగా పోలీసులు అభ్యంతరం చెప్పడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.


కేటీఆర్‌ను భుజాలపై తీసుకువస్తున్న కౌశిక్‌రెడ్డి, కార్యకర్తలు

కేటీఆర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులు

కేటీఆర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులు గురువారం ఉదయం నుంచి నందినగర్‌లోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఎమ్మెల్సీ కవిత ఉదయాన్నే అక్కడికి చేరుకున్నారు. హరీశ్, ఇతర ముఖ్య నేతలు వచ్చి కేటీఆర్‌కు మద్దతు పలికారు. ఉదయం 9.50 గంటలకు కేటీఆర్ ఏసీబీ కార్యాలయానికి బయలుదేరి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన కేటీఆర్‌కు కవిత హారతి ఇచ్చి ఆహ్వానం పలికారు.

కేటీఆర్‌ను భుజాలపై మోసిన కౌశిక్‌రెడ్డి

విచారణ అనంతరం ఏసీబీ కార్యాలయం నుంచి కేటీఆర్ బయటకు వచ్చాక.. బీఆర్ఎస్ శ్రేణులు అక్కడి నుంచి తెలంగాణ భవన్‌కు ఊరేగింపుగా బయలుదేరి వెళ్లాయి. ఆ సమయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కేటీఆర్‌ను భుజాలపై మోస్తూ.. 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు.

ధర్నాలతో దద్దరిల్లిన బల్దియా ఆఫీసు

పెండింగ్ బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్ల డిమాండ్.. కమిషనర్ గేటు వద్ద 3 గంటలపాటు నిరసన

- పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నం
- మరో గేటు వద్ద మొండేదార్ సంఘం ప్రతినిధుల ధర్నా
- జియాగూడాలో కబేళా నిర్మించాలంటూ డిమాండ్
- కార్యాలయం 2 గేట్ల వద్ద ధర్నాలు
- జూన్‌లో చెల్లిస్తాం.. వచ్చేనెల రూ.500 కోట్లు వస్తాయి
- కాంట్రాక్టర్లతో మాట్లాడిన కమిషనర్

హైదరాబాద్ సిటీ/కవాడిగూడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): లోయర్ ట్యాంక్‌బండ్‌లోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ కమిషనర్ గేటు వద్ద జీహెచ్ఎంసీ పరిధిలో వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లు ప్లకార్డులు పట్టుకొని మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో ఓ కాంట్రాక్టర్ ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. అప్రమత్తమైన తోటి కాంట్రాక్టర్లు, పోలీసులు ఆయన ఒంటిపై నీళ్లు చల్లారు. అనంతరం ఆస్పత్రికి తరలించారు. దాదాపు మూడు గంటలపాటు కాంట్రాక్టర్లు బల్దియా ఆఫీస్ వద్ద బైఠాయించారు. బకాయిలు వెంటనే చెల్లించాలని.. లేదంటే పనులు చేసేది లేదని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఏడాదిగా రూ.1200 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ విషయంపై మాట్లాడేందుకు కమిషనర్ సమయమివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పలుమార్లు కలిసేందుకు ప్రయత్నించినా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని, అందుకే ధర్నా చేయాల్సి వచ్చిందన్నారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా జియాగూడ కబేళా నిర్మాణం వెంటనే చేపట్టాలని అరె కటిక మొండేదార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బల్దియా కార్యాలయంలోని మేయర్ గేటు వద్ద ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. జియాగూడ కబేళాపై ఆధారపడి వేల కుటుంబాలు జీవిస్తున్నాయని, సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మానవతా దృక్పథంతో ప్రభుత్వం స్పందించి కబేళా నిర్మించాలని కోరారు. కాగా అటు కాంట్రాక్టర్లు, ఇటు ఆరె కటిక మొండేదార్ సంఘం ప్రతినిధులు రెండు గేట్ల వద్ద ఏకకాలంలో ధర్నా చేయడంతో బల్దియా కార్యాలయంలోకి రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరిది సచివాలయంలో జరగాల్సిన సమావేశానికి వెళ్లాల్సి ఉన్నా ఆఫీసు దాటి బయటకు వెళ్లలేకపోయారు. కొద్దిసేపటి తర్వాత.. కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులతో కమిషనర్ మాట్లాడారు. జూన్ వరకు బకాయిలను ట్రేడ్స్ ద్వారా చెల్లిస్తామని, వచ్చేనెల నుంచి ప్రభుత్వం నెలకు రూ.500 కోట్లు ఇచ్చే అవకాశం ఉందని, ముందుకు పెండింగ్ లేకుండా బిల్లుల చెల్లింపులు జరుగుతాయని చెప్పారు.



కమిషనర్ గేటు వద్ద కాంట్రాక్టర్ల ధర్నా

వారానికి 90 గంటలు పనిచేయాలి

- ఎంత కాలమని భార్యలను చూస్తూ కూర్చుంటారు?
- ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలు

ముంబై, జనవరి 9: ఉద్యోగ జీవితం, వ్యక్తిగత జీవితంపై ప్రముఖ సంస్థ లార్సన్ అండ్ టూబ్రో (ఎల్‌అండ్‌టీ) చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. 'వారానికి 90 గంటలు పనిచేయాలి. అవసరమైతే ఆదివారాలూ బాధ్యతలు నిర్వర్తించాలి. ఎంత కాలం అని భార్యలను చూస్తూ కూర్చుంటారు?. వాళ్లయినా మిమ్మల్ని ఎంత సేపని చూస్తారు..? ఇంట్లో కంటే కార్యాలయంలోనే ఎక్కువ సమయం ఉంటామని వారికి చెప్పండి. నేను ఆదివారమూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. మీతో పని చేయించుకోలేక పోతున్నందుకు చింతిస్తున్నాను. ఆదివారమూ మీతో పని చేయిస్తేనే నాకు సంతృప్తి' అని సుబ్రహ్మణ్యన్ మాట్లాడిన వీడియో బయటకు వచ్చింది. ఉద్యోగుల సమావేశం సందర్భంగా.. శనివారం తప్పనిసరిగా పనిచేయాలా? అన్న ప్రశ్న రావడంతో ఆయన ఈ సూచనలు చేశారు. కాగా, ఈ వీడియో ఎప్పటిదో మాత్రం తెలియలేదు. ఆయన వ్యాఖ్యలు మాత్రం వైరల్‌గా మారాయి. విమర్శలకు దారితీశాయి.

10% తగ్గనున్న వరి, గోధుమల దిగుబడి

- లక్షలాది మంది ఆహార భద్రతకు ముప్పు
- ఐఎండీ డీజీ మృత్యుంజయ్ మహోపాత్ర

న్యూఢిల్లీ, జనవరి 9: వాతావరణ మార్పుల కారణంగా దేశంలో వరి, గోధుమల ఉత్పత్తి 6నుంచి 10% క్షీణించే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహోపాత్ర హెచ్చరించారు. ఇది రైతులతో పాటు లక్షలాది మంది పౌరుల ఆహార భద్రతపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా పెరుగుతున్న భూతాపంతో నీటి లభ్యత క్రమంగా తగ్గుతుండటంతో సమీప భవిష్యత్తులో హిమాలయాలు, దిగువ మైదాన ప్రాంతాల్లో నివసించే 200 కోట్ల మందికి పైగా తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటారని భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎం. రవిచంద్రన్ హెచ్చరించారు. వాతావరణ మార్పులపై వీరిద్దరూ పీటీఐ వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. పెరుగుతున్న అస్థిరతల కారణంగా వాతావరణంలో మార్పులను కచ్చితంగా అంచనా వేయడం కూడా కష్టంగా మారుతోందని వారు తెలిపారు.

బయోటెక్నాలజీ పరిశోధనల్లో మైలురాయి

- 10 వేల మంది భారతీయుల జీనోమ్ సీక్వెన్సింగ్ సమాచారం విడుదల చేసిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జనవరి 9: భారత ప్రధాని నరేంద్ర మోదీ 10వేల మంది భారతీయుల జన్యుక్రమ విశ్లేషణ(జీనోమ్ సీక్వెన్సింగ్) సమాచారాన్ని గురువారం విడుదల చేశారు. జీనోమ్ ఇండియా డేటాలోని ఈ సమాచారం విడుదల బయోటెక్నాలజీ పరిశోధనల్లో ఓ మైలురాయిని పేర్కొన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఆధ్వర్యంలో జరిగిన జీనోమ్ కాన్క్లేవ్‌లో వర్చువల్‌గా పాల్గొన్న మోదీ ఈ సమాచారాన్ని విడుదల చేశారు. ఇండియన్ బయోలాజికల్ డేటా సెంటర్(ఐబీడీసీ) అధీనంలో ఉండే ఈ సమాచారాన్ని పరిశోధన సంస్థలు అనుమతితో వినియోగించుకోవచ్చు. అయితే, ఈ కార్యక్రమానికి వీడియో సందేశం పంపిన మోదీ.. ఐఐటీలు, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్), బయోటెక్నాలజీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్(బీఆర్ఐసీ) వంటి 20 ప్రఖ్యాత సంస్థల కృషి వల్ల ఈ సమాచార సేకరణ జరిగిందని తెలిపారు. జన్యుపరమైన వ్యాధులు, అంటువ్యాధుల చికిత్సకు అధునాతన వైద్య విధానాల రూపకల్పనకు, వివిధ వర్గాలకు చెందిన ప్రజల జీవన విధానాలు, అలవాట్ల అధ్యయనానికి ఈ జీనోమ్ సీక్వెన్సింగ్ డేటా ఉపయోగపడుతుందని మోదీ పేర్కొన్నారు.

లాస్ ఏంజెలెస్ కార్చిచ్చు..

రూ.5 లక్షల కోట్ల నష్టం

ఐదుగురి దుర్మరణం.. 1.37 లక్షల మంది తరలింపు



వాషింగ్టన్, జనవరి 9: అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో కార్చిచ్చు అదుపులోకి రావడం లేదు. పాలిసాడ్స్ ఫైర్.. ఈటన్ ఫైర్.. సన్‌సెట్ ఫైర్.. ఇలా వేర్వేరు పేర్లతో ఆరు చోట్ల కార్చిచ్చు రగులుతూనే ఉంది. రెండ్రోజుల వ్యవధిలో వేల ఎకరాలు ఆహుతవ్వగా.. హాలీవుడ్ కొండలను అగ్ని చుట్టుముట్టింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు సహా.. పలువురు హాలీవుడ్ స్టార్ల ఇళ్లు బుగ్గిపాలవ్వగా.. ఐదుగురు పౌరులు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. గురువారం రాత్రి కడపటి వార్తలందేసరికి 2 వేలకు పైగా ఆవాసాలు దగ్ధమయ్యాయని, ఆస్తులు, వనరుల నష్టం విలువ రూ.5 లక్షల కోట్లు(57 బిలియన్ డాలర్లు)గా ఉంటుందని గుర్తించినట్లు తెలిపారు. 1.37 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. శుక్రవారం ఈ ప్రాంతంలో గాలుల వేగం మరింత ఎక్కువగా ఉంటుందని, కార్చిచ్చు ఇతర ప్రాంతాలకు విస్తరించే ప్రమాదముందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

హాలీవుడ్ చుట్టూ..

లాస్ ఏంజెలెస్ కార్చిచ్చులో అతిపెద్దదైన పాలిసాడ్స్ ఫైర్ కారణంగా 15,800 ఎకరాలు, ఈటన్ ఫైర్ వల్ల ఆల్టడేన, పసాడెనా ప్రాంతాల్లోని 10 వేల ఎకరాలు, సన్‌సెట్ ఫైర్ 5 వేలకు పైగా ఎకరాలు, హూరెస్ట్ ఫైర్ సైల్మర్‌లో 700 ఎకరాలు, లిడియా ఫైర్ 340 ఎకరాలను బుగ్గిపాలు చేయ గా.. ఉడ్లీ ఫైర్‌ను అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తీసుకొచ్చారు. సన్‌సెట్ ఫైర్ ప్రస్తుతం హాలీవుడ్ కొండలను చుట్టుముట్టిందని, వేగంగా విస్తరిస్తోందని, హెలికాప్టర్ల ద్వారా నీటిని చిమ్ముతున్నా అదుపులోకి రావడం లేదని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం(గురువారం రాత్రి కడపటి వార్తలందేసరికి) హాలీవుడ్‌కు 8 మైళ్ల దూరంలో మంటలు కొనసాగుతున్నాయి. స్టూడియో సిటీ, రన్‌యాన్‌కెనాన్‌లో పలు ఇళ్లు దగ్ధమయ్యాయి. రియాల్టీ టీవీ స్టార్ పారిస్ హిల్టన్, నటులు యూజీన్ లెవీ, బిల్లి క్రిస్టల్, జాన్ గుడ్‌మన్ ఇళ్లు కూడా దగ్ధమయ్యాయి. స్టూడియో సిటీ పరిసరాల్లో చాలామంది సినీతారలు ఇళ్లను, సంపదను కోల్పోయారు. ఇప్పటి వరకు 2 వేల ఇళ్లు (లగ్జరీ విల్లాలు కలిపి) బుగ్గిపాలవ్వగా, రూ.5లక్షల కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు లెక్కతేల్చారు. ఈ నష్టం ఇంకా ఎక్కువగా ఉంటుందని, 2005లో నెలకొన్న కార్చిచ్చు తర్వాత ఇదే అతిపెద్ద వినాశకారిగా ఉందని పేర్కొన్నారు. 1.37 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని, ఈ ప్రాంతంలో గాలిలో నాణ్యత(ఏక్యూఐ) దారుణంగా ఉందని వివరించారు.

ఆస్కార్ వేడుకలపై నీలినీడలు!

మాలిబు మొదలు.. శాన్ డియాగో కౌంటీ వరకు దక్షిణ కాలిఫోర్నియాలో 1.6 కోట్ల జనాభా ఉంటుం ది. ఈ ప్రాంతాలకు అధికారులు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు 'శాంటాఅనా' గాలులు బలంగా వీస్తాయని, దీంతో.. పరిస్థితులు మరింత జటిలంగా మారే ప్రమాదాలున్నాయని హెచ్చరించారు. ఈ హెచ్చరికలతో హాలీవుడ్‌లో జరగనున్న ఆస్కార్ వేడుకలపై నీలినీడలు కమ్ముకున్నాయని, పలు క్రీడలు(లీగ్‌లు), సాంస్కృతిక కార్యక్రమాలకు బ్రేకులు పడ్డాయని అమెరికా పత్రికలు పేర్కొన్నాయి. మాలిబులో అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ ఇల్లు కూడా అగ్నికి ఆహుతైంది. ఈ లగ్జరీ ఇంటిని 1950లో నిర్మించారు. అయితే.. ఈ ఘటనపై తనకు సమాచారం లేదని బైడెన్ తెలిపారు.

ఏఐతో 9.2 కోట్ల ఉద్యోగాలు ఉష్!

- ఉద్యోగులను తగ్గించుకోనున్న 41 శాతం కంపెనీలు
- ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఉద్యోగులపై ప్రభావం
- వరల్డ్ ఎకానమిక్ ఫోరం తాజా నివేదిక

న్యూఢిల్లీ, జనవరి 9: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ).. ప్రస్తుతం సాంకేతిక రంగాన్ని శాసిస్తోంది. పోటీ ప్రపంచంలో దూసుకుపోవాలంటే ఏఐ ఆధారిత స్కిల్స్ తప్పనిసరి అనే పరిస్థితి నెలకొంది. ఇది మంచిదే అయినప్పటికీ.. రాబోయే రోజుల్లో ఈ కృత్రిమ మేధ(ఏఐ) వల్ల ఉద్యోగాలు భారీగా కోల్పోయే ప్రమాదం ఉందని 'వరల్డ్ ఎకానమిక్ ఫోరం ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్' తాజా నివేదిక పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 41% కంపెనీలు ఉద్యోగులను తగ్గించుకోవాలని భావిస్తున్నాయని తెలిపింది. ఏఐ వల్ల 2030 నాటికి 17 కోట్ల కొత్త ఉద్యోగాలు వస్తాయని అంచనా వేసిన ఈ నివేదిక.. 9.2 కోట్ల ఉద్యోగాలు పోతాయని తెలిపింది. ఏఐ టూల్స్ అభివృద్ధి, డిజైన్ చేసే నైపుణ్యం కలిగిన కొత్త వారిని నియమించుకోవడానికి 70% కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయని పేర్కొంది. భవిష్యత్తులో ఏఐ, బిగ్ డేటా, సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలకు అధిక డిమాండ్ ఉంటుందని వెల్లడించింది. ఏఐ పాత్ర పెరిగినప్పటికీ.. సృజనాత్మక ఆలోచన, క్రియాశీలత వంటి మానవ నైపుణ్యాలు కూడా కీలకమేనని తెలిపింది. జనరేటివ్ ఏఐ, టెక్నాలజీలో వేగంగా వస్తున్న మార్పులు.. పరిశ్రమలు, కార్మిక రంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయని, ఈ నేపథ్యంలో వ్యాపారులు, ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందని, నైపుణ్య రంగాల్లో పెట్టుబడులు పెట్టి, స్థిరమైన ప్రపంచ శ్రామిక శక్తిని నిర్మించాల్సిన అవసరం ఉందని వరల్డ్ ఎకానమిక్ ఫోరం ప్రతినిధి టిల్ లియోపోల్డ్ చెప్పారు.

'ఇండీ' కూటమి లేనట్లేనా?

- కాంగ్రెస్‌కు 'చేయి'స్తున్న మిత్రపక్షాలు
- ఢిల్లీ ఎన్నికల్లో 'ఆప్'కు మద్దతిస్తున్న సమాజ్‌వాదీ, టీఎంసీ, ఉద్ధవ్ సేన
- కూటమిని మూసేయాలన్న ఒమర్ అబ్దుల్లా

న్యూఢిల్లీ, జనవరి 9: బీజేపీని ఓడించడమే లక్ష్యంగా గత లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆవిర్భవించిన 'ఇండీ' కూటమి ఉనికి ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు. ఒక్కో భాగస్వామ్య పార్టీ ఒక్కో తీరుగా వ్యవహరిస్తోంది. లోక్‌సభ ఎన్నికల వరకే ఈ కూటమి పరిమితమైతే.. దానిని మూసివేయడం మంచిదని జమ్మూకశ్మీరు సీఎం, ఎన్‌సీ సీనియర్ నేత ఒమర్ అబ్దుల్లా అన్నారు. కూటమి నాయకత్వం, భావి వ్యూహాలకు సంబంధించిన ఎజెండాపై స్పష్టత లేకుండా పోయిందని ఆక్షేపించారు. భాగస్వామ్య పక్షాలైన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), కాంగ్రెస్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో వేటికవి బరిలోకి దిగడం.. పరస్పరం విమర్శలు చేసుకుంటుండడం.. సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్, టీఎంసీ, ఉద్ధవ్ శివసేన బహిరంగంగానే ఆప్‌కు మద్దతు ప్రకటించడం.. వారికి 'ఎక్స్' వేదికగా ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ధన్యవాదాలు తెలియజేయడం తెలిసిందే. ఇండీ కూటమి లోక్‌సభ ఎన్నికలవరకే పరిమితమని బిహార్‌లో ఆర్‌జేడీ యువనేత, మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ కొద్దిరోజుల కిందట అనడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

మార్చి 14లోపు స్కీం సిద్ధం చేయండి

- రోడ్డు ప్రమాద బాధితులకు నగదురహిత చికిత్సపై కేంద్రానికి సుప్రీం కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 9: రోడ్డు ప్రమాద బాధితులకు నగదురహిత చికిత్స విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. క్షతగాత్రులకు సకాలంలో ఉచిత చికిత్స అందేలా మార్చి 14లోపు పథకం రూపొందించాలని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిహ్ ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది. ఆ పథకం విధి విధానాల కాపీని, అమలు తీరును వివరిస్తూ మార్చి 21కల్లా అఫిడవిట్ సమర్పించాలని నిర్దేశించింది. మోటారు వాహనాల (ఎంవీ) చట్టంలోని సెక్షన్ 162(2) ప్రకారం రోడ్డు ప్రమాద బాధితులకు నగదురహిత చికిత్స అందించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేసింది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన అనేక మంది సకాలంలో చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపింది. ప్రమాదం జరిగిన తర్వాత గంటలోపు సమయాన్ని 'గోల్డెన్ అవర్'గా ఎంవీ చట్టం నిర్వచించిందని, గాయపడినవారికి ఆ వ్యవధిలోపు చికిత్స అందకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొంది. అయితే ఈ పథకంలో రోడ్డు ప్రమాద బాధితుల చికిత్సకు ఒక్కొక్కరికి రూ.1.50 లక్షలు ఇస్తామని కేంద్రం ప్రకటించిందని, ఈ మొత్తం సరిపోదని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. ఆయా అంశాలనూ పరిగణనలోకి తీసుకుని పథకానికి తుదిరూపు ఇవ్వాలని సుప్రీం కోర్టు కేంద్రాన్ని ఆదేశించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.